www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

హాకీ.. ఆశల పల్లకీ

పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్స్‌కు చేరిన భారత్

బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్ ఓటమి.. నేడు కాంస్య పోరు

బాక్సింగ్ క్వార్టర్ ఫైనల్స్‌లో లవ్లీనా పరాజయం 11

ఒత్తిడిలోనూ ప్రత్యర్థులను హడలెత్తిస్తూ భారత పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో పతకం దిశగా దూసుకెళ్తోంది. వరుసగా రెండోసారి సెమీఫైనల్ చేరింది. ఆదివారం హోరాహోరీ క్వార్టర్స్‌లో 4-2తో షూటౌట్‌లో గ్రేట్ బ్రిటన్‌ను ఓడించింది.



సోమవారం | 5-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 128

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి సా. 6.04 తదుపరి విదియ; నక్షత్రం: ఆశ్లేష మ. 3.21 తదుపరి మఖ; వర్జ్యం: తె.4.32 మొదలు; దుర్ముహూర్తం: మ.12.46-1.37, మ.3.19-4.09; అమృతఘడియలు: మ.1.37-3.21; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.42

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డాక్టర్లు ఏరీ?

పెద్దాస్పత్రుల్లో బదిలీ అయిన స్థానాల్లో నియామకాలు కరువు



రోగులతో కిక్కిరిసిన ఉస్మానియా ఆస్పత్రి

'లాంగ్‌స్టాండింగ్' పేరిట నిపుణులకూ బదిలీలు

వారి స్థానాల్లో కొత్తవారిని నియమించని ప్రభుత్వం

వ్యాధుల సీజన్ కావడంతో జ్వరాల బారిన ప్రజలు

ఆస్పత్రులకు బారులు తీరుతున్న రోగులు

వైద్యులు, సిబ్బంది లేమితో అందని వైద్యసేవలు

పలు విభాగాల్లో వాయిదా పడుతున్న శస్త్రచికిత్సలు

జూనియర్లు, పీజీ విద్యార్థులతో నెట్టుకొస్తున్న వైనం

ఉస్మానియాలో అన్ని విభాగాల్లో ఖాళీలే..

(హైదరాబాద్ సిటీ/న్యూస్‌నెట్ వర్క్, ఆంధ్రజ్యోతి)

అసలే వ్యాధులు ప్రబలే సీజన్. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్ల వంటివి విజృంభిస్తున్న సమయం. పెద్దాస్పత్రులు వందల సంఖ్యలో రోగులతో కిక్కిరిసిపోతున్న పరిస్థితి. వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాల్సిన సమయం. ఇలాంటి కీలక పరిస్థితుల్లో పెద్దాస్పత్రుల్లో బదిలీలు చేపట్టిన ప్రభుత్వం.. ఖాళీ అయిన స్థానాల్లో నియామకాలు మాత్రం జరపలేదు. బదిలీలు జరిగిన స్థానాల్లో సగం మందిని కూడా నియమించలేదు. దీంతో ఆస్పత్రులకు పెద్దసంఖ్యలో వస్తున్న రోగులు తగిన వైద్యసేవలందక అవస్థలు పడుతున్నారు. దీనికితోడు సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్నారనే కారణంతో

మిగతా 13వ పేజీలో...



ఏఐ సిటీలో 8 హబ్‌లు

ముచ్చర్లలో 15వేల ఎకరాల్లో భావి నగరం

ఓఆర్ఆర్ వెంట 30 వేల ఎకరాల పూలింగ్

ఉప్పల్ భగాయత్ తరహా విధానం అమలు

రూ.5600 కోట్లతో మూసీ ప్రక్షాళన

ఆర్ఆర్ఆర్ వరకూ హెచ్ఎండీఏ పరిధి

మునిసిపల్ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అంటే ఒకప్పుడు జంట నగరాలే! ఆ తర్వాత ఐటీ బూమ్‌తో సైబరాబాద్ రూపంలో మూడో మహానగరం ఆవిష్కృతమైంది!! ఈ మూడింటికీ తోడుగా.. ముచ్చర్లలో అభివృద్ధి చెందే నాలుగో మహానగరం కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో ఫ్యూచర్ సిటీగా అత్యద్భుతంగా ఉండబోతోందని మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తెలిపారు. హైటెక్స్‌లో ఆదివారం జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ల నుంచి వచ్చే విజ్ఞప్తులను ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. జీడీపీలో అధిక శాతం ఉన్న ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్ వచ్చి ఆర్థిక వ్యవస్థను ఏవిధంగా పరుగులు పెట్టించిందో.. ఏఐ కూడా ముచ్చర్లలో రాబోయే సిటీలో గణనీయమైన మార్పులు తీసుకొస్తుందని దానకిశోర్ తెలిపారు. ఏఐ సిటీని 15వేల ఎకరాల్లో

మిగతా 3వ పేజీలో...

యూట్యూబర్లపై ఆంక్షల పిడుగు!

ప్రసార సేవల నియంత్రణ సవరణ బిల్లు పేరిట నిబంధనాలు



కేంద్రం అతి గోప్యత.. కొద్దిమందితోనే చర్చలు

వారికే కాపీలు.. వేర్వేరుగా వాటర్‌మార్క్‌లు

నిఘాలోకి యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు

విమర్శకులకు ఇక మీదట గడ్డు పరిస్థితులు

నిబంధనలు కఠినం.. భారీ జరిమానా, నిషేధం

బిల్లు చట్టం అయితే భావప్రకటన స్వేచ్ఛ ఖతం

సోషల్ మీడియాపై ఉక్కుపాదమే: విపక్షాలు

అండగా నిలవాలని యూట్యూబర్ల వేడుకోలు

లోక్‌సభ ఎన్నికల్లో పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు తమకు వ్యతిరేకంగా పని చేశారని మోదీ ప్రభుత్వం భావిస్తోందా? తాము ఆశించిన ఫలితాలు రాకపోవటానికి, ప్రతిపక్షం అంతోఇంతో బలం సమకూర్చుకోవటానికి వీరు విస్తృతంగా జరిపిన ప్రచారమే కారణమని అనుకుంటోందా? ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాను, యూట్యూబర్లను, స్వతంత్ర జర్నలిస్టులను కూడా ప్రభుత్వ నియంత్రణ కిందికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోందా? 'ప్రసార సేవల నియంత్రణ బిల్లు' విషయంలో గోప్యత, బిల్లులో ఉన్నాయని భావిస్తున్న కఠినమైన ఆంక్షలు ఈ సందేహాలను రేకెత్తిస్తున్నాయి. దీంతో బిల్లుపై ప్రతిపక్షాల నుంచి యూట్యూబర్ల వరకూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

(సెంట్రల్ డెస్క్)

'ప్రసార సేవల నియంత్రణ బిల్లు' తొలి ముసాయిదా గత ఏడాది విడుదలైంది. ప్రధానంగా ఓటీటీ వేదికలు, ప్రసార సంస్థలను ఉద్దేశించి రూపొందించిన ఈ బిల్లుపై అప్పట్లోనే ఆందోళన వ్యక్తమైంది. లోక్‌సభ ఎన్నికలు రావటంతో ఈ అంశం తాత్కాలికంగా తెరమరుగైంది. ఎన్నికలు ముగిసి మోదీ వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తాజాగా మరోసారి బిల్లు చర్చనీయాంశమైంది. ఈ బిల్లులో పలు సవరణలు చేసి, ఎంపిక చేసిన కొందరికి ఇటీవల అందజేశారని, వారితోనే దీనిపై సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడైంది. అంతేకాదు, బిల్లు కాపీని ఇచ్చిన ప్రతీ వ్యక్తికీ ఆ బిల్లుపై ఓ ప్రత్యేకమైన వాటర్‌మార్క్ ముద్రించారని, ఒకవేళ ఎవరైనా బిల్లును 'లీక్' చేస్తే ఎవరి ద్వారా అది జరిగిందో తెలుసుకోవటానికి

మిగతా 2వ పేజీలో...



అమెరికా చేరిన రేవంత్

న్యూయార్క్‌లో సీఎంకు ఘన స్వాగతం 13

మూడో ప్రపంచ యుద్ధం.. ముప్పు అంచున?

ఇజ్రాయెల్‌పై కయ్యానికి కాలుదువ్వుతున్న ఇరాన్

ఇరాన్‌కు రష్యా.. ఇజ్రాయెల్‌కు అమెరికా, యూకే అండ

'అబ్రహాం కూటమి' ఏర్పాటుకు నెతన్యాహు ప్రతిపాదన

హెజ్బొల్లా, హౌతీ, హమాస్‌తో ఇరాన్ ఏర్పాటు చేసిన ప్రాక్సీ నెట్‌వర్క్‌ను కూటమిగా ఏర్పడి దెబ్బతీసే యోచన



టెహ్రాన్, టెల్ అవీవ్, ఆగస్టు 4: చినికి చినికి గాలివానగా మారిందన్న సామెత చందంగా.. ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణ ఇరాన్ ప్రవేశంతో మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితి కనిపిస్తోంది! ఇజ్రాయెల్‌కు అండగా రంగంలోకి దిగేందుకు అమెరికా ఇప్పటికే సిద్ధం కాగా.. ఇరాన్‌కు సైనిక సాయం అందించేందుకు రష్యా సిద్ధమైనట్లు సమాచారం. తమ దేశంలో అతిథిగా ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో

మిగతా 2వ పేజీలో...

బంగ్లాదేశ్‌లో మళ్లీ రక్తపాతం

అల్లర్లలో 93 మంది మృతి

వందలాది మందికి తీవ్ర గాయాలు

ప్రధాని షేక్ హసీనా రాజీనామా డిమాండ్‌తో విద్యార్థుల నిరసనలు 2

అధికార పార్టీ శ్రేణులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ హింసాత్మకం

చాక్లెట్ ఆశ చూపి.. చిన్నారి అపహరణ 3

18 గంటల్లోనే రక్షించిన పోలీసులు

నిందితుడు బిహారీ.. హైదరాబాద్‌లో ఘటన

షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసుల దాడి

విచక్షణారహితంగా కొట్టిన ఇన్‌స్పెక్టర్

ఘటనపై విచారణకు సీఎం ఆదేశం 12

నేడు సాగర్ గేట్లు ఓపెన్!



- 576 అడుగులు దాటిన జలాశయ నీటిమట్టం
- రెండు లక్షల క్యూసెక్కుల విడుదలకు ఏర్పాట్లు
- ఎగువ నుంచి 4.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆల్మట్టికి 3.10 లక్షలు, శ్రీశైలానికి 4 లక్షలు..
- మేడిగడ్డకు 4.87 లక్షల క్యూసెక్కుల వరద 3

పుణె మునక

ముంచెత్తిన ఖడక్‌వాస్లా డ్యాం నీరు

సహాయక చర్యలు చేపట్టిన సైన్యం

నాసిక్ వద్ద గోదావరి ఉరకలు

ముంపు ప్రాంతాలు అప్రమత్తం 2

మధ్యప్రదేశ్‌లో ఇంటి గోడ కూలి 9 మంది చిన్నారుల దుర్మరణం

హిమాచల్‌లో 11కు చేరిన మృతులు

గల్లంతైన 40 మంది కోసం గాలింపు

ఉత్తరాదిన వర్ష బీభత్సం



పుణెలో వరద గుప్పిట్లో ఓ కాలనీ

- పుణెను ముంచెత్తిన ఖడక్‌వాస్లా డ్యాం నీరు
- మధ్యప్రదేశ్‌లో గోడ కూలి 9మంది చిన్నారుల మృతి

పుణె, నాసిక్, సాగర్(ఎంపీ), సిమ్లా, ఆగస్టు 4: భారీ వర్షాలతో ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. మహారాష్ట్రలోని పుణె వద్ద ఖడక్‌వాస్లా డ్యాం నుంచి నీటిని విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలతో డ్యాం నుంచి ఆదివారం 35వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో ఏక్తానగర్ పరిధిలోని నివాస ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించడానికి పుణె జిల్లా మేజిస్ట్రేట్ సైన్యం సాయం కోరారు. మహారాష్ట్రలోని పాల్ఘర్, పుణె, సతారా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. థానే, ముంబై, రాయ్‌గఢ్, సింధుదుర్గ్, నాసిక్‌లలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక నాసిక్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతాలతో పాటు గోదావరి ఒడ్డున నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలిన ఘటనలో 9మంది చిన్నారులు మృతిచెందారు. రెహ్లీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధి షాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం 8.30 నుంచి 9గంటల మధ్య 'పార్థివ లింగ నిర్మాణ్' కార్యక్రమం నిర్వహించారు. అక్కడి ఆలయ సమీపంలో వేసిన గుడారం కింద పిల్లలంతా కూర్చున్నారని, వర్షాల కారణంగా అక్కడున్న ఓ ఇంటి గోడ కూలి గుడారంపై పడిందని అధికారులు వెల్లడించారు. గుడారం, శిథిలాల కింద నలిగి పిల్లలు చనిపోయారని స్థానికులు తెలిపారు. మృతులంతా 10 నుంచి 15 ఏళ్లలోపు వయసు వారే. ఇదిలా ఉండగా, ఈశాన్య మధ్యప్రదేశ్‌లో తీవ్ర అల్పపీడనం, పశ్చిమ రాజస్థాన్‌లో అల్పపీడనం కారణంగా బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఆదివారం భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల వల్ల అనేక మంది యాత్రికులు కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోయారు. సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. 4రోజుల్లో సుమారు 400 మంది భక్తులను రక్షించినట్లు తెలిపారు.

లోకం తీరు



వయనాడ్‌లో 365కు పెరిగిన మరణాలు

- ఇంకా 206 మంది గల్లంతు

వయనాడ్, ఆగస్టు 4: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ విషాదంలో మృతుల సంఖ్య 365కు చేరుకున్నట్లు అధికారులు ప్రకటించారు. మృతుల్లో 30 మంది చిన్నారులున్నారు. మరో 206 మంది గల్లంతయ్యారని, వారిని వెతికేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఆరో రోజు సహాయక చర్యల్లోనూ మృతదేహాలు లభ్యమవుతున్నాయే తప్ప.. సజీవంగా ఎవరూ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 148 మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. గాలింపు చర్యలను సోమవారంతో ముగిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. 93 పునరావాస కేంద్రాల్లో 10 వేల మంది ఆశ్రయం పొందుతున్నారన్నారు. కాగా.. కేరళలో వరద, భారీ వర్షాలు ఇంకా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం సూచిపారా ప్రాంతంలో వరదలో చిక్కుకుపోయిన ఐదుగురు వ్యక్తులను కాపాడినట్లు వాయుసేన తెలిపింది. వయనాడ్ విషాదం గురించి పోలీసులు, అగ్నిమాపక శాఖ, విపత్తు నిర్వహణ విభాగాలకు తొలుత సమాచారం అందించిన మహిళ నీతూ జోజో కూడా వరదలో కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించడం సాధ్యం కాదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ అన్నారు. కేంద్ర మంత్రి సురేశ్ గోపీ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే.. కేంద్రం అవసరమైన సాయాన్ని అందజేస్తుందని వీరిద్దరూ చెప్పారు.

అవయవాల రవాణా సమయంలో ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 4: అవయవ దానంతో మరొకరికి ప్రాణదానం చేయొచ్చు. అయితే.. అవయవ దాత, గ్రహీత వేర్వేరు నగరాల్లో లేదా రాష్ట్రాల్లో ఉన్నప్పుడు సజీవ అవయవాన్ని వీలైనంత త్వరగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఆలస్యం జరిగినా ప్రయత్నమంతా వృథా అవుతుంది. అందుకే అవయవ రవాణాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అవలంబించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ)ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. విమానాలతో సహా వివిధ ప్రయాణ మార్గాల ద్వారా అవయవాలను అత్యంత వేగంగా రవాణా చేసేందుకు ఈ ఎస్‌ఓపీ వీలుకల్పిస్తుంది. నీతి ఆయోగ్, నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఈ తరహా ఎస్‌ఓపీని రూపొందించింది. విమానాల్లో అవయవాలు రవాణా చేసే సమయంలో టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడడం, వైద్య సిబ్బందికి ప్రాధాన్య రిజర్వేషన్, ముందు వరుస సీట్లను కేటాయించడం, ఎయిర్‌పోర్టుకు చేరుకునే క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రీన్ కారిడార్ ఏర్పాటు వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. అలాగే అంబులెన్స్, ఇతర రవాణా మార్గాల ద్వారా అవయవాల రవాణాను సులభతరం చేయడానికి నిర్దిష్ట అధికారులు లేదా ఏజెన్సీల అభ్యర్థన మేరకు గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయవచ్చని దీనిలో పేర్కొన్నారు. రాష్ట్రంలోగానీ, ఒక నగరంలోగానీ అవయవ రవాణా కోసం 'గ్రీన్ కారిడార్' ఏర్పాటుకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు పోలీస్ శాఖకు చెందిన ఒక నోడల్ అధికారిని నియమించవచ్చని సూచించారు.

చదువులను దెబ్బతీస్తున్న స్మార్ట్‌ఫోన్

- ప్రతి 4 దేశాల్లో ఒక దేశంలోని స్కూళ్లలో నిషేధం
- గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 4: స్మార్ట్ ఫోన్ వినియోగం విద్యార్థులపై దుష్ప్రభావం చూపిస్తోందని గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్(జెమ్) నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం చేసిన జెమ్.. స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని సాంకేతికత వరకు పరిమితం చేస్తే మేలేనని పేర్కొంది. కానీ, దీనికంటే కూడా విద్యార్థులపై వ్యతిరేక ప్రభావాలు పడుతున్నాయని దీంతో చదువుపై వారిలో ఆసక్తి సన్నగిల్లుతోందని వివరించింది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా నాలుగుదేశాలను పరిగణనలోకి తీసుకుంటే ఒక దేశంలోని స్కూళ్లలో స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపింది. 'విద్యలో సాంకేతికత వినియోగం' పేరుతో వెలువరించిన జెమ్ నివేదికను యునెస్కో ప్రచురించింది. ఐక్యరాజ్యసమితి విద్యా విభాగానికి చెందిన ఒక నిపుణుడు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో సాంకేతికత వినియోగం ఖర్చుతో కూడుకున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్లలో ఉండే టెక్నాలజీని వినియోగించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. "విద్య, అభ్యసన విధానాల్లో డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. కరోనా సమయంలో ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ మాధ్యమం ద్వారా విద్యాబోధన, అభ్యసన వంటివి కొనసాగాయి" అని నివేదిక వివరించింది. అయితే.. అంతర్జాతీయ స్థాయిలో రూపొందించిన అంచనా ప్రకారం.. విద్యలో సాంకేతికతను తీసుకురావడం వల్ల అభ్యసన తీరుపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా మొబైల్ వినియోగం ద్వారా విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోతున్నారని 14 దేశాల్లో చేసిన అధ్యయనం తాలూకు వివరాలను వెల్లడించింది. అయినప్పటికీ నాలుగింట ఒక దేశం మాత్రమే స్కూళ్లలో స్మార్ట్ ఫోన్ల వినియోగంపై నిషేధం విధించారని పేర్కొంది. ఇక, యునెస్కో కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగంతో విద్యార్థులపై ప్రభావం పడుతోందని పేర్కొంది. మరోవైపు, మెటా అధ్యయనం కూడా ఈ అభిప్రాయమే వ్యక్తం చేసింది. 14 దేశాల్లో ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ విద్య వరకు స్మార్ట్‌ఫోన్ల వినియోగం కారణంగా విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతోందని మెటా అధ్యయనం పేర్కొంది.

మూడో ప్రపంచ యుద్ధం.. ముప్పు అంచున?

(మొదటి పేజీ తరువాయి)

రగిలిపోతున్న ఇరాన్.. సోమవారం తమపై యుద్ధానికి దిగే ప్రమాదం ఉందని ఇజ్రాయెల్ అంచనా వేస్తోంది. దీంతో.. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇరాన్ తమ దేశంపై చేసిన దాడిని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జోర్డాన్ దేశాల సాయంతో ఎదుర్కొన్నట్టే ఇప్పుడు కూడా అమెరికా, యూకేతో నాటో తరహాలో ఒక కూటమిగా ఏర్పడి ఎదుర్కోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభిప్రాయపడుతున్నారు. ఆయన దీన్ని 'అబ్రహామ్ కూటమి'గా వ్యవహరిస్తున్నారు! 1979లో వచ్చిన ఇస్లామిక్ విప్లవం అనంతరం ఇరాన్ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి.. లెబనాన్‌లో హెజ్బొల్లా, యెమెన్‌లో హౌతీలు, గాజాలో హమాస్, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ గ్రూపు, ఇరాక్‌లో షియా మిలీషియా గ్రూపులతో ఒక ప్రాక్సీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. దాన్ని 'ద యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' అని పిలుస్తారు. ఈ కూటమిని ఎదుర్కోవాలంటే.. అమెరికా, యూకే వంటి దేశాలతో 'అబ్రహాం కూటమి'ని ఏర్పాటు చేసి కలిసికట్టుగా పోరాడాలన్నది నెతన్యాహు ఆలోచన. ఈ వ్యూహంలో భాగంగానే ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్.. అమెరికా, బ్రిటన్ రక్షణ మంత్రులు లాయడ్ ఆస్టిన్, జాన్ హీలేతో ఇప్పటికే మాట్లాడారు. మరోవైపు.. అమెరికా సెంట్రల్ కమాండ్ జనరల్ మైకేల్ కురిల్లా గల్ఫ్ దేశాల నేతలతో చర్చలు జరిపేందుకు అక్కడికి చేరుకున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న తన సేనల సంఖ్యను అమెరికా పెంచుతోంది. మరిన్ని విమానవాహక యుద్ధనౌకలను, యుద్ధవిమానాలను ఆ ప్రాంతానికి పంపుతున్నట్టు పెంటగాన్ మూడురోజుల క్రితమే ఒక ప్రకటనలో తెలిపింది.

నాలుగు నెలల క్రితం..

సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇరాన్ రాయబార కార్యాలయంపై ఈ ఏడాది ఏప్రిల్ 1న ఇజ్రాయెల్ చేసిన బాంబుదాడిలో ఇద్దరు ఇరానియన్ జనరల్స్ సహా 16 మంది మరణించారు. దీంతో ఇరాన్ ఏప్రిల్ 13న ఇజ్రాయెల్‌పై 300కు పైగా డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఇజ్రాయెల్ ఆ దాడిని అమెరికా, యూకే, జోర్డాన్, ఫ్రాన్స్ అండతోనూ, తన యారో-3, డేవిడ్స్ స్లింగ్ రక్షణ వ్యవస్థలతో సమర్థంగా తిప్పికొట్టింది. అయితే, ఈసారి ఇరాన్‌కు అండగా ఇప్పటికే రష్యా సైనిక విమానాలు ఇరాన్‌లో ల్యాండ్ అవుతున్నాయని.. రష్యాకు చెందిన అత్యంత అధునాతనమైన కమ్యూనికేషన్ జామింగ్ వ్యవస్థను వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఇరాన్ ఏర్పాటు చేసిందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇలా ఇరువైపులా అగ్రరాజ్యాలు రంగంలోకి దిగితే అది మూడో ప్రపంచయుద్ధానికి దారితీయొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, గాజాలో రెండు పాఠశాలలే లక్ష్యంగా ఇజ్రాయెల్ సేనలు శనివారం చేసిన దాడిలో 25 మంది పాలస్తీనియన్లు చనిపోయారు.



లెబనాన్ నుంచి హిజ్బొల్లా చేస్తున్న దాడులను సమర్థంగా అడ్డుకొంటున్న ఇజ్రాయెల్ 'ఐరన్‌డోమ్' రక్షణ వ్యవస్థ

హూతీల దాడులు మళ్లీ ప్రారంభం

యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న హూతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలోని నౌకలపై మళ్లీ దాడులు ప్రారంభించారు. గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో శనివారం ఓ వాణిజ్య నౌకపై క్షిపణితో దాడికి పాల్పడ్డారు. క్షిపణి దాడి జరిగినట్లు నౌకా భద్రతాధికారి ధ్రువీకరించారని యూకే మేరీటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. అయితే ఈ దాడి వల్ల నౌకకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని తెలిపింది. లైబీరియన్ జెండాతో యూఏఈ నుంచి సౌదీ అరేబియా వెళ్తున్న గ్రోటన్ నౌకపై ఈ దాడి జరిగినట్లు చెప్పింది.

ప్రపంచ యుద్ధం.. నేడే మొదలు?

- భారత నోస్ట్రడామస్‌గా పేరొందిన కుశాల్‌కుమార్ తాజా అంచనా



భారత నోస్ట్రడామస్‌గా పేరొందిన కుశాల్‌కుమార్ అనే జ్యోతిష్కుడు.. సోమవారం లేదా మంగళవారం నుంచి మూడో ప్రపంచ యుద్ధం మొదలవుతుందని ప్రకటించారు. నిజానికి ఈయన మూడో ప్రపంచ యుద్ధం మొదలయ్యే తేదీలను ప్రకటించడం ఇదే మొదటిసారి కాదు. 2024 జూన్ 18న మొదలవుతుందని ఒకసారి.. జూలై 26 లేదా 28 తేదీల్లో యుద్ధభేరి మోగుతుందని మరోసారి.. చెప్పారు. కానీ, రెండు సార్లూ ఆయన జోస్యం ఫలించలేదు. హరియాణాకు చెందిన కుశాల్‌కుమార్ జ్యోతిష ప్రతిభ ఎంత గొప్పదో తెలియదుగానీ ఆయన చాలా పాపులర్. ఆయన వ్యాసాలు అంతర్జాతీయ జ్యోతిష మ్యాగజైన్లలో ప్రచురితమయ్యాయి.

యాపిల్ యూజర్లకు కేంద్రం 'హై-రిస్క్' అలర్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 4: యాపిల్ ఉత్పత్తుల వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం భద్రతాపరమైన హెచ్చరికలు జారీ చేసింది. ఐఫోన్, ఐప్యాడ్స్, మ్యాక్‌బుక్స్ సహా ఇతర యాపిల్ పరికరాలకు 'హై రిస్క్' అలర్ట్ ఇచ్చింది. యాపిల్ ఉత్పత్తుల్లో గుర్తించిన కీలకమైన లోపాలు ఆయా పరికరాలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీ ఏజెన్సీ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) హెచ్చరికలు జారీచేసింది. ఈ లోపాల వలన హ్యాకర్లు ఏకపక్షంగా కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేసి డివైజ్‌లను రిమోట్‌గా ఆపరేట్ చేసే ముప్పు ఉందని హెచ్చరించింది. దీనివల్ల సున్నితమైన సమాచార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. కాబట్టి యాపిల్ యూజర్లు వెంటనే తమ ఉత్పత్తులను లేటెస్ట్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ వెర్షన్‌తో అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. దీనిపై యాపిల్ సంస్థ కూడా స్పందించింది. యాపిల్ పరికరాలపై పెగాసస్ తరహాలో స్పైవేర్ దాడులు జరిగే అవకాశం ఉందని భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో ఉన్న తన వినియోగదారులను అప్రమత్తం చేసింది. భారత్‌లో.. జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా కుమార్తె, మీడియా సలహాదారు ఇల్తిజా ముఫ్తీ, సమృద్ధ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పుష్పరాజ్ దేశ్‌పాండే సహా పలువురు ప్రముఖులు ఈ హెచ్చరికలు అందుకున్నట్టు సమాచారం.

లోపాలు గుర్తించిన వెర్షన్లు ఇవే...

- ఐఓఎస్, ఐప్యాడ్ ఓఎస్ 17.6, 16.7.9కు ముందు వెర్షన్లు
- ఐమ్యాక్ ఓఎస్ 14.6 (సొనోమా), 13.6.8 (వెంచురా), 12.7.6 (మోంటెరీ)కి ముందు వెర్షన్లు
- ఐవాచ్ ఓఎస్ 10.6కు ముందు వెర్షన్లు
- యాపిల్ టీవీ ఓఎస్ 17.6కు ముందు వెర్షన్లు
- యాపిల్ విజన్ ఓఎస్ 1.3కు ముందు వెర్షన్లు
- సఫారీ ఓఎస్ 17.6కు ముందు వెర్షన్లు

బంగ్లాదేశ్‌లో మళ్లీ రక్తపాతం

93 మంది మృతి, వందలాది మందికి గాయాలు

షేక్ హసీనా రాజీనామాకు విద్యార్థుల డిమాండ్

ఢాకా, ఆగస్టు 4 : బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస చెలరేగింది. ప్రధాన మంత్రి షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాలనే ఏకైక డిమాండ్‌తో విద్యార్థులు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం తొలి రోజు, ఆదివారం దేశ వ్యాప్తంగా రక్తపాతానికి దారి తీసింది. విద్యార్థులు, అధికార అవామీ లీగ్ పార్టీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణల్లో దేశ వ్యాప్తంగా ఇప్పటిదాకా 14 మంది పోలీసులు సహా 93 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పడంతో అప్రమత్తమైన హోం శాఖ ఆదివారం సాయంత్రం నుంచి దేశ వ్యాప్తంగా నిరవధిక కర్ఫ్యూను అమలుకు అంతేకాక, ఫేస్‌బుక్, మెసెంజర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సేవలను దేశ వ్యాప్తంగా తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే, 4జీ సేవలను కూడా ఆపేయాలని మొబైల్ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదేశించింది. ప్రధాని హసీనా చర్చలకు ఆహ్వానించినా ఆమెతో మాట్లాడేందుకు ఆందోళనకారులు తిరస్కరించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై జరిగిన నిరసనల్లో ఇటీవల 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాలకు బాధ్యత వహిస్తూ ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌తో విద్యార్థులు ఉద్యమబాట పట్టారు. దేశ వ్యాప్తంగా హింస చెలరేగడంపై స్పందించిన ప్రధాని హసీనా షేక్.. విద్యార్థుల ముసుగులో టెర్రరిస్టులు హింసకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, హింసకు పాల్పడుతున్నవారిని అణిచి వేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్మీ, నేవీ, వాయుసేన చీఫ్‌లు, పోలీసు విభాగాల ఉన్నతాధికారులతో హసీనా సమావేశమయ్యారు.

మొస్సాద్ యమా డేంజర్!

శత్రువుపై విష ప్రయోగంలో దిట్ట.. టార్గెట్ చేస్తే ప్రత్యర్థి అంతమే

మొస్సాద్..! ఇజ్రాయెల్‌కు చెందిన అత్యంత శక్తిమంతమైన నిఘా, స్పెషల్ ఆపరేషన్ల సంస్థ..! ఈ సంస్థ ఒక ఆపరేషన్‌ను ఎంచుకుంటే.. శత్రువు అంతంతోనే అది ముగుస్తుంది. హిట్‌లిస్టులో ఉన్న శత్రువు భూప్రపంచంలో ఎక్కడ దాక్కొని ఉన్నా.. వెతికి, వేటాడి చంపడం మొస్సాద్ స్టైల్..! విదేశీ గడ్డపై విషప్రయోగాలు.. బాంబు దాడులు.. క్షిపణి దాడులతో శత్రువును మట్టుబెడుతుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆశ్రయం పొందుతున్న హమాస్ నేత ఇస్మాయిల్ హనియే హత్యతో మరోసారి మొస్సాద్ పేరు వార్తల్లోకెక్కింది.



మొస్సాద్ చీఫ్ డేవిడ్ బార్నియాతో నెతన్యాహు

టూత్ పేస్టుతో హైజాకర్ హత్య

1978లో అఫ్ఘానిస్థాన్‌లోని బగ్దాద్‌లో వాదీ హదాద్ హత్య ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తోంది. ఆయన లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా ధ్యేయంగా ఏర్పాటైన పాపులర్ ఫ్రంట్ సంస్థకు చీఫ్. 1976లో టెల్‌అవీవ్ విమానాశ్రయంలో 'ఎయిర్ ఫ్రాన్స్' విమానాన్ని హైజాక్ చేశాడు. అప్పట్లో లెఫ్టినెంట్ కల్నల్ యోనతాన్ నెతన్యాహు (ప్రస్తుత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సోదరుడు) నేతృత్వంలో 'థండర్‌బోల్ట్' పేరుతో నిర్వహించిన ఆపరేషన్‌లో బందీలను విడిపించగలిగారు. ఈ పోరులో యోనతాన్ నెతన్యాహు వీరమరణం పొందారు. దాంతో ఇజ్రాయెల్ హిట్‌లిస్టులోకి వాదీ హదాద్ చేరాడు. బగ్దాద్‌లో తలదాచుకున్న వాదీని తుదముట్టించేందుకు 'ఏజెంట్ సాడ్‌నెస్'ను రంగంలోకి దిగాడు. అతను బగ్దాద్‌లోని వాదీ ఇంట్లో పనివాడిలా చేరాడు. 1978 జనవరి 10న వాదీ వాడే టూత్‌పేస్టును మార్చి ఇజ్రాయెల్ తయారు చేసిన విషపు టూత్‌పేస్టును పెట్టాడు. ఆ పేస్టును వాడిన వాదీ ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. జర్మనీకి తరలించినా వైద్యులు ఆయనను బతికించలేకపోయారు. 1978 మార్చి 29న వాదీ చనిపోయాడు. అయితే 3 దశాబ్దాలు దాటే వరకు.. అతను చనిపోవడానికి కారణం విషపు టూత్‌పేస్టు అనే విషయం బయటి ప్రపంచానికి తెలియదు. పాలస్తీనా లిబరేషన్ కోసం ఖలీల్ మెషాల్ జోర్డాన్‌లో తలదాచుకుంటూనే ఇజ్రాయెల్‌పై దాడులకు వ్యూహాలను రచించి, అమలు చేశాడు. 1997లో మొస్సాద్ ఏజెంట్లు ఇతణ్ని ఇజ్రాయెల్‌లో చంపేందుకు స్కెచ్ వేశారు. ఖలీద్ చెవిలో విషాన్ని పిచికారీ చేశారు. దాంతో ఖలీద్ కోమాలోకి వెళ్లిపోయాడు. ఈ ఘటన అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు కారణమవ్వడంతో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ రంగంలోకి దిగారు. ఆయన ఒత్తిడితో ఇజ్రాయెల్ విరుగుడును అందజేసింది.

హనియే, డైఫ్ ఖతం

గత ఏడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే..! హమాస్ అగ్రనాయకులు కొందరు ఆ దృశ్యాలను లైవ్‌లో చూస్తూ.. 'థాంక్స్ గీవింగ్' ప్రార్థనలు నిర్వహించారు. అలా ప్రార్థనలు చేస్తున్న వీడియోల్లో ఉన్నవారంతా ఇప్పుడు ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో చేరిపోయారు. వీరిలో ఇస్మాయిల్ హనియే, మహమ్మద్ అల్-డైఫ్‌ను ఇజ్రాయెల్ ఇటీవలే తుదముట్టించింది.

చిక్కుల్లో 33 మంది ఏజెంట్లు

ఆపరేషన్ల సమయంలో ఏజెంట్లు చిక్కుల్లో పడ్డ దాఖలాలు కూడా ఉన్నాయి. ఇరాన్ ఇలా 20 మంది దాకా మొస్సాద్ ఏజెంట్లను నిర్బంధించినట్లు గత ఏడాది వార్తలు వచ్చాయి. తుర్కియేలోనూ 33 మంది ఏజెంట్లు చిక్కారు. గాజాలో సైనిక విభాగం-పొలిటికల్ బ్యూరో మధ్య ఫాతిమా హమాద్ సంధానకర్తగా ఉన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఆమె తుర్కియేలో తలదాచుకుంటున్నారు. ఫాతిమాను తుదముట్టించేందుకు 50 మంది దాకా మొస్సాద్ ఏజెంట్లు తుర్కియేలో వేట ప్రారంభించారు. ఈ క్రమంలో 33 మంది ఏజెంట్లను అరెస్టు చేసినట్లు తుర్కియే గత ఏడాది డిసెంబరులో ప్రకటించింది. గూఢచర్యం నేరం కింద వీరికి ఉరిశిక్ష విధించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. -సెంట్రల్ డెస్క్

యూట్యూబర్లపై ఆంక్షల పిడుగు!

(మొదటి పేజీ తరువాయి)


ఈ పని చేశారని తెలుస్తోంది. దేశ ప్రజానీకాన్ని ప్రభావితం చేసే చట్టాల రూపకల్పన విషయంలో ఇంతటి గోప్యత ఏమిటంటూ ప్రముఖ ఇంగ్లిష్ దినపత్రిక 'ది హిందూ' తన సంపాదకీయం ద్వారా కేంద్రాన్ని ఇటీవల ప్రశ్నించింది. సవరించిన బిల్లులో స్వతంత్ర మీడియా గొంతు నొక్కే పలు అంశాలున్నాయంటూ విపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా.. స్వతంత్ర భారతదేశంలో మనకున్న భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై ఈ బిల్లు ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. దీనివల్ల కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, స్వతంత్ర మీడియా సంస్థలపై ప్రభుత్వ నిఘా పెరుగుతుందన్నారు. బిల్లులో సవరణలు చేసి ఆ ప్రతులను రహస్యంగా కొందరు వ్యక్తులకు, కొన్ని వ్యాపారసంస్థలకు ఇచ్చారని, పార్లమెంటుకు మాత్రం ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ అన్నారు.

సవరించిన బిల్లులో ఏముంది?

సవరించిన బిల్లు ఇప్పటి వరకూ బహిర్గతం కాలేదు. వాస్తవానికి, ఒక బిల్లు చట్ట రూపం దాల్చాలంటే దాని ముసాయిదాను బహిరంగంగా వెల్లడించి, దానిపై ప్రజానీకం నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు ఆహ్వానించి.. వాటిపై సమీక్ష జరిపి అప్పుడుగానీ బిల్లుకు తుదిరూపం ఇవ్వరు. కానీ, ప్రసార సేవల నియంత్రణ సవరణ బిల్లు విషయంలో ఈ ప్రక్రియ జరగటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇంతకూ ఈ వివాదాస్పద బిల్లులో ఉన్న అంశాలేమిటి అన్నదానిపై సంబంధిత వర్గాలు చెబుతున్న దాని ప్రకారం..

- ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో ప్రజాదరణ ఉన్న వారిని ఇకపై డిజిటల్ వార్తా ప్రసారకులుగా గుర్తిస్తారు. బిల్లు చట్టరూపం దాల్చిన నెలరోజుల్లో ఈ డిజిటల్ వార్తా ప్రసారకులు ప్రభుత్వం వద్ద తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి ఓటీటీ వేదికలకు అమలవుతున్న మూడంచెల నియంత్రణ వ్యవస్థ కిందికి ఇక మీదట డిజిటల్ వార్తా ప్రసారకులు కూడా వస్తారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం ఈ డిజిటల్ వార్తా ప్రసారకుల కార్యాలయాలను తనిఖీ చేయవచ్చు. ఆ సందర్భంగా అవసరమైతే అక్కడున్న పరికరాలు, ఉపకరణాలు వేటినైనా స్వాధీనం చేసుకోవచ్చు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానాలతోపాటు నిషేధం విధించవచ్చు. ఉదాహరణకు, సబ్‌స్క్రైబర్ల డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయకపోతే తొలిసారి రూ.50 లక్షలు, ఆ తర్వాత నుంచి రూ.2.5 కోట్ల జరిమానా విధిస్తారు. కాగా, సదరు యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్ల గురించి ప్రభుత్వం ఏదైనా సమాచారం అడిగినప్పుడు ఆ వివరాలను మెటా, యూట్యూబ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా కంపెనీలు అందించాలి. అంతేకాదు, ఆన్‌లైన్ యాడ్ నెట్‌వర్క్‌లైన గూగుల్ యాడ్‌సెన్స్, ఫేస్‌బుక్ ఆడియెన్స్ నెట్‌వర్క్ వంటివి కూడా ఈ బిల్లు కిందికి వస్తాయి. దీనివల్ల యూట్యూబర్ల ఆదాయం కూడా ప్రభావితం కానుంది.



ప్రభావం ఎలా ఉంటుంది?

యూట్యూబర్లు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, చిన్నపాటి బృందాలతో ఆన్‌లైన్ వార్తాసంస్థలను నడుపుతున్న వాళ్లు ఈ నిబంధనలతో తమ పనిని కొనసాగించలేని పరిస్థితి ఎదురవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విధానాలను విమర్శించే వారు, ప్రజలకు వాస్తవాలను తెలియజేసే వారికి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో అసమ్మతి కీలకమైన అంశమని, దానిని వినిపిస్తున్న ధ్రువ్‌రాఠీ వంటి యూట్యూబర్లు, రవీశ్‌కుమార్ వంటి స్వతంత్ర జర్నలిస్టులే లక్ష్యంగా ఈ బిల్లు తెస్తున్నారని ఆరోపిస్తున్నారు. భారీ మీడియా కంపెనీలకు, యూట్యూబర్‌ను ఒకేగాటన గట్టి నిబంధనలు రూపొందించటం ఏమిటన్న విమర్శ వినిపిస్తోంది.

కష్టకాలంలో ఉన్నాం.. అండగా ఉండండి!

మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో ప్రధాన మీడియాను ముఖ్యంగా జాతీయ మీడియాను తన అదుపాజ్ఞల్లో పెట్టుకుందని, దీంతో ప్రజలకు వాస్తవాలు తెలియజేసే బాధ్యతను యూట్యూబ్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా తాము నిర్వర్తించామని ఆయా రంగాల్లో పని చేస్తున్న వారు చెబుతున్నారు. అందుకే సర్కారు తమపై కక్షగట్టి, ఈ కొత్త బిల్లు తీసుకొస్తుందని ఆరోపిస్తున్నారు. తమ కృషి వల్లే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు గౌరవనీయమైన స్థాయిలో సీట్లు లభించాయని పేర్కొంటూ, ఇప్పుడు కష్టకాలంలో ఉన్న తమకు అండగా ఉండాలని కోరుతున్నారు. పార్లమెంటులో దీని గురించి ప్రస్తావించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిజంగానే సోషల్‌మీడియాలో ఉన్న అపసవ్య ధోరణులను ఎదుర్కొనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే, తాము స్వాగతిస్తామని, సహకరిస్తామని పలువురు యూట్యూబర్లు పేర్కొంటున్నారు. బిల్లును బహిరంగపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ జరుపుతున్నారు.

చైనా సోషల్ మీడియాలో టిబెటన్ కంటెంట్‌పై నిషేధం

- తీవ్రంగా నిరసించిన టిబెటన్ హక్కుల సంఘాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: టిబెట్ భాషలోని కంటెంట్‌ని నిషేధిస్తూ చైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం తీసుకున్న నిర్ణయంపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టిబెట్ల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తమ సంస్కృతి, సంప్రదాయాలు, అభిప్రాయాలను, జీవన సరళిని తెలియజేసేందుకు సోషల్ మీడియా మాతృభాషలో పెడుతున్న కంటెంట్‌పై నియంత్రణలు పెట్టడమేంటని నిలదీస్తున్నాయి. ధర్మశాల కేంద్రంగా పనిచేసే టిబెటన్ సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ డెమొక్రసీ (టీసీహెచ్‌ఆర్‌డీ) చైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం డౌయిన్ తీరును తీవ్రంగా ఖండించింది. చైనా సోషల్ మీడియా దిగ్గజం డౌయిన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రభావం టిబెట్ నెటిజన్లు తమ మాతృ భాషలో చేసే వీడియోలపై తీవ్ర ప్రభావం చూపనుందని టీసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ టెన్‌జిన్ దవా తెలిపారు. డౌయిన్ కంపెనీ తీసుకున్న నిర్ణయం అక్రమమని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి ఆంక్షలు పెట్టడం ద్వారా టిబెటన్ సంస్కృతిని, భాషని పూర్తిగా నిర్మూలించే చర్యలకు జిన్‌పింగ్ ప్రభుత్వం దిగిందని, తద్వారా టిబెటన్లతో బలవంతంగా చైనీస్ మాట్లాడించేందుకు ప్రయత్నిస్తోందని, తద్వారా టిబెట్‌లో టిబెటన్లకు చోటు లేకుండా చేయాలని చూస్తున్నారని దవా మండిపడ్డారు.

పెరోల్‌కు ముందు రోజే మృతి..

చనిపోయిన ఆరేళ్లకు నిర్దోషి

- కన్న తల్లిని చంపాడంటూ కొడుకు అరెస్టు
- యావజ్జీవ శిక్ష విధించిన ట్రయల్ కోర్టు
- హైకోర్టులో అప్పీల్.. విచారణ ఆలస్యం
- శనివారం తీర్పులో నిర్దోషిగా పోశయ్య
- స్వీయ నేరాంగీకారంతో శిక్షించలేం: హైకోర్టు

దుబ్బాక, ఆగస్టు 4: తల్లి చనిపోయిన బాధలో ఉంటే.. కొడుకే హంతకుడంటూ పోలీసులు అరెస్టు చేశారు. నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ) 161 ప్రకారం నేరాంగీకార పత్రం(కన్ఫెషన్) ఆధారంగా చార్జిషీట్ దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. పెరోల్‌తో స్వేచ్ఛాగాలులు పీలుద్దామనుకున్న ఆ బాధితుడి గుండె.. సరిగ్గా బయటకు రావడానికి ఒక్క రోజు ముందు ఆగిపోయింది. ఆయన చనిపోయిన ఆరేళ్ల తర్వాత.. హైకోర్టు అతణ్ని నిర్దోషి అని తేల్చింది. హృదయాన్ని కలిచివేసే ఈ కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా.. దుబ్బాక మండలం, పెద్దగుండవెళ్లికి చెందిన గుండెళ్లి ఎల్లవ్వ(80) 2013 ఫిబ్రవరి 1న తన ఇంటి పక్కనే ఉన్న సీతాఫలం చెట్టుకు టవల్‌తో ఉరేసుకుని చనిపోయారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఎల్లవ్వ మృతిని హత్యగా భావించారు. ఆమె కుమారుడు పోశయ్య(అప్పటి వయసు 58)పై అనుమానంతో అరెస్టు చేశారు. ఎల్లవ్వ అనారోగ్యంతో బాధపడడం చూడలేక పోశయ్య ఆమెను టవల్‌తో గొంతు నులిమి, హత్య చేసి, సీతాఫలం చెట్టుకు వేలాడదీశాడని పోలీసులు అభియోగాలు మోపారు. 2015 జనవరి 12న సిద్దిపేట జిల్లా ఆరో అదనపు సెషన్స్ కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పోశయ్య దాన్ని సవాల్ చేస్తూ.. హైకోర్టును ఆశ్రయించారు. విచారణ ఆలస్యం కావడంతో.. 2018లో పెరోల్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. పెరోల్ రావడంతో.. 2018 ఆగస్టు 15న విడుదలవ్వాల్సి ఉండగా.. ఒక్కరోజు ముందే చర్లపల్లి జైలులో మృతిచెందాడు. గుండెపోటు కారణంగా అతను మృతి చెందినట్లు జైలు అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆగస్టు 16న పోశయ్యకు అతని స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే.. పోశయ్య అప్పీల్ పిటిషన్‌పై హైకోర్టు శనివారం తుది తీర్పునిచ్చింది. పోశయ్యే హత్యచేశాడనడానికి సరైన ఆధారాలను పోలీసులు సమర్పించలేదని కోర్టు వ్యాఖ్యానించింది. కేవలం నిందితుడు పోలీసుల ఎదుట సీఆర్‌పీసీ 161 కింద ఇచ్చిన స్టేట్‌మెంట్, నేరాంగీకార పత్రం నేర నిర్ధారణకు సరిపోదని తేల్చిచెప్పింది. పోస్టుమార్టం నివేదిక కూడా అది హత్యా? ఆత్మహత్యా? అన్నదాన్ని తేల్చలేదని, రెండింటిలో ఏదైనా కావొచ్చనే సంశయాన్ని వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేసింది. సాక్ష్యాధారాలు లేనందున పోశయ్యను నిర్దోషిగా ప్రకటిస్తూ.. కింది కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. హైకోర్టు తీర్పుపట్ల పోశయ్య కుమారులు జయరాజ్, దేవయ్య హర్షం వ్యక్తం చేశారు. అయితే.. నిర్దోషి అయిన పోశయ్య ఇప్పుడు తమ మధ్యలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు.


పోశయ్య(ఫైల్)

ఉద్యోగినిపై అత్యాచారం జరిగిన

శ్రీరస్తు బార్, హోటల్ సీజ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వనస్థలిపురంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై అత్యాచారం ఘటన జరిగిన శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్, హోటల్ (బొమ్మరిల్లు కాంప్లెక్స్) మూసివేతకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో వనస్థలిపురం పోలీసులు బార్ అండ్ రెస్టారెంట్, హోటల్ ఉన్న బొమ్మరిల్లు కాంప్లెక్స్‌ను ఆదివారం మూసివేశారు. ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చిన ఓ యువతిని పార్టీ అడిగిన ఆమె స్నేహితుడు హోటల్‌కు తీసుకెళ్లాడు. అదే హోటల్‌లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించి ఆమెతో బలవంతంగా మద్యం తాగించాడు. ఆ తర్వాత యువతి స్పృహ కోల్పోగా అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆ తర్వాత తన స్నేహితుడిని హోటల్ గదికి పిలిపించి ఇద్దరూ అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఉదంతం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా హోటల్‌లో గదులు ఇచ్చి, పరోక్షంగా అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక చర్యలకు కారణమైన హోటల్, బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యాలపై సీపీ కఠిన చర్యలకు ఆదేశించారు. కేసులు నమోదు చేయడంతోపాటు మొత్తం కాంప్లెక్స్ మూసివేతకు ఆదేశించారు. దీంతో అధికారులు ఓంకార్ నగర్ బైరామల్‌గూడలోని బొమ్మరిల్లు కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్, హోటల్‌కు తాళం వేశారు. ఈ బార్ అండ్ రెస్టారెంట్‌లో పగలు రాత్రి తేడాలేకుండా ఇష్టానుసారంగా కస్టమర్లు మద్యం సేవించడానికేకాకుండా గదుల్లో ఉండేందుకు అనుమతిస్తున్నారు. కస్టమర్ల నుంచి ధ్రువ పత్రాలు తీసుకోకుండా హోటల్లో గదులు ఇవ్వడం వల్ల చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రోత్సహిస్తున్నారు. కాగా హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, లాడ్జిల నిర్వాహకులు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు.

నేడు సాగర్ గేట్లు ఓపెన్!

576 అడుగులు దాటిన జలాశయ నీటిమట్టం.. ఎగువ నుంచి 4.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఉరకలెత్తుతూ ప్రవహిస్తున్న కృష్ణమ్మ నాగార్జునసాగర్ జలాశయానికి వడివడిగా చేరుతోంది. వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో సాగర్ నిండు కుండలా మారింది. జలాశయంలో నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరువ కావడంతో సోమవారం గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు 6 గేట్లను ఎత్తి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు సీఈ నాగేశ్వర రావు తెలిపారు. శ్రీశైలానికి ఎగువ నుంచి 4,00,491 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో.. పూర్తి సామర్థ్యం 215.60 టీఎంసీలకు.. నిల్వ 203.89 టీఎంసీలకు చేరింది. దీంతో 10 గేట్లను ఎత్తి కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 4,27,711 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగుల (312.50 టీఎంసీలు)కు ఆదివారం సాయంత్రానికి 576.10 అడుగులు (271.90టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,613క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 26,040 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు.. మొత్తం 37,873 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టికి 3,10,556 ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 2.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయానికి 2.50 లక్షల ఇన్‌ఫ్లో వస్తుండగా 25 గేట్లను ఎత్తి 2,22,850 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జూరాలకు 2.60 లక్షల ఇన్‌ఫ్లో వస్తుండగా 2,50,153 క్యూసెక్కులను శ్రీశైలానికి వదులుతున్నారు. తుంగభద్రకు కాస్త వరద తగ్గింది. ప్రస్తుతం 1,32,343 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో 1,30,855 క్యూసెక్కులుగా ఉంది. సుంకేసుల వద్ద ఇన్‌ఫ్లో 1,72,000 క్యూసెక్కులుండగా 1,69,556 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో నమోదవుతోంది.



ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద..

గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) కు వరద కొనసాగుతోంది. ప్రస్తుతం 21,422 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 44.26 టీఎంసీలున్నాయి. ఈనెల 7నుంచి ఆన్ ఆఫ్ పద్ధతిలో సాగుకు నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కాకతీయ, లక్ష్మీ, సరస్వతీ కాల్వల ద్వారా ఆయకట్టుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ఇటు నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులతో పాటు సదర్మాట్ జలాశయం కూడా వరద నీటితో జలకళను సంతరించుకున్నాయి. కడెం పూర్తి సామర్థ్యం 7.60 టీఎంసీలకు.. ప్రస్తుతం 6.74 టీఎంసీలున్నాయి. ప్రాజెక్టుకు 3,867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 4.87 లక్షల క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 6 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు.

పనిచేయని టర్బైన్‌లు.. జెన్‌కో నిర్లక్ష్యం

నాగార్జునసాగర్ నుంచి సోమవారం నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే ప్రధాన జలవిద్యుత్తు కేంద్రంలో 8 టర్బైన్‌లు ఉండగా.. 2, 4వ నంబరు టర్బైన్‌లు మరమ్మతులకు గురై 6 నెలలవుతున్నా జెన్‌కో అధికారులు మరమ్మతులు పూర్తిచేయలేదు. ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నప్పటికీ జెన్‌కో అధికారుల నిర్లక్ష్యంతో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తికి అవకాశం లేకుండా పోయిందని నీటిపారుదల, విద్యుత్తు రంగ నిపుణులు మండిపడుతున్నారు. దీనిపై జెన్‌కో ఎస్ఈ రఘురాం మాట్లాడుతూ.. 1వ టర్బైన్ వినహా మిగిలిన 7 టర్బైన్‌లు జపాన్ నుంచి తెచ్చి ఏర్పాటు చేసినవని.. మరమ్మతులకు జపాన్ నుంచే నిపుణులు రావాల్సి ఉందని చెప్పారు.


కోర్బా రైలు నుంచి దట్టంగా వ్యాపిస్తున్న పొగ

కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- విశాఖ రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం.. దగ్ధమైన 4 కోచ్‌లు
- ఖాళీ రైలు కావడంతో తప్పిన ప్రాణనష్టం

విశాఖపట్నం, ఆగస్టు 4:విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై ఖాళీగా నిలిచి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌ల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్టేషన్‌లోని ప్రయాణికులతోపాటు రైల్వే సిబ్బంది భయాందోళనతో పరుగులు తీశారు. ఏం జరుగుతుందో తెలిసేలోగా ప్రమాద తీవ్రత పెరిగింది. దీంతో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా వారు వెంటనే చేరుకుని గంటకు పైగా శ్రమించి మంటలను అదుపు చేశారు. రైల్వే సిబ్బంది వారికి సహకరించారు. ఖాళీగా ఉన్న రైల్లో ప్రమాదం సంభవించడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. కోర్బా-విశాఖ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (18517) ఆదివారం ఉదయం 6.25 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వచ్చింది. ప్రయాణికులు దిగి వెళ్లిపోయాక ఇంజన్‌ను కూడా తొలగించారు. మొత్తం హెచ్‌వోజీ పవర్‌కట్ చేసి, ర్యాక్‌ను కోచింగ్ కాంప్లెక్సు తరలించేందుకు వీలుగా ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేశారు. దీంతో సిబ్బంది కోచ్‌ల ప్రవేశద్వారాలను కూడా మూసివేశారు. నిర్వహణ అనంతరం ఈ ర్యాక్‌ను తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు వినియోగించాల్సి ఉంది. అయితే ఉదయం 9.45 గంటలకు బీ-7కోచ్ నుంచి మంటలు, పొగ వ్యాపించాయి. క్షణాల్లో ప్రమాద తీవ్రత పెరిగి మరో 3 కోచ్‌లకు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బీ-7 కోచ్ పూర్తిగా దగ్ధం కాగా, బీ-6, బీ-5, ఎం-1 ఏసీ కోచ్‌లు పాక్షికంగా కాలిపోయాయి. కాగా, ప్రమాద స్థలాన్ని రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి, విచారణ చేపట్టారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ఇటువంటి ప్రమాదం జరగడంతో కోచ్‌లను తయారుచేసిన ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్), తూర్పుకోస్తా రైల్వే హెడ్ క్వార్టర్స్‌తోపాటు లఖ్‌నవూలోని ఆర్‌డీఎస్‌వోకు చెందిన నిపుణుల బృందాలతో విచారణ చేపట్టారు.

నాన్నని కడసారి చూడలేక...

- తినడానికి తిండి లేక, ఇంటికెళ్లే దారి లేక
- ఎడారి దేశంలో తెలంగాణ యువకుడి దైన్యం
- స్వదేశానికి చేరేందుకు సాయం కోసం ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పొట్టకూటి కోసం ఎడారి దేశానికి వస్తున్న వారి కష్టాలకు కన్నీళ్లకు అంతేలేకుండా పోతోంది. ఆకలిదప్పుల కష్టాల సంగతి పక్కనపెడితే.. చనిపోయిన తమ వారిని చివరి సారి కూడా చూసుకోలేకపోతున్నారు. కడసారి చూపునకు నోచుకోక శోకాన్ని దిగమింగుతూ అత్యంత దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణకు చెందిన మున్నా అనే యువకుడైతే ప్రస్తుతం రియాద్‌లో అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాడు. తానుంటున్న సౌదీలోనే తన తండ్రి మరణించినా మృతదేహాన్ని కూడా చూడలేకపోయాడు. కామారెడ్డి జిల్లా శబ్దిపూర్‌కు చెందిన మెహమ్మద్ షరీఫ్(39) భారత్ నుంచి సౌదీ వచ్చిన నాలుగు రోజులకే ఓ పార్కులో చనిపోయారు. షరీఫ్ ఎమయ్యాడనే విషయం అతను మరణించిన 45 రోజుల తర్వాత ఇటీవలే కుటుంబసభ్యులకు తెలిసింది. దీంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోగా.. సౌదీలోనే ఉంటున్న షరీఫ్ కుమారుడు మున్నా మరింత కుంగిపోయాడు. మున్నా రియాద్‌కు సుమారు 900 కిలోమీటర్ల దూరంలోని అల్‌బాహా ప్రాంతంలోని ఓ కంపెనీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. ఏడాదిన్నరగా జీతం ఇవ్వకుండా ఆ సంస్థ మున్నాతో వెట్టిచాకిరీ చేయించుకుంటుంది. చనిపోయిన తండ్రిని చివరి సారి చూసుకుని, అంతిమకార్యక్రమాలు చేసి వస్తానని అడిగితే అఖమా(వీసా) కూడా ఇవ్వలేదు. ఏడాదిన్నరగా జీతం అందకపోగా, అఖమా కూడా లేకపోవడంతో మున్నా రియాద్ వెళ్లలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. తండ్రి అంత్యక్రియలకు స్వదేశానికి వెళ్లిపోతా పంపించమని మున్నా అడిగితే.. సంస్థ బ్లాక్ లిస్ట్‌లో ఉందని ప్రయాణించే అవకాశం లేదని ఆ సంస్థ యాజమాన్యం తేల్చిచెప్పింది. దీంతో చనిపోయిన నాన్నను, ఇంటి వద్ద ఉన్న కుటుంబసభ్యులను తలచుకుంటూ తీవ్ర శోకాన్ని అనుభవించాడు. అయితే, తన కష్టాన్ని దిగుమింగుకున్న మున్నా ఎలాగైనా సరే తన తండ్రిని కడసారి చూసుకోవాలని సాహసం చేశాడు. యాజమాన్యానికి చెప్పకుండా గుట్టుగా రెండ్రోజుల క్రితం రియాద్ చేరుకున్నాడు. తండ్రి మృతదేహం ఇప్పటికే స్వదేశానికి చేరగా.. చేతిలో చిల్లిగవ్వ లేక, అనుమతి పత్రాలు లేక మున్నా రియాద్‌లో పడరాని పాట్లు పడుతున్నాడు. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆకలితో అలమటిస్తూ సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఎలాగైనా స్వదేశానికి వెళ్లేందుకు ఆరాటపడుతున్నాడు.

మందుపాతర గుర్తింపు.. పేల్చివేత

- భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో ఘటన

చర్ల, ఆగస్టు 4 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప గ్రామ శివారులోని రహదారిపై ఆదివారం చర్ల పోలీసులు మందుపాతరను గుర్తించారు. అనంతరం బాంబ్‌స్క్వాడ్ సహాయంతో దాన్ని పేల్చివేశారు. మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో గత పది రోజులుగా చర్ల పోలీసులు చర్ల, పూసుగుప్ప రహదారిపై బాంబ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రోటింత వాగు సమీపంలోని ఓ వంతెన వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతరను తనిఖీ చేస్తున్న బలగాలు గుర్తించాయి. అనంతరం దాన్ని బాంబ్‌స్క్వాడ్ సహాయంతో పేల్చివేశారు.

ఏఐ సిటీలో 8 హబ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని.. అది సైన్స్ సిటీ, స్పోర్ట్స్ సిటీ, హెల్త్ హబ్, ఎడ్యుకేషన్ హబ్ ఇలా ఎనిమిది రకాల సిటీల సమాహారంగా ఉండబోతోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వివిధ కంపెనీల విద్యుత్ వినియోగం భారీగా ఉంటోందని.. ఏఐ సిటీలో విద్యుత్ వినియోగం చాలా తక్కువగా ఉండేలా ప్రణాళికలుంటాయని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్, లండన్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించి హైదరాబాద్ అభివృద్ధికి అనువైన ప్రణాళికలను అన్వేషించిందని, యూఎస్ పర్యటన ద్వారా మరిన్ని చర్యలు చేపట్టనుందని తెలిపారు.

29 ప్రాంతాల్లో...

భూసమీకరణ విధానానికి సంబంధించి ఉప్పల్‌భగాయత్ ఒక చిన్న ప్రయోగమని.. మున్ముందు చూడబోయే భారీ ప్రయోగం 30 వేల ఎకరాలతో ఉంటుందని దానకిశోర్ తెలిపారు. అందులో భాగంగా హెచ్‌ఎండీఏ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వెంట 29 ప్రాంతాల్లో భూమిని ఇప్పటికే గుర్తించామని ఆయన వెల్లడించారు. అలాగే.. హెచ్‌ఎండీఏ పరిధిలో 61 ఇండస్ట్రియల్ పార్కులున్నాయని, వాటన్నింటిని కలుపుతూ రేడియల్ రోడ్లను తీసుకురావాలని సీఎం నిర్ణయించారని తెలిపారు. ఇంతకుముందు ఔటర్ పరిధిలో 35 రేడియల్ రోడ్లు ప్లాన్ చేయగా, అందులో 20 పూర్తయ్యాయని.. మరో నాలుగు రోడ్ల పనులు సాగుతున్నాయని చెప్పారు. వీటన్నింటినీ అనుసంధానం చేస్తూ ఔటర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకూ 51 అదనపు రోడ్లకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే ఉన్న 27 రోడ్లను 100 అడుగుల నుంచి 200 అడుగుల మేర వెడల్పు చేయాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 60 శాతం హైదరాబాద్ నుంచే వస్తున్నందున రాజధానిని మరింత అభివృద్ధి చేసుకొని పెట్టుబడులు వచ్చే విధంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. మెట్రో రైల్‌కు సంబంధించి.. ఐదు కారిడార్లలో 78 కిలోమీటర్ల మేర విస్తరణకు ఐదేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. హయత్‌నగర్, ఎయిర్‌పోర్టు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, బెల్ ఇలా పలు ప్రాంతాలకు విస్తరిస్తుందని తెలిపారు. గోదావరి నీళ్లతో మూసీని శుభ్రం చేసేందుకు రూ.5600 కోట్ల పనులకు టెండర్ నిర్వహిస్తున్నామని.. రెండేళ్లలో పనుల పూర్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాలో భాగంగా ఓఆర్ఆర్ లోపల 542 చెరువులు, వందలాది పార్కులు బాగుచేయాలని.. వెయ్యి ఎకరాల భారీ పార్కును తేవాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. అలాగే. హెచ్‌ఎండీఏ పరిధి ఆర్ఆర్ఆర్ వరకూ విస్తరిస్తుందని, ప్రస్తుతమున్న చదరపు కి.మీ.కు మరో రెండు వేల కి.మీ. కలవబోతుందని దానకిశోర్ చెప్పారు. కాగా.. మూడు రోజులపాటు జరిగిన ఈ ప్రాపర్టీ షోలో రూ.270 కోట్ల వ్యాపారం జరిగిందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 4.12 లక్షల చదరపుటడుగుల ప్రాపర్టీని కొనుగోలు చేయడానికి సందర్శకులు ఆసక్తి కనబరిచారని చెప్పారు.

బైక్‌తో ఫ్లైఓవర్ పైనుంచి కిందపడి..

ఇద్దరి దుర్మరణం

- హైదరాబాద్‌లోని కొత్తగూడ ఫ్లైఓవర్‌పై ప్రమాదం
- మృతులు గుంటూరు జిల్లా వాసులు

రాయదుర్గం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలితీసుకుంది. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి ఫ్లైఓవర్ రిటెయినింగ్ వాల్‌ను ఢీకొట్టగా.. బైక్‌పై ఉన్న యువకులు వంతెనపైనుంచి కింద ఉన్న రోడ్డుపై పడ్డారు. హైదరాబాద్, కొండాపూర్ ప్రాంతంలోని కొత్తగూడ ఫ్లైఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన కందాల రోహిత్ (26), వి.బాలప్రసన్న(24) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా రొంపిచెర్ల మండలం మర్రిచెట్టుపాలెంకు చెందిన కందాల రోహిత్. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ మియాపూర్‌లోని హఫీజ్‌పేట్‌లో నివాసముంటున్నాడు. అతని స్నేహితుడు, గుంటూరు జిల్లా, రొంపిచర్ల మండలం, విప్పర్ల గ్రామానికి చెందిన వి.బాలప్రసన్న(24) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగ అన్వేషణలో ఉన్న బాలప్రసన్న ఇటీవల హైదరాబాద్ వచ్చి రోహిత్‌తో కలిసి ఉంటున్నాడు. అయితే, ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో వీరిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై వెళుతూ కొత్తగూడ ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఫ్లైఓవర్ పైనుంచి అమాంతం కింద పడిన వీరిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. బాలప్రసన్న సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బాలప్రసన్న, రోహిత్ (ఫైల్)

చెట్టును ఢీకొట్టిన కారు.. ముగ్గురు యువకుల మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ప్రమాదం

దోమలపెంట, ఆగస్టు 4: నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సికింద్రాబాద్ మచ్చబొల్లారానికి చెందిన మాచర్ల కిషన్(21), మేడ్చల్ జిల్లా కొంపల్లికి చెందిన సాయిప్రకాశ్(28), వికారాబాద్ జిల్లా అల్లికానిపల్లికి చెందిన రమేశ్(22), మెదక్ జిల్లా పిల్లవాడ గ్రామానికి చెందిన గణేశ్ హైదరాబాద్‌లోని శ్రీ జయరాం ఆటోమేటివ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ మెకానిక్‌లుగా పని చేస్తున్నారు. వీరందరూ కలిసి శనివారం రాత్రి కారులో శ్రీశైలానికి బయల్దేరివెళ్లారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో వారి కారు దోమలపెంట-చటువర్లపల్లి గ్రామాల మధ్య, రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నది. ప్రమాదంలో కిషన్, సాయి ప్రకాష్, రమేశ్ అక్కడికక్కడే చనిపోయారు. గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదసమయంలో ఈ నలుగురూ మద్యం తాగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


రమేశ్, మాచర్ల కిషన్ (ఫైల్)

చాక్లెట్ ఆశ చూపి.. చిన్నారి అపహరణ

- 18 గంటల్లోనే పాపను రక్షించిన పోలీసులు
- నిందితుడు బిహార్ రాష్ట్రానికి చెందిన అన్సారీ
- డబ్బుకోసం పాపను కిడ్నాప్ చేసినట్లు నిర్ధారణ
- గతంలో పలు కేసుల్లో జైలుకెళ్లిన నిందితుడు

మంగళ్‌హాట్/హైదరాబాద్ సిటీ/కొత్తూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో అపహరణకు గురైన ఆరేళ్ల చిన్నారిని పోలీసులు 18 గంటల్లోనే రక్షించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కిడ్నాపర్‌ను అరెస్టు చేశారు. నిందితుడిని బిహార్‌కు చెందిన మహ్మద్ బిలాల్ అన్సారీ (32)గా గుర్తించిన పోలీసులు.. డబ్బుకోసమే పాపను కిడ్నాప్ చేసినట్లు నిర్ధారించారు. ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన పి.ప్రియాంక, పి.భీమా బాయ్ దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చారు. బేగంబజార్ ఛత్రీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరికి ప్రగతి(6)తో పాటు ఒక బాబు ఉన్నాడు. ప్రగతి స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. ప్రియాంక సోదరి ఆబిడ్స్ పరిధిలోని కట్టెలమండి ప్రాంతంలో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రియాంక తన కూతురు ప్రగతితో కలిసి కట్టెలమండిలోని సోదరి ఇంటికి వెళ్లింది. అక్కడ ప్రగతి తన పిన్ని కొడుకు వృత్తిక్ (4)తో కలిసి ఆడుకోవడానికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత వృత్తిక్ ఇంటికి రాగా.. ప్రగతి రాలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో ప్రియాంక 4 గంటలకు ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీసీపీ అక్షాంశ్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగారు. కట్టెలమండిలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తి తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. పాపను కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్ నర్వ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు గుర్తించారు. అక్కడి కన్‌స్ట్రక్షన్ క్యాంప్ వద్ద రాత్రంతా ఉంచి, ఆదివారం ఉదయం పాపను తీసుకొని బస్టాప్ వద్దకు వస్తుండగా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు అతన్ని పట్టుకున్నారు. ప్రగతికి చాక్లెట్‌తో పాటు సైకిల్ ఇప్పిస్తానని ఆశ చూపించి కిడ్నాప్ చేసినట్లు నిందితుడు అంగీకరించాడని డీసీపీ తెలిపారు. పాప తండ్రికి ఫోన్ చేసి, డబ్బులు డిమాండ్ చేసేందుకు ప్లాన్ చేసినట్లు చెప్పాడన్నారు. బాలికను వైద్య పరీక్షల కోసం భరోసా సెంటర్‌కు పంపినట్లు డీసీపీ చెప్పారు. అన్సారీ కొన్నాళ్ల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఫుట్‌పాత్‌లపై ఉంటూ కూలి పని చేసుకుంటున్నాడు. అతనిపై బిహార్‌లో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 11 ఏళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసులో 14 నెలలు, బైక్ చోరీ కేసులో 9 నెలలు జైలు శిక్ష అనుభవించాడు. ఇటీవల సైబరాబాద్ పరిధిలోని కొత్తూర్‌లో 8 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడి తప్పించుకొని తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. సైబరాబాద్ పోలీసుల మోస్ట్‌వాంటెడ్ జాబితాలో అన్సారీ ఉన్నట్లు చెప్పారు.


చిన్నారిని తనతో తీసుకువెళ్తున్న అన్సారీ

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక


బొమ్మలు: అక్బర్

విమర్శకులకూ 'గ్లామర్' ఉందని ఋజువు చేశాడు త్రిపురనేని



చదువు ముచ్చట

బి. తిరుపతిరావు



ఈమధ్య చదివిన పుస్తకం?

గత నాలుగేళ్ళుగా స్టాలిన్ పాలనలో సోవియట్ రష్యాలో, తూర్పు ఐరోపా దేశాలలో జరిగిన మారణ హోమాల గురించి చదువుతున్నాను. రష్యా విచ్ఛిన్నం తరువాత 1991, 1992 సంవత్సరాల్లో రష్యన్ ఆర్కైవ్స్ పబ్లిక్‌కి అందుబాటులోకి రావటంతో ప్రపంచవ్యాప్తంగా వందలాదిమంది పరిశోధకులు వాటిని పరిశీలించి విస్తృతంగా పుస్తకాలు రాశారు. స్టాలిన్ దురాగతాలన్నింటిని ఆధారాలతో నిరూపించారు. ఈ పుస్తకాలు స్టాలిన్ సోషలిజం పేరుతో కొనసాగించిన హింస గురించి వాస్తవాలు వెల్లడించాయి. వీటి గురించి నేను చదువుతున్న పుస్తకాలలో ఈమధ్యనే Robert Conquest రాసిన 'The Harvest of Sorrow: Soviet Collectivization and the Terror Famine' అనే పుస్తకం చదివాను.

ఈ పుస్తకం స్టాలిన్ నిర్బంధ సంఘటిత వ్యవసాయ విధానాల ఫలితంగా జరిగిన హింస, ఉక్రెయిన్‌లో స్టాలిన్ ప్రభుత్వం కృత్రిమ కరువు సృష్టించి మిలియన్ల కొద్దీ ప్రజల మరణానికి కారణమైన విధానం అన్నిటినీ చాలా లోతుగా వివరిస్తుంది. ఉక్రెయిన్ ప్రజలను నరభక్షకుల స్థాయికి దిగజార్చిన కృత్రిమ కరువుతోపాటు, కరువు వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను వివరిస్తుంది.

బాల్యంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

నాకు గుర్తున్నంతవరకు 'నీతి చంద్రిక'. అవి చిన్నయ్య సూరి చేసిన అనువాదానికి retold versions అయి ఉంటాయి. ఆ కథలు చాలా ఆకర్షణీయంగా ఉండేవి, ముఖ్యంగా జంతువుల మధ్య సంభాషణాలు. ఇప్పుడు ఆలోచిస్తే అవి కూడా మ్యాజిక్ రియలిస్ట్ కథలు అనిపిస్తాయి.

వ్యక్తిగతంగా ప్రభావితం చేసిన రచయిత?

ఒక్క పేరు మాత్రమే చెప్పాలంటే త్రిపురనేని మధుసూధన రావు. ఆయన ఉపన్యాసాలు, విమర్శ మాతరం మొత్తాన్ని ప్రభావితం చేశాయి. కాల్పనిక సాహిత్యకారులకే కాదు, విమర్శకులకూ 'గ్లామర్' ఉందని ఋజువు చేశాడు త్రిపురనేని.

తెలుగులో మీకు నచ్చిన విమర్శ పుస్తకం?

దార్శనికుడు, నవలా రచయిత, కథకుడు, వ్యాసకర్త జి.వి. క్రిష్ణరావు రాసిన 'కావ్య జగత్తు'. భరతుని నుంచి ప్లేటో, మార్క్స్ దాక కావ్య వస్తురూపాలు ఎలా పరిణామం చెందాయో క్రిష్ణరావు అద్భుతంగా చర్చించాడు. ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలూ లోతుగా అర్థం చేసుకుని స్వతంత్ర సాహిత్య మూర్తిమత్వాన్ని రూపొందించున్న రచయిత జి.వి. క్రిష్ణరావు.

సాహిత్యంలో మీకు నచ్చిన కల్పితపాత్ర?

బుచ్చిబాబు 'చివరకు మిగిలేది?' లోని 'అమృతం'.

ఏ గతకాలం రచయితనైనా కలసి మాట్లాడగలిగితే ఎవరితో ఏం మాట్లాడతారు?

వడ్డెర చండీదాస్‌తో. ఆయన ఉన్నప్పుడు రెండుసార్లు మాట్లాడే ప్రయత్నం నేను, వేగుంట మోహన్ ప్రసాద్ గారు చేశాం. అయితే, ఆయన మాట్లాడ లేదు. మేమే మాట్లాడాము. ఆయన్ని అడగాలంటే- తనకీ, 'అనుక్షణికం'లోని శ్రీపతికి పాత్రకు ఉన్న సంబంధం ఏమిటి? అని అడుగుతాను. అలాగే- జీవితమిచ్చే అన్ని ఆనందాలను పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకోవాలని సంఘర్షించిన అన్నా కెరినాని, మేడమ్ బోవరీని టాల్‌స్టాయ్, ఫ్లాబర్ట్‌లు ఆ పాత్రలు తమ ఘర్షణ ఫలితాలను పొందకుండానే ముగించినట్టు, తాను కూడా స్వప్న రాగలీన పాత్రను ముగించాడా? అనీ అడగవచ్చు. అయితే, తన రచనల మీద ఎప్పుడూ మాట్లాడని చండీదాస్, Beckett లాగా, "The words are all we have" అని అంటాడేమో!

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

నా తరంలో చాలమంది లాగానే నేను చలం, రంగనాయకమ్మ నవలలు కథలు చదువుతూ సాహిత్య అభిరుచి పెంచుకున్నాను. ఇంటర్మీడియట్‌లో మాకు ఇంగ్లిష్ లెక్చరర్‌గా ఉన్న వర్ధనరావు గారు నన్ను మార్క్సిస్ట్ పుస్తకాల వైపు తిప్పారు. ఆ తరువాత త్రిపురనేని మధుసూధన రావు గారి ప్రేరణతో ప్రాథమిక మార్క్సిస్ట్ పుస్తకాలు చదవటం మొదలైంది. క్రమంగా యూరోపియన్ మార్క్సిస్టులకు, రష్యన్ మార్క్సిస్టులకు మధ్య మౌలిక వ్యత్యాసం ఉందని తెలిసి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్‌కి చెందిన మార్క్సిస్టుల పుస్తకాలు చదివాను. అది క్లాసికల్ మార్క్సిస్టు సిద్ధాంత పరిమితులను తెలుసుకోవటానికి ఆస్కారం కలిగించింది. సిద్ధాంత గ్రంథాలతోపాటు చదువుతూ వచ్చిన యూరోపియన్ సాహిత్యం ఆధునికానంతర వాదాన్ని పరిచయం చేసింది. ఆధునికాంతరవాద చర్చలలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ పోలిష్ తాత్వికుడు, సామాజిక శాస్త్రవేత్త జిగ్మట్ బౌమన్ రచనలను క్రమంగా చదువుతూ రావటంవల్ల ఆయన ఆలోచనలు ఆమోదయోగ్యంగా కనిపించాయి. సంప్రదాయ మార్క్సిస్టులు విస్మరించిన, విశ్లేషించలేని అనేక అంశాలను ఆయన అద్భుతంగా విశ్లేషించాడు. సోషలిజం ఒక ఆదర్శమే తప్ప, ప్రాజెక్టు కాదు, దానిని ఒక ప్రాజెక్ట్‌గా భావించి ఆచరణకు దిగటం వల్ల మానవ చరిత్రలో కనీవినీ ఎరుగని దారుణాలు జరిగాయనే ఆయన నిర్ధారణ నాకు చాలా కన్విన్సింగ్‌గా అనిపించింది. ఆయన ప్రేరణతోనే సోవియట్ రష్యాలో, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థలు కొనసాగించిన మారణహోమాలను గురించి రాసే పనిలో ఉన్నాను. ఇది ఒక కనీసం వెయ్యి పేజీల పుస్తకం కావచ్చు. ■

టిఫిన్ హోటల్లో ఆవిష్కరణ

నా మొదటి పుస్తకం

■ నగ్నముని



మానేపల్లి హృషీ కేశవరావు నా పూర్తి పేరు. 'ఉదయించని ఉదయాలు' నా మొదటి కవితా సంపుటి పేరు. 1962 సెప్టెంబర్‌లో విడుదలైంది. ముఖచిత్రం నా మిత్రుడు, చిత్రకారుడు శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ డిజైన్ చేశాడు.

ఒకప్పుడు హైదరాబాద్ చిక్కడపల్లిలో 'స్వరాజ్' అనే హోటల్ ఉండేది. ఒక రోజున పదిమంది మిత్రులం ఉదయం తొమ్మిది గంటలకు ఆ హోటల్‌కి చేరుకున్నాం. పెద్ద టేబుల్ చుట్టూ కూర్చుని అందరం ఒకేసారి 'ఉదయించని ఉదయాలు' పుస్తకాన్ని ఆవిష్కరించాం. హాలు లేదు. వేదిక లేదు. అధ్యక్షుడు, ఆవిష్కర్త, ముఖ్య అతిథులు, ఉపన్యాసకులు- ఎవరూ లేరు. పూలదండలు, శాలువాలు ఏమీ లేవు. పదిమంది మిత్రులు, ఓ కవితా సంపుటిని ఆవిష్కరించడం తదనంతర కాలంలో, సాహిత్యంలో అదొక అరుదైన సంఘటనగా నిలిచింది.



ఇక- ఆ హోటల్లో, ఆ రోజున, ఆవిష్కరణ తరువాత, నేను సర్వర్‌ని పిలిచి- "మేం మరో రెండు గంటలు యిక్కడే వుంటాం, టిఫిన్ చేస్తాం, అలాగే యీ రెండు గంటల్లో ఎవరెవరు టిఫిన్ చెయ్యడానికి వస్తారో, వెళ్లేటప్పుడు వాళ్ల బిల్లులు నాకు యివ్వు, మొత్తం నేనే చెల్లిస్తాను, యీ విషయం వాళ్లకు చెప్పు" అన్నాను. సర్వర్ వాళ్లకు అదే చెప్పాడు. టిఫిన్ చేసి వెళ్లేటప్పుడు వాళ్లు మా దగ్గరకొచ్చి విషయమేమిటని అడిగారు. "నా కవిత్వ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఆ సందర్భంగా మీకు టిఫిన్ అందజెయ్యాలనుకున్నాం" అంటూ పుస్తకం ఓ కాపీ వాళ్లకు యిచ్చాం. వాళ్లంతా చాలా సంతోషించారు. మరుసటి రోజున పత్రికలలో యీ సంఘటన ఒక విశేషమైన వార్తగా వచ్చింది.

తరువాతి కాలంలో- శ్రీ కె.వి. రమణారెడ్డి, శ్రీ కేతవరపు రామకోటిశాస్త్రి, విజయవాడ ఆకాశవాణిలోని శ్రీవాత్సవ మొదలైన ప్రముఖులు ఆయా పత్రికలలో 'ఉదయించని ఉదయాలు' సంపుటిని ప్రశంసాపూర్వకంగా సమీక్షించారు. ఈ సంపుటితో ఆధునిక కవిత్వం ఓ మలుపు తిరిగిందని, కొత్త కవిత్వంతో, కొత్త అధ్యాయం ప్రారంభమైందని ప్రకటించారు. కె.వి.ఆర్ ఒక అడుగు ముందుకు వేసి, యీ సంపుటి ఖండికలతో వున్నప్పటికీ, మొత్తంగా చూస్తే, కవితా నిర్మాణం చూస్తే, ఒక 'నవ్య కావ్యం'గా కనిపిస్తున్నది అంటూ- ప్రతి ఖండికనూ తీసుకుని, దాని విశిష్టతను వివరంగా, సుదీర్ఘంగా తెలియజేశారు.

వెంటనే, కె.వి.ఆర్ సమీక్షను తీవ్రంగా ఆక్షేపిస్తూ శ్రీ జె. నీలకంఠశాస్త్రి అనే పాఠకుడు తన ఘాటైన స్పందనను ఒక పెద్ద ఉత్తరంలో తెలియజేశారు. ఆయన అభ్యంతరాలు ఏమిటంటే- అసలు 'ఉదయించని ఉదయాలు' లోనిది కవిత్వమే కాదన్నారు. తరువాత- "ప్రకృతిలోని ప్రతి జీవనాంశానికీ, దాని పెరుగుదలలో ఏర్పడే వివిధ దశలకూ పేర్లు ఉంటాయి. ఉదాహరణకు- ఒక మొక్కను తీసుకుందాం- ఆ మొక్కకు మొగ్గ వేస్తుంది. అది, తరువాత పువ్వు అవుతుంది, అదే కాయ అవుతుంది- యిలా ప్రతి దశకూ ఓ పేరు ఉంటుంది. అలాగే- 'ఉదయించని ఉదయాలు'లో- ఉదయానికి పూర్వం- ఉదయించని ఉదయం ఒక దశ, ఆ దశకు ఒక పేరు వుండాలిగదా! అదేమిటో చెప్పాలి గదా!" అన్నాడాయన. తరువాత మరికొన్ని చిన్నవైన అభ్యంతరాలు చెప్పి, చివర్లో- "కొత్త కవులకు ప్రోత్సహించవచ్చు, కాని, యీ నవ్య కావ్య కవిని అంతగా ఆకాశానికెత్తెయ్యాలా!" అన్నారు. దానిపై కె.వి.ఆర్- నీలకంఠశాస్త్రి లేవనెత్తిన ప్రతి అంశానికీ సమాధానమిస్తూ, మరొకసారి ఆధునిక సాహిత్యంలో 'ఉదయించని ఉదయాలు' స్థానాన్ని తెలియజేస్తూ పెద్ద వ్యాసమే రాశారు.

కొన్నేళ్లు గడిచిన తరువాత, ఓ సభ సందర్భంగా నేనూ, కె.వి.ఆర్ కలుసుకోవడం జరిగింది. మాట మధ్యలో- "సర్- ఆ నీలకంఠశాస్త్రిగారెవరో మీకు తెలిసిందా?" అని అడిగాను. "తెలియలేదండి" అన్నారు. "నాకు తెలుసు" అన్నాను. "చెప్పండి ఆయనెవరు" అని ఆసక్తిగా అడిగారు. దానికి- "ఆ నీలకంఠ శాస్త్రి ఎవరో కాదు, నేనే" అన్నాను. ఆయన ఆశ్చర్యం నుంచి యింకా తేరుకోకముందే- నేను కొనసాగిస్తూ- "మీరు 'ఉదయించని ఉదయాలు' సంపుటిని గొప్పగా సమీక్షించారు. ఒకవేళ- ప్రతికూలంగా, మిమ్మల్ని ప్రశ్నిస్తే, మీ సమాధానం ఎలా వుంటుందో తెలియాలనే ఉద్దేశంతో అలా రాశాను" అన్నాను. ఆశ్చర్యం నుంచి తేరుకున్న తరువాత- ఆయన యిలా అన్నారు- "ఒక కవి తన కవిత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, మరొక పేరుతో రాయడం ఊహించలేనంత గొప్ప విషయం. అదొక సాహసం. బహుశా, మరెవ్వరూ చెయ్యలేని సాహసం" అంటూ- చాలా సంతోషించారు. ■



ఎల్లమ్మ వచనాలు

చెరువులు వాగులు కుంటలు
నీ నడుముకు చుట్టుకుంటయ్
గవ్వల మాలలై ఆషాడ బోనాలై
పగలూ రాత్రులు నీకు జీవుల
వొనగంట్లాట కడగండ్ల మూట
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మ...

నీ పాదముద్రలు మా పద్యనిద్రలు
నీ అదృశ్యమూ మా దృశ్యమూ
రెండూ వొక తీగ పూవులే...
జుంటి తేనెలో ముంచిన చందమామలు
నీ రెండు కండ్లు
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మా...

***

తమలపాకుల తోటలు... నీ చల్లని మాటలు
రాగిరి చెరువు మీది దీపం... గుట్ట మీది గుండాల తానం
నల్లని నీ ఆకాశ జడ... మొగిలి మొగ్గల జాడ
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మా...

***

పచ్చాపలు నీకు గాలినెగిరి పోర్లు దండాలు పెడ్తున్నాయి
వలవిసిరే చేతులకు ముద్దులు కడుతున్నాయి
తాటిగంపలల్ల తామే దూకి నిన్ను తలపోస్తున్నాయి
అమ్మా మేము మనుషుల ఆకలి తీరుస్తాము
నువ్వు మా ఆకలి తీర్చు అంటూ
నీ తొట్టెలెక్కి కూర్చుంటున్నయ్
అమ్మా మాయమ్మ
రేణుకెల్లమ్మా...

***

అన్ని సౌలతులు తక్కువయినా
నిన్ను మొక్కుకుంటే చాలు
నీ ఆత్మ మా జీవజీవాల కోసమే తండ్లాడుతుంటది
నీ దీవెనార్తిది గుట్టల చెరువుల భాష
గువ్వల పంటల గవ్వల భాష
అమ్మా మాయమ్మ
రేణుకెల్లమ్మా...

కుత్రలు మన్యాది పానాది సరిహద్దులు
కుంచెడు శోకం సోలెడు నమ్మకం
కుత్రలు బాగు సాగు సంతలు
మాటలు పాటల చింతల ముంతలు
నువ్వొక్క తల్లివే నిజ వాస్తవం
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మా...

■ సిద్ధార్థ



ఇవతల

దేహం
ఓ చీకటి పదం
పలకలేని నిశ్శబ్దవెలుతురది


ముడుచుకున్న ఆకారాల్లో
ఆమె ఆత్మ చూసావా

ఓ అజిహ్వా మరణ ప్రయాణం

కొత్త కన్నీరు పాత దేహంపై
విడిపోయే విడివిడి అక్షరాలకే తెలుసు

ఎంత వంచననైనా ప్రేమతో దిగమింగుకోవాలి

■ ఎం ఎస్ నాయుడు



ఇరుగు పొరుగు రాష్ట్రాల వాళ్ళం.. మధ్యలో ఇంగ్లీష్ అనువాదాలెందుకు!

ఈ ఏడాది నుంచే మొదలవుతున్న బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బెంగళూరులో జరుగుతున్నది. దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలు కేంద్రంగా ఈ సాహిత్య ఉత్సవం జరుగుతున్నది. ఈ ఉత్సవానికి 'ఆంధ్రజ్యోతి' మీడియా స్పాన్సరర్‌గా వ్యవహరిస్తున్నది. ఈ సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్, కన్నడ రచయిత సతీష్ చప్పరికేతో వివిధ జరిపిన ఇంటర్వ్యూ ఇది.



బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ ఆలోచన ఎలా కలిగింది? ఇప్పటికే దేశంలో జరుగుతున్న మిగతా ఫెస్టివల్స్ కంటే ఇది ఏ రకంగా భిన్నమైనది?

భారత దేశంలో చాలా లిటరేచర్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి. పేరుకి వీటిని భారతీయ భాషా సాహిత్యాలకు సంబంధించిన ఫెస్టివల్స్ అంటున్నారు. కానీ చాలా సందర్భాల్లో వీటి మొగ్గు ఇంగ్లీష్ భాషా సాహిత్యం వైపు, ఆ భాషలో రాసే రచయితల వైపే ఉంటున్నది. దక్షిణాది భాషలకు ఉన్న వేల ఏళ్ళ చరిత్ర, వాటిల్లో ఉన్న సాహిత్య సంపదతో పోల్చి చూసినప్పుడు నిజానికి హిందీ, ఇంగ్లీషు భాషలు చాలా ఇటీవలి భాషలు. అయినప్పటికీ దక్షిణాది భాషలకు ఈ ఫెస్టివల్స్‌లో తగిన ప్రాముఖ్యత లభించటం లేదు. ఇది గమనించాకనే మాకు ఈ 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్' ఆలోచన వచ్చింది.

అలాగే చాలా లిటరేచర్ ఫెస్టివల్స్ రచయితలకే ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నాయి. మేము రచయితలతో పాటు ప్రచురణకర్తలకు కూడా ప్రాముఖ్యత ఇస్తున్నాం. మొట్టమొదటిసారి ఇక్కడ ఒక పబ్లిషర్స్ కాంక్లేవ్ కూడా జరుగుతున్నది. దక్షిణ భారత దేశం లోని వందకుపైగా పబ్లిషర్లు ఇందులో పాల్గొంటారు. ఢిల్లీ నుంచి ఇంగ్లీష్ లిటరరీ ఏజెంట్లు కూడా ఇక్కడికి వస్తున్నారు. చికాగో యూనివర్సిటీ ప్రతినిధులు కూడా వస్తున్నారు. ఇప్పుడు ప్రపంచం దక్షిణాది భాషల వైపు చూపు సారిస్తున్నది. ఇక్కడి సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించటానికి అంతర్జాతీయంగా పబ్లిషర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. వారే డబ్బు పెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సందర్భంలో దక్షిణాది భాషల వారందరం ఏకమై మన సాహిత్యం ఎంత సుసంపన్నమైనదో ప్రపంచానికి చూపించగలగాలి. ఇది బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం.

ఈ ఫెస్టివల్‌ను పట్టాలెక్కించడానికి అవసరపడిన ప్రయత్నం గురించి చెప్పండి?

ఇలాంటి ఆలోచన ఒకటి ఆచరణ దాకా రావటం ఇదే మొదటిసారి. కేంద్ర సాహిత్య అకాడమీ మాజీ సెక్రటరీ, కేరళ సాహిత్య అకాడమీ ప్రస్తుత అధ్యక్షుడు కె. సచ్చిదానందన్‌ని ఇటీవల నేను కలిసి మాట్లాడినప్పుడు- ఆయన "మీకు ఈ ఆలోచన ఎప్పుడు వచ్చింది?" అని అడిగారు. రెండేళ్ళ క్రితం అని చెప్పాను. "ఇరవై ఏళ్ళ క్రితమే నాకు ఈ ఆలోచన వచ్చింది. కానీ దీన్ని ఆచరణలోకి తీసుకురావటం చాలా కష్టం" అన్నారు. నాలుగు సంస్కృతులను, నాలుగు దక్షిణాది భాషలను, ఆయా భాషల రచయితలను ఒక్క వేదిక మీదకి తీసుకు రావటం సులువైన విషయం కాదు. దీనిపై ఇప్పటికే ఎనిమిది నెలల నుంచి పని చేస్తున్నాం. ఇప్పుడు ఈ భాషల నుంచి 500మందికి పైగా రచయితలు వస్తున్నారు. వీరిలో 300 మంది వేదికలపై మాట్లాడతారు. ఉదాహరణకు ఎనభై ఏళ్ళ వయస్సు గల కవి కె. శివారెడ్డి నుంచి ఇటీవల యువ పురస్కారం పొందిన రమేష్ కార్తీక్ నాయక్ దాకా అన్ని వయసుల వారూ ఉత్సాహంగా తరలి వస్తున్నారు.

ఈ భాషలకు సంబంధించిన సాహిత్య ప్రతినిధుల్ని ఎంచుకునే ప్రక్రియ ఎలా జరిగింది?

ఈ ఎంపిక ప్రక్రియ ఎవరో ఒక వ్యక్తి ద్వారా జరగలేదు. మాకు ఒక క్యూరేషన్ కమిటీ ఉంది. ఈ కమిటీలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల ప్రతినిధులు ఉన్నారు. ఈ కమిటీ నాలుగుసార్లు సమావేశమైంది. అక్కడ జరిగిన చర్చల ఫలితంగా ఎంపిక ప్రక్రియ కొనసాగింది. అయినప్పటికీ ఇప్పుడు జరిగిన ప్రక్రియే అంతిమం అని మేం అనుకోవటం లేదు. ఈ ఫెస్టివల్ ప్రతి ఏడాదీ ఆగస్టు నెలలో రెండో శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో జరుగుతుంది. ఈ విడత ఇందులో భాగం పొందలేని వారు భవిష్యత్తులో జరిగే ఫెస్టివల్ ఎడిషన్లలో భాగం పొందుతారు. వారందరినీ ఒకే వేదిక మీదకు తెచ్చి, ఒకరితో ఒకరు సంభాషించుకొనేలా చేయటమే మా లక్ష్యం.

ఈ నాలుగు దక్షిణాది భాషల రచయితలనూ ఒక వేదికపై తేవటం ద్వారా మీరు ఎలాంటి ఫలితాలను ఆశిస్తున్నారు?

తెలుగులో సాహిత్యాభినివేశం ఉన్న పాఠకుడిని గానీ, రచయితని గానీ కన్నడలో మంచి పేరున్న ఐదారుమంది రచయితల పేర్లు చెప్పమంటే చెప్పగలిగే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇరుగు పొరుగు రాష్ట్రాలై ఉండి కూడా మనం ఒకరి సాహిత్యాన్ని మరొకరు ఇంగ్లీషు అనువాదాల ద్వారా చదవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. ఒక తెలుగు నవల ఇంగ్లీషు ద్వారా కన్నడ లోకి వచ్చినా మూలంలోని సారం చాలామటకు పోగొట్టుకునే వస్తుంది. మా ఉద్దేశమేమిటంటే- ఈ దక్షిణాది భాషల రచయితల మధ్య పరస్పర సంబంధాలు ఏర్పడితే అప్పుడు ఇంగ్లీషు అవసరం లేకుండానే ఈ భాషల రచనలు ఒక భాష లోంచి మరొక భాషలోకి నేరుగా అనువాదం పొందటానికి ఒక దారి ఏర్పడుతుంది. సహోదర భాషలైన దక్షిణాది భాషల సాహిత్యం ఏకం కావాలన్నదే మా లక్ష్యం. ఇది జరిగితే ఇక ఆ తర్వాతి దశలో ఈ భాషల నుంచి ఇంగ్లీషు అనువాదాలు జరిగి ఇక్కడి సాహిత్యం అంతర్జాతీయ స్థాయికి చేరుతుంది.

ఈ ఫెస్టివల్‌ను బెంగళూరులోనే నిర్వహించడానికి కారణం?

అందుకు తగ్గ సాంస్కృతిక వాతావరణం బెంగళూరులో ఉండటం ఒక కారణం. మరొక కారణం కూడా ఉన్నది. బెంగళూరు నగరంలో 15శాతం మంది తెలుగు భాష మాట్లాడేవారు ఉన్నారు, 15 శాతం మంది తమిళం మాట్లాడేవారు ఉన్నారు, 8 శాతం మంది మలయాళం మాట్లాడతారు, 35 శాతం కన్నడ మాట్లాడతారు. ఇది పూర్తి స్థాయి కాస్మోపాలిటన్ నగరం.

భవిష్యత్తులో ఈ ఫెస్టివల్ రూపురేఖల్లో ఇంకేమైనా మార్పులు చేర్పులు ఉండబోతున్నాయా?

వచ్చే ఏడాది మరాఠీ భాషను కూడా దీనికి జత చేయబోతున్నాం. తర్వాత క్రమంగా ఉర్దూ, కొంకణి, తుళు, కొడవ భాషలు కూడా వచ్చే సంవత్సరాల్లో ఇందులో భాగమయ్యేట్టు చూస్తాం. అంతా సక్రమంగా జరిగితే భవిష్యత్తులో ఉత్తర భారతీయ భాషల కోసం కూడా లక్నో లాంటి ప్రదేశంలో బుక్ బ్రహ్మ ఫెస్టివల్ నిర్వహించాలన్న ఆలోచనలు ఉన్నాయి. ■

కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారం

తెలంగాణ రచయితల వేదిక గత ఐదేళ్ళుగా ప్రదానం చేస్తున్న ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కార ప్రదానం ఆగస్ట్ 6 సా.6గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో జరుగుతుంది. పురస్కారాన్ని మాడభూషి శ్రీధర్ స్వీకరిస్తారు.వివరాలకు: 94915 98040

బూర్ల వేంకటేశ్వర్లు

కథలకు ఆహ్వానం

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ – విశాఖ సంస్కృతి మాస పత్రిక కథల పోటీని నిర్వహిస్తున్నాయి. ఏ4 సైజ్ పేజీలపై చేతి వ్రాతలో ఐదు పేజీలు, డిటిపిలో నాలుగు పేజీలు దాటరాదు. ఎంపికైన ఆరు కథలకు రూ.2,500 నగదు బహుమతి. కథలను ఆగస్ట్ 24లోగా చిరునామా: బండికల్లు జమదగ్ని, 402, హిమజ టవర్స్, 3/10, బ్రాడీ పేట, గుంటూరు–522002కు పంపాలి. మరిన్ని వివరాలకు: 9848264742.

బండికల్లు జమదగ్ని

'జుడుగుడు' కవితా సంపుటి

ప్రతాప్ రాజులపల్లి కవితా సంపుటి 'జుడుగుడు' ఆవిష్కరణ సభ ఆగస్టు 6 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగు తుంది. కార్యక్రమంలో కట్టా నరసింహా రెడ్డి, తంగెడ కిషన్ రావు, కుప్పిలి పద్మ, సంగెవేని రవీంద్ర, సమ్మెట నాగమల్లేశ్వరరావు పాల్గొం టారు.

గజ్జెల అశోక్ రెడ్డి

ఇంద్రగంటి సాహితీ పురస్కారం

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం 2024 సంవత్సరానికి కవి అఫ్సర్ స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం ఆగస్టు 14 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ బహుమానంలో భాగంగా రూ.25వేల నగదు, జ్ఞాపిక బహూకరణ జరుగుతుంది.

ఇంద్రగంటి జానకీబాల

నవలలకు ఆహ్వానం

అరసం వరంగల్ ప్రతి ఏటా ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్నారు. 2024కు గాను నవలలకు ప్రదానం చేస్తారు. 2020 జూలై – 2024 జూన్ మధ్య మొదటి ముద్రణ జరిగిన నవలలు నాలుగు ప్రతులను ఆగస్టు 31లోగా చిరునామా: నిధి, ఇంటి నెంబర్ 2-4-1449, అశోక కాలనీ, హనుమకొండ – 506001, ఫోన్: 97010 00306 కు పంపాలి. ఎంపికైన రచయితకు అక్టోబర్ 2024లో హనుమకొండలో రూ.5వేల నగదు, శాలువా, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం ఉంటుంది.

పల్లేరు వీరస్వామి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
సోమవారం 5 ఆగస్టు 2024


నేటి ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 4 : స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం ఉన్నందున హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.



- రుణమాఫీపై రైతుల్లో ఆందోళన
- అన్ని అర్హతలున్నా.. మాఫీ కాలేదని అన్నదాతల దిగాలు
- తెల్ల రేషన్‌కార్డు, కుటుంబంలో ఒకరికే మాఫీ నిబంధనలతో ఆవేదన
- ఫిర్యాదులు స్వీకరిస్తున్నా.. ఎప్పటిలోపు పరిష్కరిస్తారో చెప్పని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో రెండు విడతల్లో 2,08,077మందికి
- రూ.1,506.5కోట్లు మాఫీ
- అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని విజ్ఞప్తి

మాఫీ.. టెన్షన్!



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రైతు రుణమాఫీపై అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అన్ని అర్హతలున్నా మాఫీ జాబితాలో తమ పేర్లు రావడం లేదని.. ఖాతాల్లో సొమ్ములు జమ కావటం లేదని టెన్షన్ పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతల్లో రుణమాఫీ చేసింది. అయితే వేలాది మంది రైతుల తమకు రుణమాఫీ కావటం లేదని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఒకే ఇంటి పేరుతో వివిధ గ్రామాల్లో ఉన్న రైతులందరినీ ఒకే కుటుంబంగా చూపుతుండగా.. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవటం లేదని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికి రేషన్ కార్డు ఆధారంగానే మాఫీ జరుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,08,077మంది రైతులకు రూ.1,506.50కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఈ నేపథ్యంలో రెండు విడతల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నా అవి ఎప్పటిలోగా మాఫీ అవుతుందో స్పష్టం చేయకపోవటంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు.

రూ.1,506.50కోట్ల రుణాలు మాఫీ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 2,08,077మంది రైతులకు రూ.1,506.50కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఇందులో తొలి విడతలో వరంగల్ రూరల్ జిల్లాలో 30,148 రైతులకు రూ.165.07కోట్లు, రెండో విడతలో 21,166మంది రైతులకు రూ.190.58కోట్లు రుణమాఫీ చేసింది. రెండు విడతల్లో వరంగల్ రూరల్ జిల్లాలో మొత్తం 51,314మందికి రూ.355.65కోట్ల రుణ మాఫీని ప్రభుత్వం చేసింది. అలాగే వరంగల్ అర్బన్ జిల్లాలో తొలి విడత రూ.1లక్ష మాఫీని 19,013 మందికి రూ.102.67 కోట్లు, రెండో విడత రూ.లక్షన్నర మాఫీని 11,818మందికి రూ.108.24కోట్లు మాఫీ చేసింది. మొత్తంగా రెండు విడతల్లో వరంగల్ అర్బన్ జిల్లాలోని 30,831మంది రైతులకు రూ.210.91కోట్ల రుణమాఫీ జరిగింది. అలాగే జనగామ జిల్లాలో తొలి విడతలో 23,749మంది రైతులకు రూ.133.27కోట్లు, రెండో విడతలో 15,401మందికి రూ.159.80కోట్లు రుణమాఫీ చేశారు. జనగామ జిల్లాలో రెండు విడతల్లో మొత్తం 39,150మందికి రూ.293.07కోట్ల రుణమాఫీ జరిగింది. అలాగే మహబూబాబాద్ జిల్లాలో తొలి విడతలో 26,621మంది రైతులకు రూ.150.22కోట్లు, రెండో విడతలో 19,443మందికి రూ.193.47కోట్ల రుణమాఫీ జరిగింది. మొత్తంగా మహబూబాబాద్ జిల్లాలో రెండు విడతల్లో 46,064మంది రైతులకు రూ.343.69కోట్ల రుణమాఫీని ప్రభుత్వం చేసింది. అలాగే భూపాలపల్లి జిల్లాలో మొదటి విడతలో 14,079మంది రైతులకు రూ.79.74 కోట్లు, రెండో విడతలో 8,851మంది రైతులకు రూ.92.50కోట్లు రుణమాఫీ చేశారు. భూపాలపల్లి జిల్లాలో రెండు విడతల్లో 22,930 మందికి రూ.172.24 కోట్లు మాఫీ జరిగింది. అలాగే ములుగు జిల్లాలో మొదటి విడతలో 11,573మంది రైతులకు రూ.65.69 కోట్లు, రెండో విడతలో 6,215మంది రైతులకు రూ.65.25కోట్ల రుణమాఫీ జరిగింది. రెండు విడతల్లో ములుగు జిల్లాలో మొత్తం 17,788మంది రైతు ఖాతాల్లో రూ.130.94కోట్ల రుణమాఫీ నిధులను ప్రభుత్వం జమ చేసింది. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు రూ.1,506.50కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా రుణమాఫీ జరిగిన జిల్లాలో ఉమ్మడి వరంగల్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

కొందరికేనా రుణమాఫీ?

ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం రైతులందరికీ వర్తించకపోవటంతో గందరగోళ పరి స్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హ మీ మేరకు రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతు లకు మాత్రమే రుణమాఫీగా కటాఫ్ డేట్‌ను ప్రకటించింది. అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు తొలి విడత జూలై 18వ తేదీన లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రుణ మాఫీ ప్రకటించింది. అలాగే జూలై 30వ తేదీన రూ.1.50లక్షల లోపు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అయితే రుణమాఫీలోని నిబంధనలు, టెక్నికల్ సమస్యలతో అనేక మంది రైతులకు రుణమాఫీ కాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అయిన రుణమాఫీ వివరాలు

జిల్లా	రైతు ఖాతాలు	రెండు విడతల్లో మాఫీ
వరంగల్ రూరల్	51,314	రూ.355.65కోట్లు
వరంగల్ అర్బన్	30,831	రూ.210.91కోట్లు
జనగామ	39,150	రూ.293.07కోట్లు
మహబూబాబాద్	46,064	రూ.343.69కోట్లు
భూపాలపల్లి	22,930	రూ.172.24కోట్లు
ములుగు	17,788	రూ.130.94కోట్లు
మొత్తం	2,08,077	రూ.1,506.50కోట్లు

రుణమాఫీకి సమస్యలెన్నో?

రైతు రుణమాఫీలో అనేక సమస్యలు రైతులను గందర గోళానికి గురి చేస్తున్నాయి. ప్రధానంగా ఒకే కుటుంబంలో ఒకరికే రుణమాఫీ వర్తిస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. రుణమాఫీకి

మిగతా 7వ పేజీలో..

అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాలేదు

- బోళ్ల మౌనిక, రైతు, జడల్‌పేట, భూపాలపల్లి జిల్లా



చిట్యాల డీసీసీ బ్యాంకులో రూ.54వేల అప్పు ఉంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు కనిపించలేదు. ఇదే విషయమై వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాను. అయితే ఆధార్‌లోని పేరు.. రుణ ఖాతాలోని పేరు వేర్వేరుగా ఉందని చెప్పారు. అయితే అన్నింట్లో కరెక్ట్‌గానే పేరు ఉంది. ఏలాంటి తేడాలు లేవు. అధికారులు దరఖాస్తు ఇవ్వమంటే ఇచ్చాను. రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పటం లేదు.

నో డేటా ఫౌండ్ చూపుతోంది

- బీసు రాజు, చిన్నగూడూరు, మానుకోట జిల్లా



చిన్నగూడూరు మండలంలోని జయారం ఇండియన్ బ్యాంకులో రూ.31,000 రుణం తీసుకున్నా. మొదటి విడతలో రుణమాఫీ కాలేదు. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే కంప్యూటర్‌లో నో డేటా ఫౌండ్ చూపుతోందని చెబుతున్నారు. అధికారులకు దరఖాస్తు ఇచ్చినప్పటికి రెండో విడతలో మాఫీలో కూడా పేరు రాలేదు. రుణమాఫీ అవుతుందో లేదో కూడా అధికారులు చెప్పటం లేదు.

- హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన సిద్దోజు కృష్ణమూర్తికి బ్యాంకులో రూ.80వేలు ఆయన కుమారుడికి రూ.35వేల రుణం ఉంది. ఒకే రేషన్‌కార్డు ఉండటంతో తొలి విడతలో రుణ మాఫీ కాలేదు. రెండవ విడతలో ప్రభుత్వం లక్షన్నర రుపాయల మాఫీ చేసింది. అయితే కృష్ణమూర్తి, ఆయన కుమారుడికి కలిపి రూ.1,25,000లే అప్పు ఉన్నప్పటికి రుణమాఫీ కాలేదు. అధికారుల తప్పిదం వల్లే తనకు రుణమాఫీ కాలేదని బాధితుడు వాపోతున్నారు.
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన రైతు రావుల సీతారామ్‌రెడ్డి కేజీబీ బ్యాంకులో రూ.1.65లక్షల రుణం ఉండేది. గత మే నెలలో లక్ష రుణం బ్యాంకుకు చెల్లించగా, ఇంకా రూ.65వేల రుణం బ్యాంకులో ఉంది. తొలివిడతలో రుణమాఫీ కాకపోవటంతో సీతారామ్‌రెడ్డి వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించారు. అయితే రైతు పేరు మీద రూ.1.65లక్షల రుణం ఉన్నట్లుగా సైట్‌లో చూపిస్తుందని, రూ.2లక్షల రుణ మాఫీలో మాఫీ అవుతుందని సమాధానం ఇస్తున్నారని, అయితే తాను బ్యాంకులో చెల్లించిన రూ.1లక్ష ఏమైనట్లని బాధిత రైతు ఆందోళన చెందుతున్నారు.
- భూపాలపల్లి జిల్లా జంగేడుకు చెందిన గోగు నల్లసమ్మయ్య అదే గ్రామానికి చెందిన సహకార బ్యాంకులో రూ.40వేల లోను తీసుకున్నారు. తొలి విడత మాఫీలో నల్లసమ్మయ్యకు రుణమాఫీ కాలేదు. ఇదే విషయమై బ్యాంకు అధికారులను సంప్రదిస్తే.. వ్యవసాయ శాఖ అధికారులను అడు గాలని, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే బ్యాంకులో తెలుసుకో వాలని తిప్పుతున్నారని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ములుగు జిల్లా వాజేడుకు చెందిన కుర్సం నాగేశ్వర్‌రావు ఏపీజీవీ బ్యాంకులో రూ.58వేల రుణం తీసుకున్నారు. మొదటి విడతలోనే రుణ మాఫీ కావాల్సి ఉన్నప్పటికి నాగేశ్వర్‌రావుకు రుణమాఫీ జరగలేదు. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే.. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాక పోవటంతో రుణమాఫీ కావటం లేదని సమాధానం ఇస్తున్నారని రైతు వాపోతున్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రధాన పీఏ గణేష్

భద్రకాళి ఆలయానికి భక్తుల తాకిడి

- అమ్మవారిని దర్శించుకున్న సీపీ, కుడా చైర్మన్, సీఎస్ పీఏ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 4: ఆషాడ శుద్ధ అమావాస్య పురస్కరించుకుని ఆదివారం భద్రకాళి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సెలవురోజు, ఫ్రెండ్‌షిప్ డే కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా కుటుంబ సభ్యులతో కలిసి క్యూ లైన్ ద్వారా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పీఏ గణేష్ కుటుంబం, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు త్వరగా దర్శనం అయ్యేలా రెండు లైన్ల నుంచి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వీఐపీలకు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, ఆశీర్వచనాన్ని అందజేశారు.

కోటను ఏకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తాం

- కేంద్ర, రాష్ట్ర నిధులను సేకరిస్తాం..
- వచ్చేనెల 9న ముఖ్యమంత్రితో మ్యూజియం ప్రారంభిస్తాం..
- అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఖిలావరంగల్ ప్రాంతంలో పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



స్వయం భూదేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ, తదితరులు

ఖిలావరంగల్, ఆగస్టు 4: ఖిలావరంగల్ ప్రాంతాన్ని ఏకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామని, అందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని అటవీ, పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం ఖిలావరంగల్ మధ్యకోటలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పంటపొలాలు, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ కట్టడాల అభివృద్ధి పనులను ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులను ఖిలావరంగల్ ప్రాంతాన్ని ఏకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు.

దేశ విదేశాల నుంచి కోటకు వచ్చే పర్యాటకులు తిలకించేందుకు కోటలో శిథిలావస్థలో ఉన్న సుమారు 20దేవాలయాలను సైతం మరమ్మతు చేసి సందర్శించేలా చేస్తామన్నారు. కేంద్ర పురావస్తుశాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మ్యూజియంకు అదనపు నిధులను తీసుకువచ్చి మ్యూజియంను అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చేనెల 9న, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా కోటలో మ్యూజియంను అభివృద్ధి చేసి ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు.

వర్షపు నీటిని తొలగించాలి

కోటలోని రాతికోట వద్ద నిలిచిన వర్షపు నీటిపై సంబంధిత అధికారులతో మంత్రి చర్చించారు. వర్షపు నీటి నిల్వతో పంటపొలాలు నాశనం అవుతున్నాయని, కాకతీయులు నిర్మించిన జల్లెడతూంను వెడల్పు చేసి పొలాల్లోని నీటిని బయటికి పంపించాలని సూచించారు. రాతికోట చుట్టూ పెరిగిన ముళ్ల పొదలను తొలగించి పర్యాటకులకు ఆహ్లాదంగా ఉండేందుకు నేటి నుంచి ప్రారంభమయ్యే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను నాటాలన్నారు.

బోటింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలి

మాలఅగర్తల చెరువును పరిశీలించిన మంత్రి సురేఖ అందులో బోటింగ్, ఫిషింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లకు సమగ్ర ప్రణాళికలను చేయాలని నగర పాలక సంస్థ, కుడా అధికారులకు మంత్రి సురేఖ సూచించారు. అనంతరం ఖిలావరంగల్ కాపువాడలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజల సౌకర్యార్థం అదనంగా మొదటి అంతస్తును నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యకోటలోని స్వయం భూదేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్త కొమ్ము లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం చేశారు.

కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్వినితానాజీ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మేయర్ గుండు సుధారాణి, కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, మల్లూనాయక్, 'కుడా' పీఓ అజిత్ రెడ్డి, భీంరావ్, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్లు బైరబోయిన ఉమా దామోదర్‌యాదవ్, వెల్పుగొండ సువర్ణ-సురేష్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, బెడిద వీరన్న, బోయిని దూ డయ్య, నలిగంటి బబ్బులి, కరాటే ప్రభాకర్, శామంతుల శ్రీనివాస్, పోశాల సారంగపాణి , బైరబోయిన రవిందర్, సంగరబోయిన చందర్, శ్రీరాం రాజేష్, రావుల రాజేష్, బోయిని స్వరూప, బి.సరోజన, కాంగ్రెస్ నాయకుడు సాగర్ల శ్రీనివాస్, శాఖాధికారులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

బీసీ హక్కుల సాధన కోసం పోరాటమే శరణ్యం

- కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

వడ్డెపల్లి, ఆగస్టు 4 : బీసీ హక్కుల సాధన కోసం పోరాటమే శరణ్యమని, కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ తొలి శాసన సభ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ భవన్‌లో ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేత కోలా జనార్దన్‌గౌడ్ అధ్యక్షతన జాతీయ ఓబీసీ , ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల కులగణన చేయడంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ముందుకు రాకపోవడం వల్ల బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రతీ ఏటా బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామని చెప్పి, బడ్జెట్‌లో రూ. 9 వేల కోట్లు కేటాయించి అన్యాయం చేసిందని దుయ్యబట్టారు.బీసీ సంఘం రాష్ట్ర నేతలు ప్రొఫెసర్ తిరునహరి శేషు, తాడిశెట్టి క్రాంతికుమార్, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ కమిషన్ , రోహిణి కమిషన్, కలే లేకర్ కమిషన్ రిపోర్టుల ప్రకారం బీసీలకు న్యాయం చేయాలని, వారికి రావల్సినటువంటి రిజర్వేషన్లను , హక్కులను కల్పించాలని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నేత నాగపురి రాజమొగిలి, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ రాజారాం యాదవ్, ప్రొఫెసర్లు ప్రభంజని యాదవ్, విజయబాబు, సాంబమూర్తి, వీరస్వామి, రమేష్, గడ్డం కృష్ణయ్య, రాములు, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, విద్యార్థి సంఘం నాయకులు గొల్లపల్లి వీరస్వామి, వేణుమాధవ్, ధారబోయిన సతీష్, వీరబోయిన తిరుపతి, మాచర్ల శరత్‌చంద్ర, పొలంపల్లి రాంమూర్తి, నితిన్, మార్క శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్‌లో ని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే బీసీల సత్యాగ్రహ దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మేడారం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయింపు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- జాతర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



మేడారంలో మొక్క నాటుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఆగస్టు 4: మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సమ్మక్క, సారలమ్మల కీర్తి ని భవిష్యత్ తరాలకు గొప్పగా అందించేలా ప్రణా ళికలు ఉండాలన్నారు. మేడారం అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50కోట్లను ఐటీడీఏ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. వచ్చే మహాజాతర నాటికి మేడారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. మంత్రి సీతక్క ఆదివారం తాడ్వాయి మండలం మేడారంలో పర్యటించారు. భక్తుల వసతి కోసం నిర్మించిన పగిడిద్దరాజు, గోవిందరాజు భవనాల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా కలెక్టర్ దివాకర, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఇతర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. భక్తులు కూడా మొక్కలతో వనదేవతలకు మొక్కులు చెల్లించి మేడారం పరిసరాలలో నాటాలని సూచించారు.

ఐటీడీఏ అతిథి గృహంలో తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడారం అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. 2024 మహా జాతరలో చేపట్టిన పనుల ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరిలో జరిగిన మహా జాతర నిర్వహణ, సదుపాయాల కల్పన కోసం రూ.110కోట్లు కేటాయించగా, సివిల్ వర్క్‌ల కోసం రూ.66కోట్లు, జాతర నిర్వహణకు రూ.24కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగతా రూ.20 కోట్లకు అదనంగా ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో ఐటీడీఏ ద్వారా కేటాయించిన రూ.50 కోట్లతో మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తామన్నారు. రూ.17 కోట్లతో మేడారంలో 28 ఎకరాలలో స్మృతి వనం ఏర్పాటుకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్హార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, జిల్లా వైద్యాధికారి అప్పయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సూర్యకిరణ్, ఎంపీడీవో సుమనవాణి, ములుగు డీఎస్పీ రవీందర్, మేడారం జాతర కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొగత అదరహో..

తెలంగాణ నయాగరా బొగత అందాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలో ఉన్న బొగత జలపాతం అందాలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. చుట్టూ పచ్చని చెట్లు, నీలిరంగులో ఉన్న ఆకాశం.. అల్లంత ఎత్తు నుంచి జాలువారుతున్న తెల్లటి జలధారలను చూస్తుంటే ఎవరైనా అదరహో అనాల్సిందే. ఇన్నాళ్లు మబ్బులు కమ్ముకొని ఉన్న వాతావరణం ఇప్పుడిప్పుడే మామూలు స్థితికి వస్తున్న తరుణంలో నీలాకాశం మాటున బొగత అందాలు సంద ర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఆదివారం పర్యాటకులతో బొగత ప్రాంతం కిక్కిరిసిపోయింది.

- వాజేడు, ములుగు జిల్లా



'ప్రైవేటు ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికావు'

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 4 : రాష్ట్రంలోని ప్రైవేటు ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సబబు కాదని ఆల్ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ చౌహాన్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ హనుమ కొండలోని ఏకశిల పార్కులో నిసరన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద ర్‌లాల్ మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల్లో అర్హతలేని ఉపాధ్యా యులన్నప్పుడే మీ బిడ్డనే ప్రభుత్వ పాఠశాలలో ఎందుకు చదివించలేదని ప్రశ్నించారు. అర్హత లేని ఉపాధ్యాయులు పనిచేసే ప్రైవేటు పాఠశాలల్లోనే మంత్రులు, ఎమ్మెల్యేలు, చివరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో ఎందుకు చదివిస్తున్నారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని బీఈడీ, డీఈడీలు, పీజీలు చేసిన వారు బ్రతుకుదెరువు కోసం ప్రైవేటు పాఠశాలల్లో విద్యాబోధన చేస్తూ రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుంటే ముఖ్యమంత్రికి కళ్లు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతీ ప్రైవేటు పాఠశాలలో అర్హతగల ఉపాధ్యాయులే విద్యాబోధన చేయడంతోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ

అక్కడికక్కడే డ్రైవర్ మృతి.. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 4: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.... మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన చీర్రా యాకయ్య గౌడ్(36) కమలాపురానికి చెందిన ఓ లారీ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం అదే మండలంలోని చుంచుపల్లిలో గల ఇసుక క్వారీ నుంచి ఇసుకను లోడ్ చేసుకొని వరంగల్ వెళ్తున్నాడు. ఈక్రమంలో 163వ జాతీయ రహదారిపై ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్యలోకి చేరుకోగానే వరంగల్ నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న మరొక లారీ అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇసుక లోడుతో వెళ్తున్న లా రీ డ్రైవర్ చీర్రా యాకయ్యగౌడ్ అక్కడిక క్కడే మృతి చెందాడు. మరొక లారీ డ్రైవర్ జస్టిస్ సింగ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానిక సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రజిని ఉంది. ఈ విష యం తెలుసుకున్న స్థానిక ఎస్సై తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు.

అప్పజోష్యులకు సాహిత్య పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న అప్పజోష్యుల సత్యనారాయణ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 4 : నగరంలోని సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ సహకారంతో హైదరాబాద్‌లోని అనంతలక్ష్మీ కాంతం శారద పీఠం వారి ఆధ్వర్యంలో ఆదివారం వడ్డెపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో రేవూరి లక్ష్మీకాంతారావు శతజయంతి సభను ఘనంగా నిర్వహించారు. సహృదయ అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగిన సభను ఆచార్య బన్న ఐలయ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా అబోవిబో అధ్యక్షుడు ప్రముఖ సాహిత్యవేత్త అప్పజోష్యుల సత్యనారాయణకు రూ.25 వేల నగదుతో పాటు ప్రత్యేక ప్రశంసాపత్రం, దుశ్శాలువాతో అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు టీఎస్ఎన్. మూర్తి అప్పజో ష్యుల బహుముఖ పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రజ్ఞను విశేషంగా చెప్పారు. ప్రసార భారతి న్యూఢిల్లీ విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరి పద్మనాభరావు, అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కార విశేషాలను వివరిస్తూ గతంలో రావూరి భరద్వాజ, ఎస్పీ బాలసుబ్రమణ్యం, దారా రామనాథశాస్త్రి, కేవీ.రమణా చార్యులకు ప్రదానం చేసి ఈసారి అప్పజోష్యుల సత్యనారాయణను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో వనం లక్ష్మీకాంతారావు, అంపశయ్య నవీన్, డాక్టర్ ఎన్‌వీఎన్.చారి, డాక్టర్ గంజి వెంకటరత్నం, జూలూరి నాగరాజు, కళా రాజేశ్వర్‌రావు, దినకర్, రామోజు సుందరమూర్తి తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

మాఫీ.. టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవటం లేదని ప్రభుత్వం ప్రకటించినప్పటికి అదే కారణంతో చాల మంది రైతులకు రుణమాఫీ కావటం లేదు. అలాగే వివిధ గ్రామాల్లో ఒకే ఇంటి పేరుతో ఉన్న రైతులను ఒకే కుటుంబంగా చూపిస్తుండటంతో రుణమాఫీ కావటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొంత మంది రైతులకు బ్యాంకు ఖాతాల్లో, పాస్ పుస్తకాల్లో ఉన్న పేరుకు ఆధార్ కార్డులో అక్షరం తప్పుగా ఉన్న రుణమాఫీ చేయటం లేదని రైతులు వాపోతున్నారు. తండ్రీ, కొడుకులకు లక్షకు పైగా రుణం ఉండటంతో రెండవ విడత లక్షన్నర మాఫీలో అవకాశం వస్తుందని భావించినప్పటికి నిరాశే మిగిలింది. ఇలా వేలాది మంది రైతులకు వివిధ కారణాలతో రుణమాఫీ టెన్షన్ పెడుతుంది. అయితే ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను వ్యవసాయ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందపర్చి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లుతున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు



కొత్తగూడలో కేక్‌కట్ చేస్తున్న జేఎల్ఎన్‌వైసీ అధ్యక్షుడు రణధీర్

కొత్తగూడ, ఆగస్టు 4 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం యువకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం (జేఎల్ఎన్‌వైసీ) అధ్యక్షుడు మల్లెల రణధీర్ కేక్ కట్‌చేసి స్నేహితులకు అం దజేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాము, వెల్దండి శ్రీను, సల్లూరి సారంగపాణి, బోనాల లక్ష్మీనారాయణ, ఇరుప సుధాకర్, శ్రీకాంత్, సిరిగిరి సురేష్, కృష్ణ, మహేందర్, చందు పాల్గొన్నారు.

బల్దియాలో నేటి ప్రజావాణి రద్దు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4 : బల్దియాలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల ఈ వారం రద్దు చేస్తున్నట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి రద్దు అయిన నేపథ్యంలో సోమవారం బల్దియా కార్యాలయానికి ఫిర్యాదులతో ఎవరూ రావద్దని ఆమె కోరారు.

సకల శుభాల శ్రావణం



- నెలంతా శుభ ఘడియలే
- మోగనున్న పెళ్లి బాజాలు
- నోములు, వ్రతాలకు ముహూర్తాలు
- కళకళలాడనున్న వ్యాపారాలు
- ఫంక్షన్ హాళ్లకు ఫుల్ గిరాకీ

కొడకండ్ల ఆగస్టు 4: హిందూ సంప్రదాయంలో శ్రావణమాసానికి అత్యంత పవిత్రమైన నెలగా ప్రత్యేక స్థానముంది. చంద్రుడు శ్రవణా నక్షత్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి శ్రావణమాసంగా పిలుచుకుంటారు. అలాగే శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం కూడా శ్రవణా నక్షత్రం కావడంతో శ్రావణమాసానికి ఆ పేరు వచ్చింది. ఉత్తర భారతదేశంలో ఆచరించే సూర్యమానం ప్రకారం అక్కడ జూలై 22కే ప్రారంభమైనా దక్షిణాదిలో ఆచరించే చంద్రమానం ప్రకారం ఇక్కడ సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. విష్ణుమూర్తికి, శివుడికి, లక్ష్మీదేవికి చాలా ఇష్టమైన మాసంగా పరిగణిస్తారు.

మాసమంతా నోములు, వ్రతాలు, పండుగలే..

శ్రావణమాసంలో మహిళలు అనేక వ్రతాలు, నోములు చేసుకుంటారు. తమకు సౌభాగ్యాన్ని ఇవ్వాలని, కుటుంబం ఆర్థికంగా పరిపుష్టి కావాలని మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. నాలుగు మంగళవారాల్లో మంగళ గౌరీ వ్రతాన్ని, పౌర్ణమికి ముందు వచ్చే రెండో శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకుంటారు. సోమవారాలు శివుడికి పంచామృతాలతో అభిషేకం చేసుకుంటే ఫలితం ద్విగుణీకృతం అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెల 8వ తేదీన నాగుల చవితి, 9న నాగపంచమి, 16 న వరలక్ష్మీ వ్రతం, 17 న శనిత్రయోదశి, 19 న రాఖీ పౌర్ణిమ, శనిత్రయోదశి, 22 న సంకష్ట చతుర్థి, 26 న కృష్ణాష్టమి, హయిగ్రీవ జయంతి పండుగలు వస్తున్నాయి.

మోగనున్న పెళ్లిబాజాలు..



గురు, శుక్ర మూఢాలు రావడం వల్ల గత 3 నెలలు వైశాఖ మాసం, జ్యేష్ఠమాసం, ఆషాడమాసాలలో ఎలాంటి శుభముహూర్తాలు లేవు. దాంతో వివాహ సంబంధాలు ఖాయమైనా శుభముహూర్తాల కోసం ఎదురు చూస్తున్నారు. శ్రావణ మాసంలో శుభముహూర్తాలు ఉండటంతో వివాహాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలు జరుగనున్నాయి. ఆ తర్వాత వచ్చే భాద్రపదమాసంలో కూడా వివాహ ముహూర్తాలు ఉండనందువల్ల శ్రావణమాసంలో శుభకార్యాలు అధిక సంఖ్యలో జరిగే అవకాశం ఉంది. వివాహ వ్యవస్థపైన ఆధారపడ్డ ఫంక్షన్ హాల్ల యజమానులు, బ్యాండ్ మేళం, టెంట్ యజమానులు, పురోహితులు, పూల దుకాణదారులు, బట్టల షాపుల, నగల షాపుల యజమానులు, లైటింగ్, డీజే, డెకరేషన్ చేసేవాళ్ళు, కేటరింగ్, వంటవాళ్ళు, గొర్ల, కోళ్ళ పెంపకందార్లు, అద్దె కార్లు, బస్సుల యజమానులు, వివిధ కుల వృత్తుల వారు గత 3 నెలల నుంచి చేతిలో పనిలేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. శ్రావణంలో అధిక సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నందున ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోటెత్తనున్న ఆలయాలు

వరంగల్ కల్చరల్ : సోమవారం నుంచి శ్రావణ సందడి నెలకొననుంది. భద్రకాళి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుంటారు. సోమవారాల్లో నగరంలోని రామలింగేశ్వర, దుర్గేశ్వర, భోగేశ్వర, కాశీ విశ్వేశ్వర , ఆకారపు వారి గుడి, బొమ్మల గుడి, రంగంపేట శివాలయం , దత్తక్షేత్రం, కాశిబుగ్గ శివాలయం అభిషేకాలు కొనసాగుతాయి. గురువారాల్లో సాయిబాబా ఆలయాల్లో, శనివారాలు గీతా భవంనలోని శ్రీవేంకటేశ్వర స్వామి, బట్టల బజార్‌లోని శ్రీ వేంకటేశ్వరాలయం, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర ఆలయం, లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయాలతో పాటు నగరంలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రసాద వితరణ భోగాలు నిర్వహిస్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ములుగురోడ్‌లోని ఇస్కాన్ మందిరంలో పోతన రోడ్డులోని మురళీకృష్ణ మందిరంలో, గీతాభవన్‌లోని కృష్ణా ఆలయంలో, భద్రకాళి అమ్మవారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నెలలో వచ్చే ప్రతీ శుక్రవారం అమ్మవారికి పూజలు, అన్నదానాలు జరుగుతాయి.



మాకు చేతినిండా పని ఉంటుంది..

పొన్నం వెంకటేశ్వర్లు, టెంటు షాపు యజమాని

ఫంక్షన్ హాళ్లు పెరిగిన తర్వాత మా టెంట్‌షాపులకు చాలావరకు గిరాకీ తగ్గింది. ప్రతీ సంవత్సరం వేసవి సీజన్‌లో వందల వివాహాలు జరిగేవి. మాకు చేతినిండా పని దొరికేది. ఇప్పుడా పరిస్థితి లేదు. కేవలం బయట ఫంక్షన్లు చేసుకునేవాళ్లతో మాకు కొంత పని దొరికేది. కానీ ఈ వేసవిలో పనులు లేక మా దగ్గర పని చేసేవాళ్ళకు వేతనాలు ఇవ్వడం కూడా కష్టమైంది. మాతో పాటు ఈ వ్యవస్థపై ఆధారపడ్డ వృత్తుల వారు కూడా దాదాపు 3 నెలల కాలం పనులు లేవు. ఈ శ్రావణమాసంలో శుభకార్యాలు అధికంగా ఉన్నందువల్ల మాకుకూడా చేతినిండా పని దొరుకుతుందని ఆశిస్తున్నాం.



శ్రావణంలో సుముహూర్తాలు ఉన్నాయి..

పాలకుర్తి గౌతం సిద్ధాంతి, కొడకండ్ల

వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢమాసాలలో మౌఢ్యమి వల్ల ముహూర్తాలు లేకపోవడంతో వివాహసంబంధాలు కుదిరినా పెళ్ళి చేయడానికి సుమూహూర్తాల కోసం చాలామంది ఆగి ఉన్నారు. శ్రావణమాసంలో సుమూహూర్తాలు బాగానే ఉండటంతో శుభకార్యాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేక వివాహాలకు ముహూర్తాలు పెట్టాము. ఆ తర్వాత వచ్చే భాద్రపద మాసంలో ముహూర్తాలు ఉండవు. అందుకని శ్రావణంలో వర్షాలు పడే ప్రమాదమున్నా చాలామంది వివాహాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

హుషారెత్తించేలా.. షికారు

● భీమునిపాదంకు పెరుగుతున్న పర్యాటకులు



గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలోని భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 4 : ఎత్తైన కొండలు.. అరుదైన వృక్షాలు.. అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి రోజు రోజుకు పెరుగుతోంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ ఆహ్లాదకరమై వాతావరణంలో 70 ఫీట్లఎత్తు నుంచి జాలువారే వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ, పర్యాటకులు సందడి చేస్తూ కేరింతల నడుమ ఆనందంగా గడుపుతున్నారు. భీమునిపాదం గుట్టపై పచ్చని ప్రకృతిని ఆస్వాదించేందుకు వాచ్‌టవర్ కూడా ఉండడంతో పలువురిని ఆకర్షిస్తోంది. ఆదివారం సెలవు దినం కావడం, మరోపక్క స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహితులు సరదాగా గడిపేందుకు భీమునిపాదం వచ్చారు. దీంతో పర్యాటకుల సందడి పెరిగింది. భీమునిపాదం పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం గుర్తించడంతో ఆ ప్రాంతం అభివృద్ధి చేందుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

డెంగీతో ఆదివాసీ యువకుడు మృతి



అనిల్ (ఫైల్)

గూడూరు (మహబూబాబాద్), ఆగస్టు 4 : డెంగీతో బాధపడుతూ చికిత్సపొందుతున్న ఆదివాసీ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్టలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మర్రిమిట్టకు చెందిన తాటి సుగుణ-లక్ష్మయ్య దంపతులకు ఇద్దరు కుమారులు సునీల్, అనిల్ సంతానం. చిన్నకుమారుడు తాటి అనిల్ (23) కొద్దిరోజులుగా డెంగీజ్వరంతో బాధపడుతున్నాడు. తొలుత గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం నర్సంపేట, హన్మకొండ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికి ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ అనిల్ మృతదేహం వద్ద నివాళ్లర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేటి నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం

పారిశుధ్య నిర్వహణ... గ్రీనరీ పెంపు లక్ష్యం

ఈనెల 9 వరకు కొనసాగింపు



వర్ధన్నపేట/మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 4 : గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం (నేటి) నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకునేలా రోజువారిగా కార్యాచరణను విజయవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, మరో ముగ్గురు సభ్యులతో కూడిన బృందం, పట్టణాల్లో వార్డు అధికారి, ప్రత్యేక అధికారుల బృందం కార్యక్రమ అమలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు.

● 5న స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాలు, యువజన, వార్డుకమిటీ సభ్యులతో ర్యాలీ నిర్వహించాలి. గృహస్థాయిలో చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించి వ్యర్థాలతో ఎరువు తయారు చేయాలి. వ్యక్తిగత పరిశుభ్రత, కాలానుగుణ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలల్లో ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించాలి. వీధులు, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, పీహెచ్‌సీలు, బస్టాండ్లు శుభ్రం చేయాలి. పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలి. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి నిర్మించుకునేలా చూడాలి.

● 6న తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలి. నీరు సరఫరా అయ్యే పాయింట్ల వద్ద క్లోరినేషన్ పరీక్షచేయాలి. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడానికి ఇంకుడు గుంతలులేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటలను సందర్శించి వాటి సంరక్షణపై చర్చించాలి.

● 7న రహదారులపై నీరు నిలిస్తే తగిన చర్యలు తీసుకోవాలి. మురుగు కాల్వల్లో పూడికను తొలగించాలి. వర్షపునీరు, మురుగు నీరు కాల్వల్లోకి మళ్లించాలి.

● 8న వీధి కుక్కల ముప్పుపై దృష్టిపెట్టాలి. డెంగీ, మలేరియా, కాలానుగుణ వ్యాధులను నివారించడానికి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది జ్వర సర్వే నిర్వహించాలి. యాంటీలార్వా, ఫాగింగ్ చేపట్టాలి. చెరువుల్లో గంబూషియా చేపలు వదలాలి.

● 9న గ్రామాల్లో, పట్టణాల్లో అన్ని కుటుంబాలు డ్రై డేగా పాటించేలా చూడాలి. నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. ఇళ్లలో ఉపయోగించని వస్తువులను తొలగించేలా చూడాలి. స్క్రాప్, టైర్ పంక్చర్ దుకాణాలు తనిఖీ చేయాలి. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల పైకప్పులను శుభ్రం చేయాలి. శిథిలమైన భవనాలు, గోడలను తొలగించాలి.

వన మహోత్సవంలో..

గ్రామాల్లో, పట్టణాల్లో వన మహోత్సవం కింద మొక్కలు నాటాలి. అట వీసరిహద్దు ప్రాంతాల్లో అటవీ జంతువులకు ఉపయోగపడే అటవీ ఉత్పత్తి జాతులను పెంచాలి. రహదారుల పక్కన, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు నాటాలి. ప్రతీ ఇంటికి కనీసం ఆరు మొక్కలు పంపిణీ చేయాలి. పంచాయతీ, మునిసిపల్ స్థలాలను గుర్తించి రక్షణ కల్పించాలి.

ఇక నుంచి ప్రతీ నెల మూడో శనివారం..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఇంతటితో ఆపకుండా ఎప్పటికి జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసింది, భవిష్యత్‌లో దానికి కొనసాగించేందుకు ప్రతి నెల మూడో శనివారం రోజున అన్నిగ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సాహిత్యం సమాజ దిక్సూచి కావాలి

కథల అర గ్రంథావిష్కరణలో ప్రముఖులు



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న టి.రాజేశ్వర్‌రావు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 4 : సాహిత్య ప్రక్రియ ఏదైనా సమాజంలో కొంత మందికైన ఉపయుక్తంగా ఉంటూ దిక్సూచిగా మార్గదర్శనం చేయాలని వరంగల్ నగర మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అంజనీదేవి కలం నుంచి జాలువారిన కథల అర గ్రంథాన్ని డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పర్చ కోదండరామరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎనమిది పదుల వయస్సులోనూ నిత్య నూతనంగా అద్భుత కథలను ఆవిష్కరింపజేసిన అంజనీదేవిని అభినందించారు. ఆచార్య డాక్టర్ మాడభూషి శ్రీధర్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొని మాట్లాడుతూ.. అటు విద్యారంగంలో కోదండరామారావు, వైద్య రంగంలో డాక్టర్ అంజనీదేవిలో ఎనమిది పదుల వయస్సులోనూ ఇంకా చేస్తున్న కృషిని అభినందించారు. ఇరువురు వారి రంగాల్లో చేస్తున్న సామాజిక సేవను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆచార్య కాత్యాయిని విద్మహే, నెల్లుట్ల రమాదేవి, పొట్లపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సోమరాజ్ తదితరులు ఈ గ్రంథంలోని 15 కథల తీరుతెన్నులపై ప్రసంగించారు. డాక్టర్ అంజనీదేవి మాట్లాడుతూ తన స్వీయానుభవంలో జరిగిన సంఘటనలు నిత్య జీవితంలో ఎదుర్కొన్న వాస్తవాల నుంచి సాహిత్య అభిరుచి మేరకు రాసుకున్న కథలు గ్రంథంగా రావడం ప్రశంసలందుకోవడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. తమ్మెర రాధిక, డాక్టర్ వాసిరెడ్డి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

'అర్హతలు లేని వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారు'

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 4: అర్హతలు లేని వారికి గ్రూప్-1 ఉద్యోగాలు ఎలా ఇస్తారని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, డీఎంఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆదివారం కేయూ ఎస్డీఎల్‌సీఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇండియన్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తానని ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి అర్హతలే లేని వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వారికి ఉద్యోగాల ప్రకటన నిరుద్యోగులను అవమానప రిచినట్టేనన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి నిరు ద్యోగులకు క్షమాపణలు చెప్పాలన్నారు. వారిని క్రీడాశాఖ మంత్రులు గాను, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్లుగా నియమిస్తే మంచిదని హితవు పలికారు. ఈ విషయమై హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తికి లేఖ రాస్తున్నామన్నారు. ఈ లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా తీసుకొని ఇచ్చిన ఉద్యోగాలను వెనక్కి తీసుకునేట్లు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఠాగూర్, వెంకట్, నాని, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



ఏకగ్రీవంగా నియామితులైన హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 4 : హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ అజీజ్‌ఖాన్, ఆకుల సారంగపాణి, ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆదివారం హనుమకొండ కేయూ రోడ్డులోని ఎన్. ఎస్ ఫంక్షన్‌హాల్లో హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల పరిశీలకులుగా కర్తయ్య, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బైరబోయిన కైలాస్‌యాదవ్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. హనుమకొండ జిల్లా చీఫ్ ప్యాటరన్‌గా అడిషినల్ ఎస్పీ పుల్లా శోభన్‌కుమార్, చైర్మన్ సోదా రామకృష్ణ, అధ్యక్షుడుగా మహ్మద్ అజీజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల సారంగపాణి, కోశాధికారిగా చెమ్మ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కె. కృష్ణరెడ్డి, కుమారస్వామి, టి. సంపత్‌రావు, పి. రమేష్, ఎ. ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎండీ. అక్రంఖాన్, పి. రాజమౌళి, జి. రమేష్‌గౌడ్, ఎండీ. సద్దాం హుస్సెన్, బి. ప్రభాకర్, ఈసీ మెంబర్లుగా బిన్ని. లక్ష్మణ్, సృజన్‌కాంత్‌లను ఏకగ్రీకంగా ఎంపిక చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం...

వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్. అబ్దుల్లా ఖాన్, కోశాధికారి బి. ముఖర్జీ, ఉపాధ్యక్షులుగా ఎ. సాయిలు, షబ్బీర్‌ఆలీ, బొట్ల ప్రతాప్, బి. రవీణ, నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా కక్కెర్ల మల్లికార్జున్, ఎండీ. అక్తర్, కె. సాంబమూర్తి, జి. బాబులను ఎన్నికల పరిశీలకు కర్తయ్య ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా డీవైఎస్‌వో సత్యవాణి, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

160 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 4 : చిల్పూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని రూ.3లక్షల 52వేల విలువైన 160 క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎం.దేవేందర్ పరిసర గ్రామాల్లో తక్కువ రేటుకు పీడీఎస్ రైస్ కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాలకు అమ్ముతుంటాడు.

అక్రమంగా నిలువ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు చేసి రైస్ స్వాధీనం చేసుకుని దేవేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం చిల్పూర్ పోలీస్ స్టేషన్‌లో దేవేందర్‌ను అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY

సోమవారం 5 ఆగస్టు 2024

హనుమకొండ సిటీ

• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన రెడ్డి సంఘం నాయకులు

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

జూలైవాడ, ఆగస్టు 4: రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడంతో పాటు కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కేబినెట్‌లో రెడ్డి కార్పొరేషన్‌ను ఆమోదించినప్పటికీ నేటికి నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చందుపట్ల నర్సింహారెడ్డి, గంట సంజీవరెడ్డి, బొల్లు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెల్‌బేబీ షోలో పాల్గొన్న బాలబాలికలు

రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో వెల్‌బేబీషో

కాజీపేట, ఆగస్టు 4: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో రైల్వే ఉద్యోగుల పిల్లలకు వెల్‌బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే ఆసుపత్రి డీఎంవో డా. హరిబాబు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, వ్యకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, ట్రెజరర్ జి. రాజేశ్వర్‌రావు, కల్చరల్ విభాగాల నిర్వాహకులు ధారవత్ రఘు, కమిటీ సభ్యులు ఎస్. ప్రవీణ్, పి. రవికిరణ్, పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి



రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్ అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 4: ఆరోగ్యకరమైన ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని రిటైర్డ్ టీచర్ బరిగెల సుదర్శన్ అన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం హనుమకొండలోని రెడ్‌క్రాస్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం స్నేహితుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రెడ్‌క్రాస్ పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్ మాట్లాడుతూ ఒకరి రక్తదానంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. సుమారు 40 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు గఫార్, రాజేష్, రవీందర్, శంకర్, శ్రీధర్, రాజమౌళి, మహోహర్ రెడ్డి, వంశీ, విఠల్, రెడ్‌క్రాస్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూవివాదంలో కానిస్టేబుల్‌పై కేసు

ఐనవోలు, ఆగస్టు 4: కానిస్టేబుళ్లయిన ఇద్దరు సోదరుల మధ్య తలెత్తిన భూ వివాదంలో తమ్ముడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం ఐనవోలుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ అమరవాది కుమారస్వామి ఎ ఆయన సోదరుడైన ఏఆర్ కానిస్టేబుల్ అమరవాది రమేష్‌లకు వారసత్వంగా 20 గుంటల భూమి లభించగా ఇద్దరి మధ్య పంపకాలు జరిగాయి. కుమారస్వామి తన అన్న భూమిలోకి అక్రమంగా ప్రవేశించి హద్దులను ధ్వంసం చేయడంతో పాటు కొంత భూమిని ఆక్రమించుకొని కొత్తగా హద్దులు పాతాడని రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ్ముడు కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యే నాగరాజుకు వడ్డెర సంఘం వినతి



ఎమ్మెల్యేకి వినతి పత్రాన్ని అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

హనుమకొండ సిటీ, ఆగస్టు 4: వడ్డెరలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం తరుపున స్థలం కేటాయించాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా వడ్డెర సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన ఎమ్మెల్యే నాగరాజుతో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్యను వారి వారి నివాసాల్లో వేర్వేరుగా కలిశారు. వర్ధన్నపేట నియోజక వర్గ పరిధిలోని గుండ్లసింగారం ఇందిరమ్మ కాలనీ, గణేష్‌నగర్‌లో 440 పైగా నివసిస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. సంఘం సమావేశాలు వడ్డెర కుటుంబ సభ్యుల కార్యక్రమాల నిర్వహణ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణ అవసరం ఉందన్నారు. ఈ మేరకు స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే నాగరాజు స్పందిస్తూ స్థల కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గండికోట సంపత్, పశ్చిమ నియోజక వర్గ అధ్యక్షుడు వల్లేపు శ్రీనివాస్‌తో పాటు గండికోట బాబు, వల్లేపు జంపయ్య, బొంత ప్రభాకర్, బొంత సుధాకర్, ఆలకొండ లక్ష్మణ్, రాజేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోల నియామకానికి సానుకూలంగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం రమేష్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 4: రాష్ట్రంలోని మండల విద్యావనరుల కేంద్రాల్లో రెగ్యులర్ ఎంఈవోలను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగానే ఉందని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాసిరిరాజు బాపురావు అధ్యక్షతన టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... ఎంఈవోల నియామకానికి అవసరమైన అనుకూల అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఎంఈవోల నియామకానికి ప్రభుత్వం త్వరలోనే ప్ర భుత్వం చర్యలు చేపట్టనుందన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలన్నింటిపై ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో అవగాహన ఉందని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ పాఠశాలలో స్కావేంజర్ నియామకం చేపడుతామని, ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పీఎస్ హెచ్‌ఎం పదోన్నతికి బీఈడీ గల ఎస్జీటీలందరికీ కల్పించే విధంగా జీవో నెం. 11, 12లను సవరించి రాబోయే కాలంలో ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియామకం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, చీఫ్ పాటర్న్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ డి. విష్ణుమూర్తి, మెంబర్‌షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్ రావు, రాష్ట్ర కార్యదర్శి రఘుకుమార్, నాయకులు సదానందం, రాజ్‌కుమార్, ప్రనీద్, శ్రీనివాస్‌నాయక్, కిషన్, కృష్ణమూర్తి, రవీందర్, కుమార్, రాజునాయక్ శ్రీనివాస్, మొగిళి, కుమారస్వామి, నరసింహస్వామి, రాజన్న, సదానందం, రాజయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

కాళోజీ జంక్షన్, ఆగస్టు 4: నీట్ ఎంబీబీఎస్ కౌన్సిలింగ్‌లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి ఓసీ జేఏసీ నాయకులు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సంఘం నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, ఎడెల్లి రాజిరెడ్డి, వెలుగటి రాజిరెడ్డి, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ తిప్పర్తి రాఘవరెడ్డి హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. అందుకు స్పందించిన వేం నరేందర్‌రెడ్డి తగు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పద్మశాలి సంఘం కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

ఐనవోలు, ఆగస్టు 4: పున్నేలు గ్రామ పద్మశాలి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా మోర లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా మోర సుదర్శన్, ఉపాధ్యక్షుడు మోర కుమారస్వామి, కార్యదర్శి ఎం. అశోక్, కోశాధికారి ఎం.మల్లేశం, సభ్యులుగా జి. రమేష్, ఉపేందర్, వెంకటేశ్వర్లు, కొంరయ్య, శాస్త్రి, రాంచంద్రం, జగదీష్, మహేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

ఐనవోలు, ఆగస్టు 4: ఈ నెల 5, 6, 7 తేదీలలో కాజీపేట కనుకదుర్గ కమ్యూనిటీ హాల్లో జరుగు సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె. లింగయ్య పిలుపునిచ్చారు. ఈ తరగతులకు సీపీఎం రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జా

న్యాయం చేయాలని కేయూ పీఎస్ ఎదుట బాధితుల ధర్నా



దర్నా చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం, ఆగస్టు 4: నాలుగు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన తమ స్థలాలను నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆరోపిస్తూ బాధితులు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట ఆదివారం రాస్తారోకో చేశారు. బాధితులు కుటుంబ సభ్యులతో స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు బాధితులతో చర్చించి ఆందోళన విరమింపచేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 1982లో రెడ్డిపురం శివారులో సర్వే నం. 143లో 12 ఎకరాల స్థలం పెంటారెడ్డి బాలిరెడ్డి వద్ద 166 మంది కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ స్థలాన్ని 2008లో బాలిరెడ్డి కుమారుడు ప్రతాప్‌రెడ్డి తప్పుడు పత్రాలతో తన భార్య పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న తాము ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే ప్రతాప్‌రెడ్డి పేరిట జారీ అయిన పట్టా పాస్ బుక్‌ను రద్దు చేయించడం జరిగిందన్నారు. పాస్ బుక్ రద్దు అయినప్పటికీ ఈ స్థలాన్ని ప్రగతి అసోసియేట్స్‌కు అమ్మడం జరిగిందని వారు పేర్కొన్నారు. గత కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగిందని వారు తెలిపారు. రంగనాథ్ బదిలీ అయ్యాక ప్రగతి అసోసియేట్స్‌కు చెందిన రామిరెడ్డి, రవీందర్‌రెడ్డి, జనార్దన్ పటేల్ స్థానిక రాజకీయ నేతల అండతో 166 ప్లాట్ల చుట్టూ ప్రహరీ నిర్మించి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వారు అన్నారు. తమకు జరిగిన అన్యాయంపై పలుమార్లు కేయూ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పోలీస్ కమిషనర్ స్పందించి తమ స్థలం కబ్జా చేసిన వారిపై చర్య తీసుకుని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో అబ్దుల్ గఫూర్, అయూబ్, రవిందర్, రాజమౌళి, రమేశ్, ఫయాజ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బాధితుల్లో ఏఆర్ ఎస్ఐ రాజమౌళి, హెడ్ కానిస్టేబుల్ రమేశ్ ఉండటం విశేషం. బాధితులను కాపాడే ఉద్యోగంలో ఉండి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరడం గమనార్హం.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నారాయణగిరి పాఠశాలలో కలుసుకున్న టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ధర్మసాగర్, ఆగస్టు 4: ధర్మసాగర్ మండలం నారాయణగిరి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 1992-93 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన వారు 31 సంవత్సరాల తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ది శ్రీనివాస్, ఎండి.జహీదా, ఎస్.రవీందర్, జి.సత్యనారాయణ, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎడ్యుకేషన్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని నేరేడుపల్లి జడ్పీహెచ్ఎస్ 1989-90 విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన అపూర్వ స్నేహితుల కలయికలో అందరూ అప్పటి ఆనందాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె. రఘు, డి. భాస్కర్, ఎం. శ్రీనివాస్, ఎండి. సుభాన్, కె. భీమరావు, పి. జంపయ్య, టి. రాజు, ఎస్. రవీందర్, బి. రమేష్, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

వడ్డెపల్లి, ఆగస్టు 4: సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ పోస్టులను ప్రభుత్వం జీవోలకు భిన్నంగా భర్తీ చేస్తుందని ఆరోపించారు. ప్రిన్సిపాల్ పోస్టులను ఎస్సీ రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిలో నింపాలని అన్నారు. సమావేశంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుట్ల రవీందర్, అంబేద్కర్ సంఘం నేతలు సింగారపు ఐలయ్య, కడారి దేవయ్య, మునియాల వెంకన్న, పద్మారావు, ప్రతాప్‌కుమార్, మేకల ప్రవీణ్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతోనే ఆత్మరక్షణ సాధ్యం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4: కరాటేతోనే విద్యార్థులకు ఆత్మరక్షణ చేకూరుతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధం నరేష్ పటేల్ అన్నారు. ఆదివారం ఊరుగొండ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వరంగల్ కార్పొరేషన్ ఇండోర్‌స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన నరేష్ పటేల్ పోటీ లను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కరాటేతో ఆత్మరక్షణతోపాటు శారీరక ధృఢత్వం, మానసికోల్లాసం పొందుతారన్నారు. జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌ను ఆయన అభినందించారు. ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి విద్యా ర్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో గాదె రవీందర్, కల్లెపు విజయ్, బచ్చు రాజు, రవి పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌లో స్నేహితుల దినోత్సవం

సుబేదారి, ఆగస్టు 4: హనుమకొండ సుబేదారి క్రాస్ రోడ్డులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ అసోసియేషన్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్నేహితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సుదర్శన్, అబ్దుల్ గఫార్, రాజేష్, రవీందర్, శివశంకర్, శ్రీధర్, రాజమౌళి, మనోహర్‌రెడ్డి, విఠల్, వంశీ, రెడ్ క్రాస్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమకొండ వడ్డెపల్లిలోని జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్స్‌లో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. జీఎంఆర్ మిత్ర బృందం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి రవీందర్, ప్రతినిధులు కొండూరి శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'జంగా' పరామర్శ

మడికొండ, ఆగస్టు 4: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దర్గా కాజీపేట పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్ నాయనమ్మ దువ్వ కొమురమ్మ ఆదివారం మృతి చెందారు. ఈవిషయాన్ని తెలుసుకున్న స్టేట్ ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, స్టేట్ ఫైనాన్స్‌కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులు ఆమె భౌతిక కాయాన్ని మడికొండలోని నివాసంలో సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాంగ్రెస్ శ్రేణులు రాజేష్‌రెడ్డి, బిల్లా రవి, మోహన్,శంకర్, లింగం, శ్రీను, రజిని, వేణుయాదవ్, చిన్న కుమార్, దువ్వ విజయ్, అర్జున్‌గౌడ్, భిక్షపతి, చంటి ఉన్నారు.

సీఐ డబ్బులు ఇవ్వమని వేధిస్తున్నాడు

- సీపీగారు న్యాయం చేయాలి
- సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన బాధితుడు




మాట్లాడుతున్న బాధిత కుటుంబం

వరంగల్ క్రైం, ఆగస్టు 4 : ఓ స్థలం విషయంలో వరంగల్ డివిజన్ పరిధిలోని మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ బాధితుడు జి.రవి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రెండు రోజులుగా చక్కర్లు కొడుతున్న వీడియోలో సీఐపై తీవ్రస్థాయిలో రవి ఆరోపణలు చేశాడు. మూడు సంవత్సరాల క్రితం చింతల్‌లో ఒక స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టినట్లు రవి తెలిపారు. మూడు సంవత్సరాల తర్వాత ఒక వ్యక్తి వచ్చి ఆ స్థలం తనదని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదు తీసుకున్న సీఐ మల్లయ్య తనను పిలిచి రెండు లక్షలు డిమాండ్ చేయడంతో పాటు ఫిర్యాదు దారుడికి రూ.10లక్షలు ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేసి పేపర్ రాయించినట్లు తెలిపారు.

ఈ విషయంలో తనను మొద్దుకు వేసి కొట్టడంతో పాటు తీవ్రస్థాయిలో దూషించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈవిషయంలో పోలీస్ కమిషనర్ స్పందించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే కుటుంబ సభ్యులతో ఆత్మహత్యే శరణ్యమని రవి తెలిపారు. కాగా, ఈ విషయమై సీఐ మల్లయ్యను వివరణ కోరగా స్టేషన్‌కు అందిన ఫిర్యాదు మేరకు రవిని పిలిచి మాట్లాడినట్లు తెలిపారు. అతడిపై చేయి చేసుకున్నానని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆయన కొనుగోలు చేసినట్లు చెబుతున్న స్థలం విషయంలో ఇరువర్గాలు చేసుకున్న ఒప్పందం విషయంలో తన ప్రమేయం లేదన్నారు. తాను రవి నుంచి డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. కావాలని తనపై ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. గతంలో రవిపై పలు సంఘటనల్లో ఫిర్యాదులు ఉన్నాయని సీఐ తెలిపారు.

నెల రోజుల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ


లబ్ధిదారులకు ఎమ్మెల్యే నాయిని హామీ



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న తోట పవన్

హనుమకొండ టౌన్, ఆగస్టు 4 : అంబేద్కర్ నగర్, జితేంద్రనగర్ కాలనీ వాసులకు నెల రోజుల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వాలని గత ఐదు రోజులుగా కాలనీవాసులు హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్నారు. స్థానికుడు, గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇండ్లను పేద ప్రజలకు పంచాలని వివిధ రూపాల్లో ఆందోళన చేసిన కాంగ్రెస్ యువజన నాయకుడు తోట పవన్ ఆదివారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో వీడియో కాల్‌లో లబ్ధిదారులతో మాట్లాడించి భరోసా ఇప్పించారు. వీడియో కాల్‌లో నాయిని మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి నెలరోజుల్లో ఇండ్లు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్లు పవన్ తెలిపారు. కాగా, ఎమ్మెల్యే హామీ విస్మరిస్తే ఆమరణనిరాహార దీక్షకు దిగుతామని డబుల్ బెడ్ రూం సాధన కమిటీ అధ్యక్షులు ఎర్ర చంద్రమౌళి అన్నారు.

దంపతులు రచించిన పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

కాళోజీ జంక్షన్, ఆగస్టు 4: భక్త కవి పోతన రమణీయ రచనా శైలిలోని గొప్పదనాన్ని ఏ మాత్రం తగ్గకుండా పోతన కవితామృతం, కందపద్య రచనను వెలుగు ప్రభాకర్ తెలుగు సాహిత్య లోకానికి అందించారని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర విశ్రాంత ప్రధానాచార్యులు యెల్లంభట్ల నాగయ్య అభినందించారు. ఆదివారం హనుమకొండలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వెలుగు ప్రభాకర్- విజయలక్ష్మి దంపతులు రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరణ సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు ప్రభాకర్ రచించిన పోతన కవితామృతం, డాక్టర్ విజయలక్ష్మి రచించిన ఆంధ్ర మహాభారతంలో స్త్రీ పాత్రల చిత్రణ అనే పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి విశ్రాంత ప్రధానాచార్యులు హరి సనత్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత హనుమకొండ పరిషత్ విద్యాశాఖ అధికారి ఇ.నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభాకర్ రచించిన పోతన కవితామృతం పద్యాలు సరళంగా ఉన్నాయని, పోతన పాండిత్య ప్రతిభను, స్వభావాన్ని చక్కగా వ్యక్తపర్చారని కొనియాడారు. విశ్రాంత తెలుగు పండితులు నల్ల ఉపేందర్ మాట్లాడుతూ వృత్తి పోలీసు అధికారి అయిన సాహిత్య ప్రవృత్తితో డాక్టర్ విజయలక్ష్మి మహాభారతంలో స్త్రీ మూర్తుల గొప్పదనాన్ని ఆసక్తికరంగా చిత్రీకరించారని కొనియాడారు. విశ్రాంత సాంఘీక సంక్షేమ అధికారి డాక్టర్ పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ భారతంలో స్త్రీ పాత్రల ప్రాశస్త్యంపై ఆమె రాసిన ప్రసిద్ధ పరిశోధనాగ్రంథం ఆమె సహసానికి, సామర్థ్యానికి మచ్చు తునక అని ప్రశంసించారు. కార్యక్రమంలో టి. పురుషోత్తం, అయోధ్య తదితరులు పుస్తకాల విశిష్టతను కొనియాడుతూ మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 5 ఆగస్టు 2024

విలయ సీమలో వారధిగా..!

రాత్రికిరాత్రి ముంచుకొచ్చిన విలయం... కేరళలోని వయనాడ్ ప్రాంతాన్ని మృత్యుభూమిగా మార్చేసింది. ఊళ్ళకు ఊళ్లు నేలమట్టమై, వందలమంది ప్రాణాలు కోల్పోయిన పెను విపత్తు నేపథ్యంలో... అడుగడుగునా అవరోధాలు ఎదురవుతున్నా... దృఢ సంకల్పంతో తన జట్టును నడిపించారు మేజర్ సీతా అశోక్ షెల్కే. కేవలం 31 గంటల్లో 190 అడుగుల వంతెన నిర్మించి సహాయక చర్యలు వేగవంతం చేశారు.



కనికరంలేని కఠోర వాతావరణం, పెరుగుతున్న నీటిమట్టాలు, ఎటుచూసినా శిథిలాలు... అడుగుతీసి అడుగు వేసే అవకాశం లేని నేల... ఇలాంటి పరిస్థితుల్లోనూ మేజర్ సీతా అశోక్ షెల్కే ధైర్యం సడలిపోలేదు. తన 140 మంది సభ్యుల బృందాన్ని పరుగులు పెట్టించారు. రికార్డు స్థాయిలో 31 గంటల్లోనే... ఇరువంజిప్పుజా నది మీద చురాల్‌మల నుంచి ముండక్కై మధ్య 190 అడుగుల వంతెన నిర్మాణం పూర్తి చేయించారు. తద్వారా ముండక్కైలో సహాయక చర్యలు చేపట్టడానికి, బాధితుల కుటుంబాలకు నీరు, ఆహారాన్ని వాహనాల్లో తరలించడానికీ వీలు కలిగింది. దీనికి దోహదం చేసిన సీత సారథ్యంలోని... భారత సైన్యానికి చెందిన, 'మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్ (ఎంఇజి)'ను అభినందనలు ముంచెత్తుతున్నాయి. 'మద్రాస్ సప్పర్స్'గా ప్రసిద్ధమైన ఈ ఇంజనీరింగ్ యూనిట్ ప్రధాన విధులు... సైన్యం ప్రవేశించడానికి మార్గాలను సుగమం చేయడం, వంతెనలు నిర్మించడం, యుద్ధ క్షేత్రాల్లో మందుపాతరలను తొలగించడం. బెంగళూర్ కేంద్రంగా పని చేస్తున్న ఈ యూనిట్‌లో సీత ఏకైక మహిళ మాత్రమే కాదు, ఆ బృందానికి నాయకురాలు కూడా. "అడుగడుగునా ప్రమాదాలు, సాహసాలతో నిండిన ఈ వృత్తిలోకి ఎంతో ఇష్టపడే వచ్చాను" అంటారామె.

ఐపీఎస్ కావాలనుకొని...

సీత స్వస్థలం మహారాష్ట్రలోని గాలిల్గావ్ గ్రామం. ఆమె తండ్రి అశోక్ భికాజీ న్యాయవాది. "ఐపీఎస్ కావాలనేది నా చిన్ననాటి కల. కానీ సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో అది నెరవేరలేదు. అహ్మద్‌నగర్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఈలోగా సైన్యంలో చేరాలనే కోరిక బలపడింది. ఆ ఆలోచనకు నా కుటుంబం కూడా మద్దతునిచ్చింది. సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బి) పరీక్షల్లో రెండు సార్లు ఫెయిలయ్యాను. మూడోసారి సాధించి, 2012లో ఆర్మీలో చేరాను" అని గుర్తు చేసుకున్నారు సీత. చెన్నైలోని 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటిఏ)లో శిక్షణ పొందాక... ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అంచెలంచెలుగా ఎదిగి... యూనిట్‌కు సారథ్యం వహించే స్థాయికి చేరుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రకృతి విపత్తులప్పుడు, ముఖ్యంగా 2018లో కేరళను వరదలు ముంచెత్తినప్పుడు సహాయక చర్యల్లో ఈ యూనిట్ చాలా చురుగ్గా పాల్గొంది. తాజాగా వయనాడ్‌లోని ముండక్కై, చురాల్‌మల్ ప్రాంతాల్లో సైన్యంతో కలిసి ఈ ఇంజనీర్ల బృందం సాహసోపేతంగా పని చేస్తోంది. "వాతావరణ పరిస్థితులవల్ల వంతెన నిర్మాణానికి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. అవసరమైన భాగాలన్నీ టీసీ బెంగళూరు నుంచి తీసుకువచ్చాం. రాత్రీ పగలూ కష్టపడి పని చెయ్యడం వల్ల... త్వరగా దాన్ని పూర్తి చెయ్యగలిగాం. 24 టన్నుల బరువు తట్టుకొనే సామర్థ్యం ఈ వంతెనకు ఉంది. రెండో దశ సహాయ, పునరావాస కార్యక్రమాలను సైన్యం చేపట్టడానికి దీనివల్ల వీలు కలిగింది. వాహనాలు కూడా దాని మీద ప్రయాణించవచ్చు. శాశ్వతమైన వంతెన నిర్మించేవరకూ దీన్ని ఉపయోగించుకోవచ్చు" అన్నారు సీత.

ఆ గుర్తింపును కోరుకోను...

ఈ వంతెన అందుబాటులోకి రావడంతో... ఎందరో ప్రజలను కాపాడడానికీ, మృతదేహాలను త్వరగా వెలికి తియ్యడానికీ వీలు కలుగుతోంది. "ఇప్పుడేకాదు, విపత్తులబారిన పడిన ప్రాంతాల్లో నిద్రాహారాలను పట్టించుకోకుండా ఆమె పని చేసిన సందర్భాలు అనేకం. ఆమె అంకితభావం, నైపుణ్యం, ప్రతికూలతల మధ్య తన బృందాన్ని నడిపించే సామర్థ్యం ఎన్నోసార్లు రుజువయ్యాయి" అంటూ సైనిక ఉన్నతాధికారులు ఆమెను ప్రశంసించారు. ఇక సోషల్ మీడియా సైతం ఆమెను ప్రశంసలతో ముంచెత్తుతోంది. తనపైనా, తన బృందంపైనా కురుస్తున్న అభినందనల వర్షంపై సీత స్పందిస్తూ "ఇది కేవలం సైన్యం సాధించిన విజయం మాత్రమే కాదు. స్థానిక, రాష్ట్ర అధికారులతో సహా ఎందరో మాకు అనేక దశల్లో సహకారం అందించారు. ఎంతో కష్టంలో ఉన్నప్పటికీ స్థానిక ప్రజలు కనబరిచిన ధైర్యానికీ, సహాయశీలతకు ధన్యవాదాలు" అన్నారు. తనను సాహసోపేతమైన మహిళగా అభివర్ణించడాన్ని ఆమె అంగీకరించరు. "నేను కేవలం మహిళగా గుర్తింపును కోరుకోను. నేను సైనికురాలిని. ఈ బృందంలో భాగంగా ఉన్నందుకు నేనెంతో గర్వపడుతున్నాను" అంటారు మేజర్ సీత.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
4. చలేయా (జవాన్)
5. ఓ మాహీ (డంకీ)
6. తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
7. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
8. తుమ్ సే (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
9. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
10. నైనా (క్రూ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)





ఆట ఒక్కటే కాదు మనోబలమూ కావాలి



ఒలింపిక్స్ లాంటి మెగా పోటీల్లో గెలుపు... ఓటముల మధ్య తేడా సన్నని రేఖ మాత్రమే. అక్కడ ఎవరూ ఎక్కువ కాదు... ఎవరూ తక్కువా కాదు. నైపుణ్యంలో దాదాపు అందరూ సమానమే. కానీ బరిలో నిలిచి... అంచనాలను అందుకొనేది... ఒత్తిడిలో చిత్తవకుండా మానసికంగా దృఢంగా ఉన్నవారే. ఇది అథ్లెట్లకు ఒలింపిక్స్ నేర్పిన పాఠం. అందుకే భారత్ కూడా క్రీడాకారుల బృందంతో తొలిసారి ఇద్దరు మహిళా మానసిక నిపుణులను ప్యారిస్ ఫ్లయిట్ ఎక్కించింది.

కోట్లమంది తమపై పెట్టుకున్న అంచనాలు, అతిపెద్ద వేదికపై అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే ఉత్సుకత, మరోవైపు పతకాల వేటలో విఫలమవుతామేమోనన్న భయం, ఆందోళన... ప్రపంచ దేశాలన్నీ పోటీపడే మెగా ఈవెంట్‌లో అథ్లెట్లు ఎదుర్కొంటున్న మానసిక స్థితి ఇది. వారు మానసికంగా అంతటి బరువు మోయలేక... తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. వీటన్నిటి నుంచి బయటపడి, ఆటపై ఏకాగ్రత కుదరడానికి మానసిక నిపుణులను ఆశ్రయిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు వ్యక్తిగత కోచ్‌లే క్రీడాకారులకు నైతిక స్థైర్యాన్ని ఇచ్చేవారు. కానీ కరోనా అనంతర పరిణామాలతో సైకాలజిస్టుల అవసరం తెలిసొచ్చింది. లక్ష్య సాధనలో నైపుణ్య శిక్షణ ఒక్కటే సరిపోదని, అత్యున్నత స్థాయిలో పోటీపడేటప్పుడు ఆందోళలను దూరం చేసేందుకు మానసికంగా శిక్షణ, ఆరోగ్యం కూడా అవసరమనే వాదన మొదలైంది. టోక్యో ఒలింపిక్స్ సందర్భంగా దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ప్యారిస్ ఒలింపిక్స్‌లో తొలిసారి మెంటల్ హెల్త్ హెల్ప్‌లైన్‌ను అథ్లెట్లకు అందుబాటులోకి తెచ్చింది 'అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ' (ఐఓసీ). దీని కోసం ఒక యాప్‌నూ రూపొందించింది.

'భారత ఒలింపిక్ అసోసియేషన్' (ఐఓఏ) తన మెడికల్ టీమ్‌లో స్పోర్ట్స్ సైకాలజిస్ట్ దివ్యా జైన్, సైకియాట్రిస్ట్ డాక్టర్ సమీర్ పారిఖ్‌కు చోటు కల్పించింది. ఒక్క భారత్ మాత్రమే కాదు... ఈసారి తొంభైకి పైగా దేశాలు తమ అథ్లెట్ల బృందాలకు తోడుగా సైకాలజిస్టులను ప్యారిస్‌కు పంపించాయి.

'క్రీడాకారులకు మానసిక మద్దతు అవసరమనే సంప్రదాయ ఆలోచన... వారు బరిలోకి దిగడానికి, అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ఎంతో దోహదపడుతుంది. అందులో సందేహం లేదు. కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే అథ్లెట్లకు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని అర్థమవుతోంది. ఒలింపిక్స్ మెడికల్ టీమ్‌లో నాలాంటి మానసిక నిపుణులకు చోటు కల్పించడం అతిపెద్ద ముందడుగు' అంటారు పారిఖ్. 'ఫోర్టిస్ నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' ఛైర్‌పర్సన్ అయిన పారిఖ్‌కు ఈ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది.

'అథ్లెట్లు దృఢచిత్తం కలవారనేది అందరి అభిప్రాయం. కానీ తమలోని భావోద్వేగాలను, మానసిక పోరాటాలను వ్యక్తం చేస్తే బలహీనమవుతామనే భావన వారిని ఆందోళనకు గురి చేస్తుంటుంది' అంటారు 'ఫోర్టిస్ నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' సైకలాజికల్ సర్వీసెస్ హెడ్ దివ్యా జైన్. పారిఖ్, దివ్యా ఒకే సంస్థ కోసం పని చేస్తున్నారు.

> **అవమానం కాదు**
>
> 'ఒకప్పుడు అథ్లెట్లు థెరపిస్టులను కలవడం అవమానంగా భావించేవారు. అయితే సమస్య ఉత్పన్నమైనప్పుడు దానికి పరిష్కార మార్గాల్ని అన్వేషించాలి. మానసిక నిపుణులను నియమించుకుని బైల్స్ సరైన నిర్ణయం తీసుకుంది. ఆమెలా అత్యున్నత స్థాయిలో పోటీపడే స్టార్ అథ్లెట్లు అందరికీ ఇది అవసరం. ఒలింపిక్స్ లాంటి ఈవెంట్లకు వారు మరింత ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమవడానికి ఇది ఒక వరం. వాళ్ల విజయాల్లో అదీ ఒక భాగం' అంటారు ఫ్రాన్స్‌కు చెందిన బైల్స్ కోచ్ సెసైల్ లాండీ.

పరిస్థితులు మారాయి...

క్రీడల్లో ఒకప్పుడు నిషిద్ధ అంశంగా పరిగణించిన మానసిక ఆరోగ్యం ఇప్పుడు ప్రాధాన్య అంశంగా మారింది. మానసిక నిపుణులను సంప్రతించడానికి సందేహించే పరిస్థితి నుంచి వారిని వెంటబెట్టుకొని ఆటలకు వెళ్లే రోజులు వచ్చేశాయి. టోక్యో ఒలింపిక్స్‌లో అమెరికన్ జిమ్నాస్టిక్స్ సూపర్‌స్టార్ సైమన్ బైల్స్ ఉదంతం సైకాలజిస్టుల ఆవశ్యకతను మరింత బలపరిచింది. 2016 రియో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణ పతకాలు గెలిచిన బైల్స్... టోక్యోలో తీవ్ర ఒత్తిడికి లోనై, పలు ఈవెంట్ల నుంచి తప్పుకుంది. హఠాత్తుగా పోటీల నుంచి వైదొలగడంతో సొంత దేశంలోనే ఆమెకు మద్దతు కరువైంది. అమెరికాకు రావల్సిన స్వర్ణ పతకాన్ని చేజార్చిందంటూ పలువురు ధ్వజమెత్తారు. ధైర్యం చెప్పేవారి కంటే విమర్శించినవారే అధికమయ్యారు. ఇవి బైల్స్‌ను మరింత కుంగదీశాయి. ఈ అనుభవం ఆమెకు ఎన్నో పాఠాలు నేర్పింది. జిమ్నాస్టిక్స్ సాధన ఒక్కటే సరిపోదని, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని భావించింది. అప్పటి నుంచి తన సన్నద్ధతలో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను కూడా భాగం చేసింది. 'ప్రతివారం థెరపిస్ట్‌ను కలవడం నా కెరీర్‌లో భాగం అయింది' అంటున్న బైల్స్ ఇప్పుడు ప్యారిస్‌లో రెట్టించిన ఉత్సాహంతో ప్యారిస్‌లో మళ్లీ పతకాలు పట్టింది.

స్టార్ అథ్లెట్లు ఎందరో...

ఈ సమస్య బైల్స్‌ది మాత్రమే కాదు. అంతకముందు రికార్డు స్థాయిలో 28 ఒలింపిక్ పతకాలు గెలుచుకున్న అమెరికన్ స్విమ్మింగ్ సూపర్‌స్టార్ మైకేల్ ఫెల్ప్స్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాడు. ఒలింపిక్స్ అనంతర ప్రచార కార్యక్రమాలతో తాను తీవ్ర మానసిక ఒత్తిడిలోకి వెళ్లిపోయేవాడినని ఓ సందర్భంలో వెల్లడించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్న మరో అమెరికన్ స్విమ్మర్ కేలబ్ డ్రెసెల్... 2022 స్విమ్మింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ నుంచి అర్ధంతరంగా తప్పుకున్నాడు. అతడిదీ అదే సమస్య... మానసిక ఒత్తిడి. ఇప్పుడు మనోవికాస నిపుణుడితో కలిసి ప్యారిస్‌కు వెళ్లాడు. ఈ బృందంలో సభ్యురాలైన రేగా స్మిత్‌కూ థెరపిస్టు సాయం అవసరమైంది. 2019లో రెండు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టిన ఆమె... ఆ తరువాత జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో తీవ్ర ఒత్తిడికి లోనై సాధారణ ప్రదర్శనతో సరిపెట్టుకుంది. 'థెరపిస్టు సహాయం తీసుకోవాడానికి మొదట నేను ఎంతో సంకోచించాను. ఒక సందర్భంలో భయపడ్డాను కూడా. చివరకు నాకు నేను నచ్చజెప్పుకుని సైకాలజిస్టును కలిశాను. ఆ తరువాతే నాకు అర్థమైంది... నేను ఇంతకాలంగా ఏ కోల్పోయానో' అంటున్న స్మిత్... ప్యారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో అదరగొట్టింది.

'శారీరకంగా ఎంత దృఢంగా ఉన్నామో... మానసికంగా కూడా అంతే బలంగా ఉండడం అథ్లెట్లకు ముఖ్యం' అనేది ఫ్రీస్టయిల్ స్ప్రింటర్ జాక్ అలెక్స్ మాట.

బిజినెస్

స్వచ్ఛ ఇంధన విధానాల కోసం వేచి చూస్తున్నాం

మారుతి సుజుకీ ఛైర్మన్ భార్గవ

న్యూఢిల్లీ: దేశంలో అన్ని రకాల స్వచ్ఛ ఇంధనాలను ప్రోత్సహించే విధానాల కోసం తాము ఎదురు చూస్తున్నట్టు మారుతి సుజుకీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ అన్నారు. అటువంటి విధానాలు వచ్చినప్పుడే పెట్రోల్, డీజిల్ కార్ల స్థానంలో పర్యావరణ మిత్రమైన టెక్నాలజీ కార్లను ప్రవేశపెట్టడం సాధ్యమవుతుందని 2023-24 వార్షిక నివేదికలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ మూడో విడత అధికార కాలంలో తయారీ కంపెనీలను మరింత పోటీ సామర్థ్యం గలవిగా తీర్చిదిద్దగల సంస్కరణలు ప్రవేశపెడతారన్న ఆశాభావం ఆయన ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే ఈ దిశగా చర్యలు తీసుకున్నాయని తెలిపారు. కార్ల పరిశ్రమ వాతావరణంలోకి వదిలే వ్యర్థాలను తగ్గించాలనేది ప్రధాన జాతీయ లక్ష్యమని, ఈ లక్ష్యానికి దీటైన విధానాలు ప్రవేశపెట్టడం అవసరమని భార్గవ అన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ 500 మల్టీక్యాప్ ఫండ్

హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్.. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ 500 మల్టీక్యాప్ 50:25:25 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ 500 స్టాక్స్‌లో దీర్ఘకాలిక లాభాలు పొందాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్.. లార్జ్‌క్యాప్స్, మిడ్‌క్యాప్స్, స్మాల్ క్యాప్స్‌లో వరుసగా 50 శాతం, 25 శాతం, 25 శాతం పెట్టుబడులు పెట్టనుంది. ప్రతి త్రైమాసికంలో ప్రతి విభాగం పనితీరు ఆధారంగా మదుపరులు తమ పెట్టుబడులను పునఃసమీక్షించుకునే అవకాశాన్ని ఈ ఫండ్ కల్పించనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ 20.

ఈసారీ వడ్డీ రేట్లు యథాతథం!

రేపటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

ముంబై: ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్ష కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఈ నెల 6 నుంచి 8 వరకు సమావేశమవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలోనూ ఎంపీసీ కీలక రెపో రేటును యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఎంపీసీ రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తోంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే వరకు.. మన దేశంలోనూ ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గించే అవకాశం లేదనే అంచనాలు వినిపిస్తున్నాయి. దేశీయంగా వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నా, జీడీపీ వృద్ధి రేటు సంతృప్తికరంగా ఉంది. దీంతో రెపో రేటు తగ్గింపుపై తొందరపడాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ భావిస్తోంది. 'రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతం వద్ద ఉన్నా.. ఆర్‌బీఐ ఈసారి కూడా వడ్డీ రేట్ల పెంపు జోలికి పోకపోవచ్చు' అని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ తెలిపారు. ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులు ఏమీ లేకపోతే ఈ ఏడాది డిసెంబరు భేటీలో 0.25 శాతం, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే భేటీలో మరో 0.25 శాతం రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని ఆమె తెలిపారు.



డెరివేటివ్స్‌పై ఆంక్షలు బ్యాంకులకు మంచిదే..

ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా

రిటైల్ మదుపరులు డెరివేటివ్స్ ట్రేడింగ్ చేయడంపై ఆంక్షలు విధించడం బ్యాంకులకు మేలు చేస్తుందని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. దీనివల్ల ఈ తరహా మదుపరులు మళ్లీ బ్యాంక్ డిపాజిట్లపై ఆసక్తి చూపిస్తారన్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో స్వల్పకాలిక, దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుల్లో మార్పు చేయడం.. బ్యాంకుల డిపాజిట్లపై ఎలాంటి ప్రభావం చూపదన్నారు. ప్రస్తుతం బ్యాంకులు పరపతి వృద్ధి రేటుకు తగ్గట్టుగా.. డిపాజిట్ల వృద్ధి రేటు లేకపోవడంతో నిధుల కొరత ఎదుర్కొంటున్న విషయాన్ని ఖారా గుర్తు చేశారు. ప్రస్తుతం రిటైల్ మదుపరుల్లో ఎక్కువ మంది నష్ట భయం ఉన్నా, బ్యాంకు డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు ఇచ్చే స్టాక్ మార్కెట్‌పై ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

ఈ ఏడాది సిమెంట్‌కు మరింత గిరాకీ

7-8 శాతం పెరిగే చాన్స్: అల్ట్రాటెక్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ రంగానికి బాగానే కలిసిరానుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం సిమెంట్ గిరాకీ 7 నుంచి 8 శాతం వరకు పెరగనుందని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ తన తాజా వార్షిక నివేదకలో పేర్కొంది. దేశవ్యాప్తంగా జోరు మీద ఉన్న నిర్మాణ రంగం ఇందుకు తోడ్పడుతుందని అంచనా వేసింది. పెరుగుతున్న ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు కంపెనీలు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) అదనంగా మరో 3.5 కోట్ల టన్నుల నుంచి 4 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం జోడిస్తాయని అంచనా వేసింది. ఇందులో 60 నుంచి 65 శాతం ఉత్పత్తి సామర్థ్యం దేశ తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఏర్పాటవుతుందని తెలిపింది. డిమాండ్ జోరు మీద ఉండడంతో ఈ ఆర్థిక సంవత్సరం కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 72 శాతం వరకు వినియోగించుకుంటాయని అంచనా వేసింది.

చైనా నుంచి ఎఫ్‌డీఐ మంచిదే

న్యూఢిల్లీ: చైనా నుంచి పెద్దఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించాలన్న వాదనకు మద్దతు పెరుగుతోంది. ఆ దేశం నుంచి ఎడాపెడా వస్తువులు దిగుమతి చేసుకోవడం కంటే ఎఫ్‌డీఐ ద్వారా ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడాన్ని ప్రోత్సహించడం మేలని ప్రముఖ ఆర్థికవేత్త, నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ వీర్‌మణి చెప్పారు. దీనివల్ల చైనా నుంచి మన దేశానికి వస్తువుల దిగుమతులు తగ్గడంతో పాటు, అమెరికా, ఈయూ దేశాలకు మన ఎగుమతులు పెంచుకోవచ్చన్నారు. ఆగ్నేయాసియా దేశాలు ఇదే విధానం అనుసరించి తమ ఎగుమతులు పెంచుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమెరికా, ఈయూ దేశాలు అనుసరిస్తున్న చైనా+1 విధానం ఈ విషయంలో మన దేశానికి కలిసి వస్తుందన్నారు. చైనా కంపెనీలకూ ఇది మేలు చేస్తుందన్నారు. మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసి అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేసి ఆ దేశాల ఆంక్షలను చైనా కంపెనీలు తప్పించుకోవచ్చని వీర్‌మణి చెప్పారు.

25,025 పైన బుల్లిష్

(ఆగస్టు 5-9 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో టెక్

నిఫ్టీ గత వారం 25,078-24,686 పాయింట్ల మధ్యన కదలాడి 117 పాయింట్ల నష్టంతో 24,718 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,025 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,901, 24,857, 24,682, 24,493 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25,000 బ్రేక్‌డౌన్ స్థాయి : 24,415
నిరోధ స్థాయిలు: 24,925, 25,025, 25,125 (24,820 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,515, 24,415, 24,315 (24,615 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	493	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	92
వరంగల్	80	గుంటూరు	92
కరీంనగర్	80	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	106
కర్నూలు	80	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		

జర జాగ్రత్త..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు గురయ్యే అవకాశం ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండటం, తయారీ రంగం, నిరుద్యోగుల డేటా ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లలో మళ్లీ ఆర్థిక మాంద్యం భయాలు మొదలయ్యాయి. గత శుక్రవారం యూఎస్, యూరప్, ఆసియా దేశాల సూచీలు భారీగా పతనమయ్యాయి. మిగతా దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉండటం సానుకూల అంశం. ఈ వారం నిఫ్టీకి 24,600 వద్ద మద్దతు, 24,850 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఆటుపోట్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడులు పెట్టడం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

దీపక్ ఫెర్టిలైజర్స్: గత నాలుగు నెలల నుంచి ఈ షేరు మంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. వాల్యూమ్ కూడా పెరుగుతోంది. మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించటంతో మదుపరుల చూపు ఈ షేరుపై పడింది. గత శుక్రవారం ఈ షేరు 2.89 శాతం లాభంతో రూ.961 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.950 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,040/1,090 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.922 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: జూన్ త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ షేరు టైట్ రేంజ్‌లో ట్రేడవుతోంది. పైగా చివరి నాలుగు సెషన్లలో అదరగొట్టింది. కీలక నిరోధ స్థాయిలో రౌండింగ్ బేస్ ఏర్పడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 1.24 శాతం లాభంతో రూ.1,659 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,650/1,630 శ్రేణిలో ఎంటరై రూ.1,780/1,820 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో తక్కువ వాల్యూమ్‌తో స్వల్ప పుల్‌బ్యాక్ కనిపించింది. అయితే చివరి రెండు సెషన్లలో షేరు లాభపడింది. గత శుక్రవారం ఈ షేరు 1.11 శాతం లాభంతో రూ.6,964 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.6,910 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.7,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,870 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ విల్మర్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం బాటమ్‌కు చేరినట్లే కనిపిస్తోంది. ఎఫ్ఎంసీజీ ఫుడ్ వ్యాపారాన్ని ప్రత్యేక కంపెనీగా ఏర్పాటు చేస్తారన్న వార్తలతో మళ్లీ మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం 10 శాతం లాభంతో రూ.383 వద్ద ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.370/380 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.425/440 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.355 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

సుజ్లాన్ ఎనర్జీ: కంపెనీలో టర్న్ అరౌండ్ పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ షేరు ఐదేళ్ల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ గణనీయంగా పెరుగుతున్నాయి. పైగా జూన్ త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు 4.96 శాతం లాభంతో రూ.71.35 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.70 వద్ద ఎంటరై రూ.76/81 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.67 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన మద్దతు 24,400 చేరువలో...

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 దాటినా గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకోలేక బలమైన కరెక్షన్ సాధించింది. శుక్రవారం ఏర్పడిన ఈ బలమైన రియాక్షన్‌తో స్వల్పకాలిక ర్యాలీకి అవరోధం ఏర్పడినట్టు కనిపిస్తోంది. గతంలో రెండు టాప్‌లు ఏర్పడిన ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోవడం ద్వారా ఇక్కడ బలమైన స్వల్పకాలిక నిరోధం ఏర్పడింది. 9 వారాల ర్యాలీలో ఏదైనా వారంలో నిఫ్టీ నష్టాలతో ముగియడం ఇదే ప్రథమం. గత వారంతో పోల్చితే 120 పాయింట్ల నష్టంతో నిఫ్టీ వారం కనిష్ఠ స్థాయిలో ముగిసింది. ఇక మిడ్‌క్యాప్ 100 సూచీ గత వారం 145 పాయింట్ల మైనర్ లాభంతో ముగిసినా గరిష్ఠ స్థాయి కన్నా 1500 పాయింట్ల మేరకు దిగజారింది.

స్మాల్‌క్యాప్ 100 సూచీ మాత్రం 55 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో డౌన్ ట్రెండ్ కారణంగా ఈ వారంలో మన మార్కెట్లో మరింత రియాక్షన్ ఏర్పడడానికే అవకాశం ఉంది. అలాగే వరుస ర్యాలీ కారణంగా కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఏర్పడడం తప్పనిసరి. మొదట మార్కెట్ నిలదొక్కుకోవడం అవసరం.

బుల్లిష్ స్థాయిలు: ఒకవేళ ఏదైనా కరెక్షన్ ఏర్పడి అక్కడ నుంచి రికవరీ సాధించినా మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 24,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24,850, 25,000.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనత ప్రదర్శించి ప్రధాన మద్దతు స్థాయి 24,550 కన్నా దిగజారితే మరింత బలహీనత ఏర్పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24,400. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా రికవరీకి ఆస్కారం ఉంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 52,000 స్థాయిని దాటినా నిలదొక్కుకోలేక శుక్రవారం 51,350 వద్ద ముగిసింది. మరింత బలహీనత ప్రదర్శించినా ట్రెండ్‌లో సానుకూలత కోసం మద్దతు స్థాయి 50,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 50,400. రికవరీ బాట పడితే 51,500 వద్ద గట్టి నిరోధం ఉంది.

పాటర్న్: మార్కెట్ స్వల్పకాలిక 25 డీఎంఏ వద్ద పరీక్షకు సిద్ధపడుతోంది. ఈ కీలక స్థాయిలో పరీక్ష ఎదుర్కొనడం ఇది రెండో సారి. 24,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు కనిపిస్తోంది. సానుకూలత కోసం ఇక్కడ రికవరీ సాధించి తీరాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళ, శుక్ర వారాల్లో తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం :	24,700, 24,780
మద్దతు :	24,600, 24,550

దిక్సూచి
వరంగల్ ● సోమవారం 5 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

ఎకానమీ

తెలంగాణ అవస్థాపన సౌకర్యాలు
సమాచార వ్యవస్థ



దేశంలోని ఇతర ప్రాంతాలతో, మిగతా ప్రపంచంతో మమేకం చేసే సాధనం సమాచార వ్యవస్థ. ఇందులో ఆధునిక డిజిటల్ వ్యవస్థ, ప్రసార సాధనాలు, ప్రచురిత సాధనాలు, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉన్నాయి. ఇంటర్నెట్, టెలిఫోన్లు, దూరదర్శన్, కేబుల్ టెలివిజన్, రేడియో, వార్తా దిన పత్రికలు, వార, మాసపత్రికలు మొదలైనవి ముఖ్య సమాచార సాధనాలు.

డిజిటల్ సమాచార వ్యవస్థ

ఆధునిక సమాచార వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేయడమనేది డిజిటల్ వ్యవస్థపై ప్రధానంగా ఆధారపడి ఉంది. డిజిటల్ సమాచారం, డిజిటల్ కంప్యూటింగ్, డేటాను నిల్వ చేసే వ్యవస్థలు ఇందులో భాగం. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సమాచార వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా వికారాబాద్ జిల్లాలోని పూడూరు గ్రామం దగ్గర గల దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లోని 1174 హెక్టార్లను భారతదేశంలోనే రెండో స్థానపు వెరీ లో ఫ్రీక్వెన్సీ(వీఎల్ఎఫ్) రాడార్‌స్టేషన్‌ను నెలకొల్పడానికి భారత నౌకాదళానికి ఇచ్చింది.

డిజిటల్ తెలంగాణ

డిజిటల్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా తెలంగాణలోని ప్రతి పౌరునికి డిజిటల్ సమాచార వ్యవస్థను అందుబాటులోకి తేవడానికి 'డిజిటల్ తెలంగాణ'ను ఆరంభించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ద్వారా డిజిటల్ సేవలను, రాష్ట్రమంతా 4జీ సేవలు, నగరాలు, పట్టణాల్లో వైఫై సేవలు అందించడంతోపాటు ఈ-పంచాయితీ పథకం కింద ప్రతి పంచాయితీలో కేంద్రీకృత కియోస్క్‌ని ఏర్పాటుచేస్తారు. ఇక డిజిటల్ సమాచార వ్యవస్థ డిమాండ్ వైపునుంచి ప్రతి ఇంటికి డిజిటల్ ప్రాథమిక పరిజ్ఞానం కల్పించడం, ప్రతి పాఠశాలకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించే కార్యక్రమం, మీసేవా కార్యకలాపాల విస్తరణ, ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలకు సాంకేతిక పరిష్కార వ్యవస్థ మొదలైనవి అమలు చేస్తారు.

డిజిటల్ పరిజ్ఞానాన్ని అందించడం కోసం రాష్ట్రం మొత్తంలో 13,352 సాధారణ సేవా కేంద్రాలు(కామన్ సర్వీసెస్ సెంటర్లు) పనిచేస్తున్నాయి. అందులో 8,997 కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.

ఈ ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరమ్ వార్షిక సమావేశంలో రాష్ట్రంలోని శిష్త గ్రూపుతో రాష్ట్ర ఐ.టీ, ఐ.టీ. సేవలశాఖ వెయ్యిమంది సభ్యులతో కూడిన ఆధునిక డిజిటల్ డివైజ్, నిర్మాణం ప్రాజెక్టును హైదరాబాద్‌లో నెలకొల్పే అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కేంద్రం తెలంగాణ డిజిటల్ ప్రణాళికా కేంద్రంగా ఉండబోతుంది.

కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)కు సంబంధించిన మూడు కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తెలంగాణను కృత్రిమ మేధ కేంద్రంగా మలిచే విధంగా డిజిటల్ తెలంగాణ ప్రాజెక్టును విస్తరించింది.

సాగు బాగు 2.0

కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సుస్థిర, సమర్థవంతమైన వ్యవసాయ పరిస్థితులను సృష్టించడం కోసం 'సాగు బాగు 2.0' కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నారు. ఇందు కోసం వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన సంస్థల(అగ్రిటెక్)తో 2014 ఫిబ్రవరిలో చర్చలు కూడా జరిపారు.

డ్రోన్ వ్యవస్థ

తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ డ్రోన్ సిటీ'(టీడీసీ) పేరుతో డ్రోన్ సాంకేతికతను ప్రోత్సహించనుంది. దీనితో భారతదేశ ప్రధానమైన 'మనుషులు లేని వాయు వాహనం' పరీక్షా కేంద్రంగా ఈ డ్రోన్ కేంద్రం మారబోతుంది. అంతేకాకుండా రాష్ట్రంలోని అయిదు లక్షల ఎకరాల వ్యవసాయ భూమికి సేవలందిస్తూ గ్రామీణ ఉద్యమిత్వాన్ని ప్రోత్సహించడానికి ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్, మారుట్ డ్రోన్ డ్రోన్ సేవలు అందించడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.



రాష్ట్రంలో టెలిఫోన్ సేవలు

2022 నవంబరు నాటికి రాష్ట్రంలో 4.08 కోట్ల టెలిఫోన్ ఖాతాలున్నాయి. అందులో 98 శాతం వైర్‌లెస్ ఖాతాలు. పట్టణాల్లో ఉన్న 2.28 కోట్ల ఖాతాల్లో 96 శాతం వైర్‌లెస్ ఖాతాలు కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 1.70 కోట్లు(99.8 శాతం) వైర్‌లెస్ ఖాతాలు ఉన్నాయి.



తపాల సేవలు

అందరికీ సౌకర్యవంతమైన సమాచార సేవలనందించేది తపాల వ్యవస్థ. ఇండియా పోస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణలో 2021 ఆగస్టు 31 నాటికి 36 హెడ్ పోస్టాఫీసులు, 789 సబ్ పోస్టాఫీసులు, 5,388 తపాలశాఖ కార్యాలయాలు, 27,031 లెటర్ బాక్స్‌లు ఉన్నాయి. ఆగస్టు 31 నాటికి రాష్ట్రంలో తపాల కార్యాలయాలు సమాచార సేవలతోపాటు పొదుపు, పాస్‌పోర్ట్, ఆధార్, స్టాంప్‌ల పంపిణీ సంబంధిత సేవలను కూడా అందిస్తున్నాయి.

టెలిఫోన్ సాంద్రత

2022 నవంబరు నాటికి దక్షిణాది రాష్ట్రాల్లో టెలిఫోన్ సాంద్రతలో తెలంగాణ 105 టెలీ సాంద్రతతో ద్వితీయస్థానంలో ఉంది. కాగా దక్షిణాదిలో ఉన్న రాష్ట్రాల్లో కేరళ 120 టెలీ సాంద్రతతో మొదటిస్థానంలో ఉంది. ఇక మొత్తం రాష్ట్రాలను తీసుకుంటే తెలంగాణ రాష్ట్రం తొమ్మిదోస్థానంలో ఉంది. 139 టెలీ సాంద్రతతో సిక్కిం మొదటిస్థానంలో ఉండగా, 53 టెలీ సాంద్రతతో బిహార్ చివరిస్థానంలో ఉంది. కాగా మొత్తం ఇండియా టెలీ సాంద్రత 83. ప్రతి వంద మందికి గల టెలిఫోన్ ఖాతాల సంఖ్యను టెలీ సాంద్రత అంటారు.

రేడియో స్టేషన్లు

2022 సంవత్సరం చివరి నాటికి రాష్ట్రంలో 15 ఆల్ ఇండియా రేడియో స్టేషన్లు ఉండగా అందులో 12 ఎఫ్ఎం, రెండు ఎండబ్ల్యూ, ఒక ఎస్‌డబ్ల్యూ ఉన్నాయి. తెలంగాణలో ప్రైవేటు రంగంలో 11 రేడియో స్టేషన్లు ఉన్నాయి. అందులో హైదరాబాద్ కేంద్రంగా 8, వరంగల్ కేంద్రంగా 3 నడుస్తున్నాయి.

పత్రికలు

రాష్ట్రంలో 2022 సంవత్సరం చివరి నాటికి 1354 దిన, వార, మాస, ఇతర పత్రికలు రిజిస్టర్ అయి ఉన్నాయి. రాష్ట్రంలో రిజిస్టరైన పత్రికల్లో 60 శాతం తెలుగు, 18.4 శాతం ఉర్దూ, 13.6 శాతం ఆంగ్లభాషలో వెలువడుతున్నాయి.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

టైమ్ సీక్వెన్స్ టెస్ట్



ఈ చాప్టర్‌కు సంబంధించిన ప్రశ్నలలో వివిధ సంఘటలకు అంటే బస్సు, రైళ్ల సమయాలు, పెండ్లిరోజు, పుట్టినరోజుల తేదీలు, వివిధ సమావేశాల సమయాలు ఈ విధంగా సమాచారం ఇస్తారు. దానిని జాగ్రత్తగా అవగాహన చేసుకొని పెళ్లిళ్లు, పుట్టిన రోజుల తేదీలను, రైలు, బస్సు, సమావేశాల సమయాలు మొదలైన వాటికి సమాధానాలు రాబట్టవలసి ఉంటుంది.

1. పవన్‌కు అతని సోదరుడు శ్యామ్ పుట్టినరోజు ఆగస్టు 3 నుంచి ఆగస్టు 8 మధ్య అని గుర్తు. అతని తండ్రి శ్రీనివాస్‌కు తన కుమారుని పుట్టిన రోజు ఆగస్టు 6 నుంచి ఆగస్టు 10 మధ్య అని గుర్తు. అయితే శ్యామ్ పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) ఆగస్టు 7 బి) ఆగస్టు 8 సి) ఆగస్టు 6 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: పవన్‌కు అతని సోదరుడు శ్యామ్ పుట్టినరోజు ఆగస్టు 3 నుంచి ఆగస్టు 8 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు 4, 5, 6, 7. అతని తండ్రి శ్రీనివాస్‌కు తన కుమారుని పుట్టినరోజు ఆగస్టు 6 నుంచి ఆగస్టు 10 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 7, 8, 9. రెండింటిలో కామన్‌గా ఉండే తేదీ 7. అనగా ఆగస్టు 7 సమాధానం అవుతుంది.

2. ఒక రైలు ముంబయ్‌కి ప్రతి 75 ని.లకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికునితో రైలు వెళ్ళిపోయి 20 ని.లు అయినది. తరవాత రైలు 10.00 ఎ.ఎం. అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికునితో ఏ సమయంలో చెప్పాడు?

ఎ) 9.05 ఎ.ఎం. బి) 9.00 ఎ.ఎం.
సి) 9.15 ఎ.ఎం. డి) 9.10 ఎ.ఎం.

సమాధానం: (ఎ)

వివరణ: రైలు ముంబయ్‌కి ప్రతి 75 ని.లు అనగా 1 గంట 15 ని.లకు ఉంది. తదుపరి రైలు వచ్చే సమయం 10.00 ఎ.ఎం. అని ఇచ్చారు. అంటే దాని ముందు రైలు వచ్చిన సమయం 10.00-1 గంట 15 ని. = గం. 8.45 ని. విచారణాధికారి ప్రయాణికునితో రైలు వెళ్ళిపోయి 20 ని.లు అయిందని చెప్పాడు. దాని అర్థం ప్రయాణికుడు 20 ని.లు ఆలస్యంగా వచ్చాడు. (ఆలస్యంగా వస్తేనే కదా రైలు వెళ్ళిపోయింది) కాబట్టి విచారణాధికారి, ప్రయాణికునికి మధ్య సంభాషణ జరిగిన సమయం 8.45 + 20 = గం. 9.05 నిలు సమాధానం అవుతుంది.

3. తేజ బస్టాండులో ఒక బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. అతని చేతి గడియారం 10 ని.లు ఎక్కువగా చూపిస్తున్నది. ఉదయం 7 గంటలకు రావలసిన ఒక బస్సు 20 ని.లు ఆలస్యంగా వచ్చింది. అయితే బస్సు వచ్చిన సమయంలో తేజ చేతి గడియారం ఏ సమయాన్ని చూపిస్తుంది?

ఎ) 7.30 ఎ.ఎం. బి) 7.20 ఎ.ఎం.
సి) 7.15 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: 7 గం.లకు రావలసిన బస్సు 20 ని॥ ఆలస్యంగా వచ్చింది. అనగా బస్సు వచ్చిన సమయం ఉదయం 7.20 ని.లు. తేజ గడియారం 10 ని.లు అధికంగా చూపిస్తున్నదని అర్థం. బస్సు వచ్చిన సమయంలో తేజ చేతి గడియారం చూపిస్తున్న సమయం ఉదయం 7.30 ని.లు.

4. ఒక పుస్తకాన్ని సౌమ్య సోమవారం చదివింది. అదే పుస్తకాన్ని సుధ, సౌమ్యకు తరవాత 4వ రోజున, స్వప్నకు ముందురోజున చదివింది. అయితే ఆ పుస్తకాన్ని స్వప్న ఏ రోజున చదివింది?

ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: సౌమ్య పుస్తకాన్ని సోమవారం చదివింది. సుధ, సౌమ్యకు తరవాత 4వ రోజు అనగా
సోమవారం తరవాత
మంగళవారం
బుధవారం
గురువారం
శుక్రవారం రోజున సుధ చదివింది.

సుధ, స్వప్నకు ముందురోజు చదివింది అంటే దీని అర్థం స్వప్న, సుధకు తరవాత రోజు చదివింది. అంటే శనివారం స్వప్న చదివింది.

(స్వప్న శనివారం చదివితేనే కదా సుధ, స్వప్న కంటే ఒక రోజు ముందు శుక్రవారం ఉండేది)

5. రాజు ప్రతి సోమవారం, బుధవారం, శనివారం; రవి ప్రతి సోమవారం, గురువారం, శుక్రవారం, శనివారం ఒకే సమయంలో నడకకు (వాకింగ్) వెళతారు. అయితే వారిద్దరూ గురువారంతో ప్రారంభమయ్యే జూలై నెలలో ఎన్నిసార్లు కలుసుకొంటారు?

ఎ) 8 బి) 9 సి) 10 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: గమనించండి రాజు, రవి నడకకు వెళ్ళే రోజులలో కామన్‌గా ఉన్న రోజులు సోమవారం, శనివారం. గురువారంతో ప్రారంభమయ్యే జూలై నెల అంటే జూలై 1 గురువారం, జూలై 2 శుక్రవారం, జూలై 3 శనివారం.

జూలై 3 శనివారం	అదేవిధంగా
జూలై 10 శనివారం	జూలై 5 సోమవారం
జూలై 17 శనివారం	జూలై 12 సోమవారం
జూలై 24 శనివారం	జూలై 19 సోమవారం
జూలై 31 శనివారం	జూలై 26 సోమవారం

పై వివరణను బట్టి వారిరువురూ కలుసుకునే రోజులు '9' అని తెలుస్తున్నది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి

మెగా విరాళం

కేరళ సీఎం సహాయ నిధికి చిరంజీవి, రామ్‌చరణ్ రూ. కోటి, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు





కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి నష్టపోయిన కుటుంబాలకు ఆసరా అందించేందుకు.. కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇప్పటికే పలువురు సినీతారలు విరాళాలు అందించిన సంగతి తెలిసిందే. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కూడా బాధితులు విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళం అందించి, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయాన్ని చాటారు. "ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ఈ ప్రాణ నష్టాన్ని చూస్తుంటే నా గుండె బరువెక్కిపోతోంది. బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం అల్లు అర్జున్ కూడా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. "కేరళలో జరిగిన ఈ సంఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. కేరళ ప్రజలు నాపై ఎంతో ప్రేమ చూపారు. వారి కోసం నా వంతుగా నేను ఈ సహాయం చేస్తున్నాను" అని అల్లు అర్జున్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సంయుక్త మీనన్ కేరళలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న విశ్వశాంతి ఫౌండేషన్‌కు విరాళం అందించినట్లు తెలిపారు. కానీ ఆమె ఎంత మొత్తం అందించారు అనేది గోప్యంగా ఉంచారు.

క్లైమాక్స్‌లో...



చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు యూనిట్ ఆదివారం ప్రకటించింది. 'సినిమా మొత్తం ఒకెత్తు, క్లైమాక్స్ ఒక్కటి మరో ఎత్తు అనేలా ఉండబోతోంది, భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్‌తో దర్శకుడు వశిష్ట క్లైమాక్స్ సీక్వెన్స్‌ను దృశ్యకావ్యంలా తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. పతాక సన్నివేశాలకు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు నేతృత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకొస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. త్రిష హీరోయిన్.

విజేతలు వీరే...

















దక్షిణాది తారలంతా తళుక్కున మెరిసిన '69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గెలుపు గుర్రాలకు పురస్కారాలను అందించారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిన్నా' అత్యధికంగా ఏడు అవార్డులు కొల్లగొట్టగా.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తి సురేశ్ జంటగా తెరకెక్కిన 'దసరా' చిత్రం ఆరు విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ'.. మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఐదు అవార్డులతో మూడో స్థానంలో నిలిచాయి. తమిళంలో ఉత్తమ నటుడిగా 'పొన్నియన్ సెల్వన్ 2' చిత్రానికి విక్రమ్.. 'మామన్నన్' (నాయకుడు) సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్, ఉత్తమ నటిగా 'చిన్నా' చిత్రానికి నిమిషా సజయన్ ఎంపికయ్యారు. తెలుగువారిని విశేషంగా అలరించిన కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి, ఉత్తమ నటిగా రుక్మిణీ వసంత్ ఎంపికయ్యారు. మలయాళ నటుడు మమ్ముట్టి 'నన్‌పకల్ నేరతు మయక్కం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అవార్డుల ప్రదానోత్సవంలో నాని మాట్లాడుతూ "కెరీర్ తొలినాళ్లలో అవార్డులు అందుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇప్పుడు నేను నటించిన, నిర్మించిన సినిమాల్లోని నటీనటులు ఈ అవార్డులు అందుకుంటుంటే చూడాలని ఉంది. నాతో సినిమాలు తీసిన ఇద్దరు నూతన దర్శకులు అవార్డులు అందుకొన్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "ఓ అభిమాని చేసిన పనిని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఓ అభిమాని.. ఓ రోజు హఠాత్తుగా పెళ్లి చేసుకుంటానని.. ఇంటి వాకిలి ముందు వాలిపోయాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా షాక్ అయ్యా" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతలుగా సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, విశాఖ వాఖ్యాతలుగా వ్యవహరించారు.



తెలుగు సినిమా విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం - బలగం
ఉత్తమ దర్శకుడు - వేణు ఎల్దండి (బలగం)
ఉత్తమ పరిచయ దర్శకుడు - శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
ఉత్తమ దర్శకుడు(విమర్శకుల ఎంపిక) - సాయి రాజేశ్ (బేబీ)
ఉత్తమ నటుడు - నాని (దసరా)
ఉత్తమ నటుడు (విమర్శకుల ఎంపిక) - ప్రకాశ్ రాజ్(రంగ మార్తాండ), నవీన్ పొలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పొలిశెట్టి)
ఉత్తమ నటి - కీర్తి సురేశ్,
ఉత్తమ నటి (విమర్శకుల ఎంపిక) - వైష్ణవి చైతన్య (బేబీ)
ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ), రవితేజ (వాల్తేరు వీరయ్య)
ఉత్తమ సహాయ నటి - రూపా లక్ష్మి (బలగం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - బేబీ
ఉత్తమ గీత రచయిత - అనంత శ్రీరామ్ (బేబీ)
ఉత్తమ నేపథ్య గాయకుడు - శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా - బేబీ)
ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు - సార్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ - సత్యన్ సూరన్ (దసరా).

క్రేజీగా రాంబో



షమ్ము హీరోగా హరీశ్ మధురెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'క్రేజీ రాంబో'. ర్యాప్‌రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించి టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ "టైటిల్ చాలా ఆసక్తికంగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలి" అని చెప్పారు. హీరో షమ్ము మాట్లాడుతూ "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. "చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని నిర్మాత ర్యాప్‌రాక్ షకీల్ అన్నారు.

స్కూల్ లైఫ్‌ను గుర్తుకు తెచ్చేలా



ప్రియదర్శి, విశ్వదేవ్, భాగ్యరాజ్, నివేత థామస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సయ్యారే సయ్యా' పాటను విడుదల చేశారు. అందరికీ స్కూల్ లైఫ్ జ్ఞాపకాలను, బాల్య స్నేహాలను గుర్తుకు తెచ్చేలా సాగిందీ పాట. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, కార్తీక్ ఆలపించారు. వివేక్ సాగర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: టి.సి.ప్రసన్న, డీఓపీ: నికేత్ బొమ్మ.




డబుల్... కిక్ ఇచ్చింది

'కమర్షియల్ సినిమా అంటే గుర్తుకొచ్చేది పూరి జగన్నాథ్. ఆయన ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఎక్కువ సమయం, కష్టం పెట్టిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. స్క్రిప్ట్ విన్నప్పుడు ఎంత కిక్ వచ్చిందో, ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నప్పుడూ అంతే కిక్ ఇచ్చింది. త్వరలో థియేటర్లలో కలుద్దాం' అని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. పూరి జగన్నాథ్ వీడియో సందేశంలో మాట్లాడుతూ 'వైజాగ్ గల్లీల్లో తిరిగినవాణ్ణి. నేను తీసిన గల్లీ సినిమా ఇది. సీ సెంటర్లలో విజిల్స్ వేస్తూ చూడండి' అని ప్రేక్షకులను కోరారు. థియేటర్‌కి పట్టిన తుప్పును వదలగొట్టే సినిమా ఇదని అలీ అన్నారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ కావ్యథాపర్ చెప్పారు.

గొప్ప సినిమాగా నిలిచిపోతుంది

కొత్తగా...



"తంగలాన్' వందేళ్ల క్రితం జరిగిన కథ. అందమైన సాహసోపేత ప్రయాణం ఈ సినిమా. విమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఈ సినిమా గురించిన ముఖ్యమైన విషయాలేవి బయటకు చెప్పలేదు. నా కెరీర్‌లో అత్యుత్తమ పాత్రను ఈ సినిమాలో చేశాను' అని హీరో విక్రమ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా పా రంజిత్ రూపొందించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్ర బృందం ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. పా రంజిత్ మాట్లాడుతూ 'మనదేశంలో అణచివేత, అసమానత్వం ఇంకా ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు నేను సినిమాను మాధ్యమంగా ఎంచుకున్నాను. నా గత చిత్రాల్లానే 'తంగలాన్'ను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. తంగలాన్ ప్రచార చిత్రాల్లో మా కష్టం కనపడుతోంది అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు.

సందేశాన్నిచ్చే 'సింబా'



జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకత్వంలో సంపత్ నంది, దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ "ఇది ప్రకృతి మీద ఉన్న ప్రేమతో తీసిన సినిమా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అని తెలిపారు. నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇస్తుంది. ఇది సమాజం కోసం తీసిన సినిమా" అని అన్నారు. "సినిమా చాలా కొత్త పాయింట్‌తో ఉంటుంది. సంపత్ నంది అద్భుతమైన కథను ఇచ్చారు" అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. "వనజీవి రామయ్య' జీవితం ఆధారంగా ఈ కథను రాసుకున్నారు సంపత్ నంది" అని నిర్మాత దాసరి రాజేందర్‌రెడ్డి అన్నారు.



శభాష్..శ్రీజేష్



హాకీ సెమీస్‌కు భారత్

షూటౌట్‌లో అడ్డుగోడలా గోల్ కీపర్ ● క్వార్టర్స్‌లో గ్రేట్ బ్రిటన్‌పై విజయం

పారిస్
ఒలింపిక్స్‌లో తొమ్మిదోరోజు హాకీ వీరులు మినహా బరిలోకి దిగిన మిగతా క్రీడాకారులంతా నిరాశపరిచారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఫైనల్ చేరతాడనుకున్న లక్ష్యసేన్ సెమీఫైనల్లో టాప్‌సీడ్ విక్టర్ అక్సెల్‌సెన్ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇక అతని ఆశలన్నీ సోమవారం జరిగే కాంస్య పతకపోరుపైనే. లవ్లీనా క్వార్టర్స్‌ను దాటకపోవడంతో బాక్సింగ్‌లో మన పరాజయం పరిపూర్ణమవగా.. షూటింగ్‌లో మరిన్ని పతకాలపై ఆశలు రేపిన మహేశ్వరి, విజయ్‌వీర్, అనీష్ తమ విభాగాల్లో ఫైనల్స్ చేరడంలో విఫలమయ్యారు.



పారిస్: ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు వరుసగా రెండో సారి సెమీస్‌లో అడుగుపెట్టింది. ఆదివారం గ్రేట్ బ్రిటన్‌తో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్స్ షూటౌట్‌కు దారి తీయగా 4-2తో హర్మన్‌ప్రీత్ సేన విజయం సాధించింది. నిర్ణీత సమయానికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. అర్జెంటీనా-జర్మనీ మధ్య జరిగే క్వార్టర్స్ మ్యాచ్ విజేతతో భారత్ సెమీస్‌ను మంగళవారం ఆడనుంది. కాగా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో క్వార్టర్‌ఫైనల్లోనూ భారత జట్టు 3-1తో బ్రిటన్‌ను ఓడించి సెమీస్‌కు చేరింది. ఇప్పుడు మరోసారి అదే జట్టుపై గెలవడం విశేషం. కాగా ఈ మ్యాచ్‌లో ఆఖరి 40 నిమిషాల పాటు భారత జట్టు కేవలం 10 మందితోనే ఆడినా ప్రత్యర్థిని మరో గోల్ చేయనీయకుండా అడ్డుకోగలిగింది. ఇందుకు జట్టు గోల్‌కీపర్ శ్రీజేష్ చూపిన అసాధారణ ఆటతీరే కారణం. మ్యాచ్‌లోనూ, షూటౌట్‌లోనూ అతడు బ్రిటన్‌కు అడ్డుగోడలా నిలిచి శభాష్ అనిపించుకున్నాడు. కెరీర్‌లో చివరి ఒలింపిక్స్ ఆడుతున్న అతను బ్రిటన్ నుంచి ఎదురైన 11 షాట్లను సమర్థవంతంగా అడ్డుకోకపోయుంటే ఈమ్యాచ్‌లో భారత్ ఓడేదేమో. రెండో క్వార్టర్‌లో డిఫెండర్ అమిత్ రోహిదాస్ హాకీ స్టిక్‌తో ప్రత్యర్థి ముఖంపై కొట్టాడనే కారణంతో రెడ్ కార్డుకు గురై మైదానం వీడాడు. అయినా కాసేపటికే హర్మన్ (22వ నిమిషం) గోల్ చేయడంతో జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ మరో ఐదు నిమిషాలకే బ్రిటన్ ఆటగాడు మోర్టాన్ గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత ఇరుజట్ల నుంచి గోల్ నమోదు కాలేదు. దీంతో షూటౌట్ తప్పలేదు. ఇందులో భారత్ నుంచి హర్మన్, సుఖ్‌జీత్, లలిత్, రాజ్ కుమార్ వరుసగా గోల్స్ చేయగా.. బ్రిటన్‌కు కీపర్ శ్రీజేష్ అడ్డుగా నిలవడంతో రెండు గోల్స్ మాత్రమే చేసి ఓడింది. ఇక, ఈ మ్యాచ్ లో శ్రీజేష్ ఆటతీరు నెట్టింట ప్రశంసలు అందుకుంటోంది. నీవే రియల్ హీరో అంటూ కొనియాడుతున్నారు.

సెమీస్‌లో రోహిదాస్ ఆడేనా?



బ్రిటన్‌తో క్వార్టర్స్ మ్యాచ్‌లో హాకీ స్టిక్‌తో ప్రత్యర్థి ముఖంపై కొట్టాడనే కారణంతో రెడ్‌కార్డ్‌కు గురైన భారత కీలక డిఫెండర్ అమిత్ రోహిదాస్ తర్వాతి మ్యాచ్‌లో ఆడేది సందేహంగా మారింది. రెడ్‌కార్డ్‌కు గురవడంతో చివరి నలభై నిమిషాలు రోహిదాస్ లేకుండానే భారత్ మ్యాచ్ ఆడింది. అయితే హాకీలో రెడ్‌కార్డ్ నిబంధనలు ఫుట్‌బాల్‌లో మాదిరిగా ఉండవు. హాకీలో రెడ్‌కార్డ్‌కు గురైతే..మ్యాచ్ అనంతరం ఈ ఉదంతంపై అంపైర్ సాంకేతిక అధికారికి నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడతను ఫుటేజ్‌ను నిశితంగా పరిశీలించి, సదరు ఆటగాడి చర్య ఉద్దేశపూర్వకంగా జరిగిందా లేదా అన్నది నిర్ణయిస్తాడు. ఉద్దేశపూర్వకంగా జరిగినట్టు తేలితే, ఆ ఆటగాడిని తర్వాతి మ్యాచ్ నుంచి తప్పిస్తారు. అదే జరిగితే, తర్వాతి మ్యాచ్‌లో భారత్‌కు ఇది పెద్ద దెబ్బే.

ఇక.. కాంస్యమే లక్ష్యం

సెమీస్‌లో అక్సెల్‌సెన్ చేతిలో సేన్ ఓటమి

లి జి జియాతో కంచు పతక పోరు నేడు

సా. 6 గం. నుంచి



లక్ష్యసేన్



అక్సెల్‌సెన్

పారిస్: బ్యాడ్మింటన్‌లో చారిత్రక స్వర్ణం ఆశలు ఆవిరయ్యాయి. అండర్ డాగ్‌గా బరిలోకి దిగిన ఏస్ షట్లర్ లక్ష్యసేన్ పసిడి పోరుకు చేరుకోలేక పోయాడు. ఆదివారం జరిగిన పురుషుల సెమీస్‌లో లక్ష్యసేన్ 20-22, 14-21తో డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెం.2 విక్టర్ అక్సెల్‌సెన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం పాలయ్యాడు. దీంతో అతను కాంస్యం కోసం పోటీపడనున్నాడు. 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో గేమ్ పాయింట్ వద్ద తొందరపాటుతో తొలి గేమ్‌ను చేజార్చుకొన్న సేన్.. రెండో గేమ్‌లో 7-0తో ఆధిక్యంలో నిలిచినా దాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేక పోయాడు. మరోవైపు ఎంతో అనుభవం ఉన్న రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అక్సెల్‌సెన్.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఒక దశలో తన మార్క్ క్రాస్ కోర్ట్ షాట్లతో అక్సెల్‌సెన్‌ను నియంత్రించిన లక్ష్య.. ఆ తర్వాత ప్రత్యర్థి అటాకింగ్ గేమ్‌తో డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. మొదటి గేమ్ ఆరంభంలో లక్ష్య 2-5తో వెనుకబడ్డాడు. కానీ, క్రమంగా పుంజుకొని క్రాస్ కోర్ట్ షాట్లతో అక్సెల్‌సెన్‌కు షాకిస్తూ 8-7తో పైచేయి సాధించాడు. వడివడిగా పాయింట్లు సాధిస్తూ 20-17తో గేమ్ పాయింట్‌పై నిలిచాడు. అయితే, వేగంగా గేమ్‌ను పూర్తి చేసి ఆధిక్యం సాధించాలన్న ఒత్తిడి అనవసర తప్పిదాలకు దారితీసింది. 20-20తో స్కోరు సమం చేసిన విక్టర్.. అదే జోరులో తొలి గేమ్‌ను కూడా తన ఖాతాలో వేసుకొన్నాడు. ఇక, రెండో గేమ్‌లో సేన్ తప్పిదాలను సవరించుకుంటూ 7-0తో దూసుకెళ్లాడు. కానీ, డెన్మార్క్ షట్లర్ కౌంటర్‌ఎటాక్ చేయడంతో లక్ష్య ఆట గతితప్పింది. పవర్‌ఫుల్ స్మాష్‌తో 7-8తో నిలిచిన విక్టర్.. క్రమంగా పాయింట్లు సాధిస్తూ 10-7తో పైచేయి సాధించాడు. బ్రేక్ తర్వాత తిరిగి వచ్చిన లక్ష్య ప్లాన్ మార్చినా.. అప్రమత్తంగా వ్యవహరించిన అక్సెల్‌సెన్ 15-12తో ముందంజ వేశాడు. క్రమంగా మ్యాచ్ ప్రత్యర్థి చేతుల్లోకి వెళ్లడంతో సేన్ ఏమీ చేయలేకపోయాడు. మరో సెమీస్‌లో కున్లావత్ విటిడ్‌సర్న్ (థాయ్‌లాండ్) 21-14, 21-15తో లీ జి జియా (మలేసియా)పై నెగ్గాడు.

సెమీస్‌లో ఓడినా.. మెగా ఈవెంట్‌లో పతకం సాధించే చాన్స్ లక్ష్యసేన్‌కు ఇంకా ఉంది. సోమవారం జరిగే కాంస్య పోరులో మలేసియా షట్లర్ లి జి జియాతో సేన్ తలపడనున్నాడు. ఇందులో నెగ్గితే ఒలింపిక్ పతకం సాధించిన తొలి భారత పురుష షట్లర్‌గా లక్ష్య రికార్డులకెక్కుతాడు. మహిళల్లో సింధు రజత, కాంస్యాలు నెగ్గగా.. లండన్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కంచు పతకం సాధించింది.

క్వార్టర్స్‌లో ఓడిన లవ్లీనా

ఒలింపిక్స్‌లో మన బాక్సర్ల కథ ముగిసింది. ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగినా.. కనీసం ఒక్క పతకం కూడా సాధించలేక పోయారు. టోక్యో క్రీడల కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ సైతం చేతులెత్తేసింది. మహిళల 75 కిలోల క్వార్టర్స్ బౌట్‌లో లవ్లీనా 1-4తో టాప్ సీడ్ లిన్ క్వియాన్ (చైనా) చేతిలో చిత్తయింది. పోటీలకు ముందు నిఖత్ జరీన్, లవ్లీనా పతకం నెగ్గగలరనే అంచనాలు భారీగానే నెలకొన్నాయి. కానీ, వీటిని అందుకోవడంలో వీరిద్దరూ విఫలమయ్యారు.

షూటింగ్‌లో నిరాశ

25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో విజయ్‌వీర్ సిద్ధూ, అనీష్ భన్వాలా ఫైనల్‌కు చేరుకోవడంతో విఫలమయ్యారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో విజయ్‌వీర్ 9వ స్థానంలో, భన్వాలా 13వ స్థానంలో నిలిచి పతక పోరుకు అర్హత సాధించలేక పోయారు. మహిళల స్కీట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో మహేశ్వరి చౌహాన్, రైజా థిల్లాన్ 14వ, 23వ స్థానాల్లో నిలిచారు. టాప్-6లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్స్‌కు అర్హులు.

ఫైనల్‌కు దూరమైన జస్విన్, పారుల్

లాంగ్‌జంప్‌లో జస్విన్ ఆల్డ్రిన్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-బిలో జస్విన్ 7.61 మీటర్లు మాత్రమే దూకి 13వ స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా 26వ స్థానంతో పతక రౌండ్‌కు అర్హత సాధించలేక పోయాడు. మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో పారుల్ చౌదరి కూడా ఫైనల్ చేరుకోలేక పోయింది. రౌండ్-1 హీట్స్‌లో పారుల్ 9 నిమిషాల 23.39 సెకన్ల టైమింగ్‌తో 8వ స్థానంలో నిలిచింది. హీట్స్‌లో టాప్-5 అథ్లెట్లు మాత్రమే పతక రౌండ్‌కు క్వాలిఫై అవుతారు.

జొకో సాధించాడు



సెర్బియా దిగ్గజానికి సింగిల్స్ స్వర్ణం

ఫైనల్లో అల్కారజ్ చిత్తు

రెండు దశాబ్దాల ప్రొఫెషనల్ కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్‌లు..లెక్కలేనన్ని టూర్ టైటిళ్లు.. కానీ సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు ఒలింపిక్ స్వర్ణ పతకం అందని ద్రాక్షగానే మిగిలింది. పైగా వయసు 37. వెంటాడుతున్న గాయం బెడద. జరిగిన మూడు గ్రాండ్‌స్లామ్‌ల్లో ఒక్కటీ దక్కని బాధ. మరోవైపు స్పెయిన్ కుర్రాడు అల్కారజ్ రూపంలో పొంచి వున్న ప్రమాదం. ఇన్ని ప్రతికూలతల నడుమ జొకో అనుకున్నది సాధించాడు. ఒలింపిక్స్ స్వర్ణంతో తన కెరీర్‌ను సంపూర్ణం చేసుకున్నాడు. అలాగే అరుదైన గోల్డెన్ స్లామ్ (4 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతోపాటు ఒలింపిక్స్ సింగిల్స్ స్వర్ణం) కూడా అందుకున్నాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన సింగిల్స్ తుది పోరులో జొకో 7-6 (3), 7-6 (2)తో అల్కారజ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో నొవాక్ కాంస్యం సాధించాడు. తర్వాతి మూడు విశ్వక్రీడల్లో తీవ్రంగా ప్రయత్నించినా స్వర్ణం అందుకోలేకపోయాడు. ఎట్టకేలకు కెరీర్ చరమాంకంలో పసిడి పతకంతో తన కలను జొకో నెరవేర్చుకున్నాడు.

18వ స్థానంలో విష్ణు

సెయిలింగ్ పురుషుల డింగీలో విష్ణు శరవణన్ 18వ స్థానానికి ఎగబాకాడు. ఏడో రేస్‌లో ఏడో స్థానంతో మెరుగైన ప్రదర్శన చేసిన విష్ణు.. ఎనిమిదో రేస్‌లో మాత్రం 24వ స్థానంలో నిలిచాడు. దీంతో ఓవరాల్‌గా 18వ స్థానానికి చేరాడు. మహిళల డింగీలో నేత్ర కుమనన్ ఓవరాల్‌గా 25వ స్థానంలో ఉంది. రేస్-7లో 21వ స్థానంలో, రేస్-8లో 31వ స్థానం లో నిలిచింది.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	19	15	11	45
అమెరికా	18	26	25	69
ఫ్రాన్స్	12	14	18	44
ఆస్ట్రేలియా	12	10	7	29
బ్రిటన్	10	12	15	37
కొరియా	10	7	7	24
జపాన్	8	5	10	23
ఇటలీ	7	9	5	21
నెదర్లాండ్స్	6	5	4	15
జర్మనీ	5	5	2	12
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

లెడెకి.. నాలుగోసారి

800 మీ.ఫ్రీస్టయిల్ టైటిల్ కైవసం

చరిత్ర సృష్టించిన అమెరికా స్విమ్మర్



పారిస్: ఆమె ఈత కొలనులోకి దిగితే స్వర్ణం కొట్టాల్సిందే. మరీ ముఖ్యంగా 800 మీ. ఫ్రీస్టయిల్‌లో అయితే ఎదురేలేదు. ఒకటి, రెండు కాదు ఏకంగా నాలుగు ఒలింపిక్స్‌లో ఆ విభాగంలో వరుసగా అగ్రస్థానం ఆ స్విమ్మర్‌దే. అందుకే ఆమెను అంతా ముద్దుగా 'గోల్డెన్ ఫిష్' అని పిలుస్తారు. ఆమే..అమెరికాకు చెందిన కేటీ లెడెకి. మహిళల 800 ఫ్రీస్టయిల్ తనను మించినవారు లేరని మరో సారి నిరూపించింది. శనివారం రాత్రి జరిగిన ఫైనల్లో 27 ఏళ్ల లెడెకి ఎనిమిది నిమిషాల 11.04 సెకన్ల టైమింగ్‌తో గమ్యం చేరి పసిడి పతకం కొల్లగొట్టింది. లెడెకికి గట్టి పోటీ ఇస్తుందని అంచనా వేసిన ఆస్ట్రేలియా యువ స్విమ్మర్ అరియర్నే టిట్మస్ రజతంతోనే సరిపెట్టుకోగా. అమెరికాకు చెందిన పెయిజ్ మాడెన్ కాంస్యం దక్కించుకుంది. ఇక ఈ విభాగంలో లండన్, రియో, టోక్యో గేమ్స్ నుంచి లెడెకి చాంపియన్‌గా నిలుస్తూ వస్తుండడం విశేషం. పారిస్ క్రీడల్లో కేటీకిది రెండో స్వర్ణం. ఇంతకుముందు 1500 మీ. ఫ్రీస్టయిల్‌లో టైటిల్ సొంతం చేసుకుంది. విశ్వక్రీడల్లో ఓవరాల్‌గా లెడెకికి తొమ్మిది పసిడి పతకం. ఒలింపిక్స్‌లో ఇన్ని స్వర్ణ పతకాలు చేజిక్కించుకున్న ఆరో అథ్లెట్‌గా కేటీ నిలిచింది. ఇంతకుముందు అమెరికా దిగ్గజ స్విమ్మర్ మార్క్ స్పిట్జ్, ట్రాక్ స్టార్ కార్ల్ లూయిస్, సోవియట్ జిమ్నాస్ట్ లారిసా లాటినినా, ఫిన్లాండ్ రన్నర్ పావో నూర్మి, అమెరికా లెజెండ్ మైకేల్ ఫెల్ప్స్ ఈ ఘనత సాధించారు. అయితే ఫెల్ప్స్ ఏకంగా 23 ఒలింపిక్స్ స్వర్ణ పతకాలతో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు.

జులియన్.. '200' కూడా కొట్టేనా!

సెమీస్ చేరిన స్టార్ స్ప్రింటర్



సెయింట్ డెనిస్ (ఫ్రాన్స్): మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో చాంపియన్‌గా నిలిచిన జులియన్ ఆల్‌ఫ్రెడ్.. 200 మీటర్ల రేసులోనూ పతకం కొల్లగొట్టేందుకు సిద్ధమైంది. ఈ సెయింట్ లూసియా స్టార్ 200 మీటర్ల హీట్స్‌లో సత్తాచాటింది. ఆదివారం జరిగిన ఆరంభ రౌండ్‌లో హీట్-1 నుంచి పరిగెత్తిన జులియన్.. 22.41 సెకన్లలో గమ్యాన్ని చేరి తన హీట్‌లో ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో ఆమె సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. సెమీఫైనల్స్ సోమవారం అర్ధరాత్రి, ఫైనల్స్ మంగళవారం జరగనున్నాయి. మొత్తం ఆరు హీట్స్ నుంచి తొలి మూడు స్థానాల చొప్పున నిలిచిన అథ్లెట్లు సెమీస్ చేరతారు. 23 ఏళ్ల జులియన్ శనివారం అర్ధరాత్రి జరిగిన 100 మీటర్ల రేసును 10.72 సెకన్లలో ముగించి కొత్త ఒలింపిక్ చాంపియన్‌గా అవతరించింది. ఆమె దేశాని (సెయింట్ లూసియా)కిదే తొలి ఒలింపిక్ స్వర్ణం. ఇక, ఫేవరెట్ అనుకున్న అమెరికా స్టార్ షకారి రిచర్డ్‌సన్ 10.87 సెకన్లతో రెండోస్థానంలో నిలిచి రజతానికి పరిమితమవగా.. అమెరికాకే చెందిన మెలిసా జెఫర్సన్ (10.92 సె) మూడోస్థానంతో కాంస్యం అందుకుంది.

డిఫెండింగ్ చాంప్ షెరికా అవుట్

వరల్డ్ చాంపియన్ షెరికా జాక్సన్ 200 మీటర్ల రేసు నుంచి వైదొలగింది. కారణమేంటన్నది వెల్లడించని ఆమె ఆదివారం జరిగిన హీట్స్ నుంచి అనూహ్యంగా తప్పుకొంది. 30 ఏళ్ల జాక్సన్ 100 మీటర్ల రేసులోనూ పోటీపడలేదు.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: స్కీట్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్: మహేశ్వరీ చౌహాన్, అనంత్‌జీత్ సింగ్ (మ. 12.30)
టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ప్రీక్వార్టర్స్: భారత్ X రొమేనియా (మ. 1.30)
సెయిలింగ్: మహిళల డింగీ రేస్ 9, 10: నేత్ర కుమనన్ (మ. 3.45); **పురుషుల డింగీ రేసు 9, 10:** విష్ణు శరవణన్ (సా. 6.10)
అథ్లెటిక్స్: మహిళల 400 మీటర్ల రౌండ్ 1: కిరణ్ పాహల్ (మ. 3.57); **పురుషుల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ రౌండ్ 1:** అవినాష్ సబ్లే (రా. 10.50)
బ్యాడ్మింటన్: సింగిల్స్ కాంస్య పతక పోరు: లక్ష్యసేన్ X జి జియా లీ (మలేసియా) (సా. 6.00)

వివాదాస్పద బాక్సర్‌కు పతకం ఖరారు



పారిస్: శరీరంలో పురుష లక్షణాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అల్జీరియా, తైవాన్ బాక్సర్లు ఇమేని ఖెలీఫ్, లిన్ యు టింగ్ దూసుకెళుతున్నారు. ఇప్పటికే ఇమేని పతకం ఖాయం చేసుకోగా.. ఆదివారం జరిగిన మహిళల 57 కేజీల విభాగం క్వార్టర్స్‌లో లిన్ 5-0తో స్వెట్లానా కమెనోవా (బల్గేరియా)ను ఓడించి సెమీస్‌కు వెళ్లింది. దీంతో తను కూడా కెరీర్‌లో తొలి ఒలింపిక్ మెడల్ అందుకునేందుకు సిద్ధమైంది. సెమీస్‌లో ఓడినా ఆమెకు కాంస్యం దక్కుతుంది. టెస్టోస్టెరోన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉందనే కారణంతో గతేడాది ప్రపంచ మహిళా చాంపియన్‌షిప్ నుంచి ఇమేని, లిన్ యులపై అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే పారిస్ గేమ్స్‌లో ఆడుతుండడంపై వీరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వారెవా.. వాండర్సే

ఆరు వికెట్లతో చెలరేగిన లంక స్పిన్నర్ ●రెండో వన్డేలో భారత్ ఓటమి



వాండర్సే

2

భారత్‌తో జరిగిన వన్డేల్లో 5 వికెట్లు తీసిన రెండో లెగ్ స్పిన్నర్‌గా వాండర్సే. గతంలో ముస్తాక్ అహ్మద్ (5/36 -1996లో) తీశాడు.

కొలంబో: ఎట్టకేలకు భారత జట్టుపై శ్రీలంక పైచేయి సాధించింది. టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురై.. తొలి వన్డేను టై చేసుకున్న ఆతిథ్య జట్టు రెండో మ్యాచ్‌లో మాత్రం ఆల్‌రౌండ్‌షోతో అదుర్స్ అనిపించుకుంది. ముందుగా బ్యాటర్లు సమష్టిగా రాణించగా.. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండర్సే (6/28) గూగ్లీ బంతులకు భారత స్టార్ బ్యాటర్ల దగ్గర సమాధానం లేకుండా పోయింది. కెప్టెన్ అసలంక (3/20) మిగతా ఆటగాళ్ల పనిపట్టడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. తద్వారా సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. ఆఖరి వన్డే బుధవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 240 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సిరాజ్ వికెట్ తీసినా.. ఆరంభంలో ఓపెనర్ ఫెర్నాండో (40), కుశాల్ (30)లతో పాటు చివర్లో కమిందు (40), వెల్లలగె (39) ఆటతో సవాల్ విసిరే స్కోరందుకుంది. సుందర్‌కు మూడు, కుల్దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 42.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు రోహిత్ (64), గిల్ (35) తొలి వికెట్‌కు 97 పరుగులు జోడించినా.. ఆ తర్వాత అక్షర్ (44) మినహా అంతా విఫలమయ్యారు. వాండర్సే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు:
శ్రీలంక: 50 ఓవర్లలో 240/9 (కమిందు మెండిస్ 40, ఫెర్నాండో 40, వెల్లలగె 39, కుశాల్ 30; సుందర్ 3/30, కుల్దీప్ 2/33); **భారత్:** 42.2 ఓవర్లలో 208 ఆలౌట్. (రోహిత్ 64, గిల్ 35, అక్షర్ 44; వాండర్సే 6/33, అసలంక 3/20).

నీరజ్ గోల్డ్‌కొడితే.. బంపర్ ఆఫర్

న్యూఢిల్లీ: శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా పనిచేసే ఆన్‌లైన్ వీసా అప్లికేషన్ ప్లాట్‌ఫామ్ సంస్థ అట్లిస్ సీఈవో మోహన్ నహతా బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఈనెల 8న జరిగే జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా స్వర్ణం సాధిస్తే అట్లిస్ వినియోగదారులకు ఫ్రీ వీసా అందజేస్తామని ప్రకటించారు. ఆ ఒక్కరోజే ఈ ఆఫర్ ద్వారా అన్ని దేశాల వీసాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఇందుకోసం మోహన్ నహతా ఖాతాలో వినియోగదారులు తమ ఈమెయిల్ ఐడీ తెలియజేయాలి.

నెమోర్‌కు రికార్డు స్వర్ణం



అల్జీరియాకు చెందిన కేలియా నెమోర్ రికార్డు సృష్టించింది. 17 ఏళ్ల నెమోర్ జిమ్నాస్టిక్స్ మహిళల అన్‌ఈవెన్ బార్స్‌లో పసిడి సొంతం చేసుకుంది. తద్వారా జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచిన తొలి ఆఫ్రికన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో కళ్లు చెదిరే ప్రదర్శన చేసిన కేలియా..17.700 పాయింట్లతో టైటిల్ దక్కించుకుంది. అంతేకాదు..పారిస్ ఒలింపిక్స్‌లో అల్జీరియాకు మొదటి పతకం అందించింది. చైనాకు చెందిన ప్రపంచ చాంపియన్ క్వియు రజతం, సునిసా లీ(అమెరికా) కాంస్యం నెగ్గారు.

నా గెలుపును లాక్కున్నారు..

బాక్సర్ నిషాంత్ ఆవేదన

అత్యుత్తమంగా రాణించినా, భారత బాక్సర్ నిషాంత్ దేవ్‌కు ఒలింపిక్స్‌లో నిరాశ ఎదురైంది. శనివారం రాత్రి జరిగిన 71 కిలోల విభాగం క్వార్టర్స్ బౌట్‌లో మెక్సికో బాక్సర్ మార్కో వెర్డె చేతిలో 1-4తో నిషాంత్ ఓటమి పాలయ్యాడు. అయితే, ఈ బౌట్‌లో నిషాంత్ అత్యుత్తమ ప్రతిభ చూపినా.. జడ్జీలు సరైన స్కోరింగ్ ఇవ్వలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిషాంత్ తొలిరౌండ్లో పూర్తి ఆధిక్యం చూపాడు. మిగతా రెండు రౌండ్లలోనూ ఆధిపత్యం ప్రదర్శించినా, ప్రత్యర్థిని విజేతగా ప్రకటించడం వివాదాస్పదమవుతోంది.



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ వెంకటయ్య

దళిత మహిళపై పోలీసుల దాడి

- దొంగతనం చేసిందనే నెపంతో కొట్టిన ఇన్‌స్పెక్టర్
- ఘటనపై విచారణకు సీఎం రేవంత్ ఆదేశం
- ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు ఇన్‌స్పెక్టర్ అటాచ్

షాద్‌నగర్ రూరల్/హైదరాబాద్/సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు అపహరించిందనే నెపంతో పోలీసులు ఓ దళిత మహిళను విచక్షణా రహితంగా కొట్టారు. దెబ్బలకు తాళలేక ఆమె స్పృహ కోల్పోవడంతో.. ఫిర్యాదుదారు కారులో ఇంటికి పంపించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షాద్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో ఉంటున్న నాగేందర్.. తన ఇంట్లో 26 తులాల బంగారం, రూ. 2లక్షల నగదు చోరీకి గురైందని జూలై 24న షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమ ఇంటి సమీపంలో ఉండే సునీత, భీమయ్య దంపతులపై అనుమానం ఉందని చెప్పాడు. దీంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి అదే రోజున సునీత, భీమయ్య దంపతులతో పాటు వారి 13 ఏళ్ల కుమారుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. అనంతరం భీమయ్యను పంపించారు. ఆ తర్వాత నేరం ఒప్పుకోవాలని ఇన్‌స్పెక్టర్ తనను విచక్షణా రహితంగా కొట్టారని సునీత ఆరోపించింది. మగ పోలీసులు తనపై ఎక్కడపడితే దాడి చేశారని, తన కుమారుడిని లాఠీతో కొట్టారని తెలిపింది. తాను స్పృహ కోల్పోవడంతో నాగేందర్ కారులో తనను ఇంటికి పంపించారని వెల్లడించింది. అయితే, దొంగతనం కేసులో సునీతపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి 13 రోజులు గడుస్తున్నా.. ఆమెను ఎందుకు అరెస్టు చేయలేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఆమెను కొట్టారని.. అరెస్టుకు ముందు ఆస్పత్రికి తీసుకువెళితే గాయాలు కనిపిస్తాయనే అరెస్టు చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి.

బాధ్యులపై చర్యలకు రేవంత్ ఆదేశం..

షాద్‌నగర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. విషయం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన దృష్టికి వెళ్లడంతో.. ఉన్నతాధికారులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు వారికి అండగా ఉంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. రేవంత్ ఆదేశాలతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి విచారణకు ఆదేశించారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి విచారణలో దళిత మహిళ పట్ల డీఐ అమానుషంగా ప్రవర్తించినట్లు తేలింది. దాంతో ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డిని సిటీ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఐపై అట్రాసిటీ కేసు పెట్టాలి..

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ వెంకటయ్య ఆదివారం పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మహిళను విచక్షణా రహితంగా కొట్టిన ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం

- గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాట్లు చేసిన అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి స్వచ్ఛదనం, పచ్చదానం కార్యక్రమాన్ని చేపట్టనుంది. నేటి నుంచి ఈ నెల 9వ తేది వరకు అయిదు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలు, 127 మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై నేడు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు, రోడ్లను శుభ్రం చేయడం, మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించడం, ఇళ్లలోని చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు పంపడం, చెత్త సేకరించే వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను అమర్చడం వంటి కార్యక్రమాలు చేయనున్నారు. ఈ నెల 6న తాగునీటిని అందించే ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, ఇంకుడు గుంతల ఏర్పాటు, చెరువులను సంరక్షణ, కలుషితం కాకుండా చూడటం, 7న గ్రామాలు, పట్టణాల్లోని ముంపు ప్రాంతాల్లో మురుగా నీరు నిలువకుండా చర్యలు తీసుకోవడం, మురుగునీటి గుంతలను పూడ్చటం, 8న సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, వీధి కుక్కలను యానిమల్ బర్త్ కంట్రోల్‌కు తరలించడం, ఇళ్లలో నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయడం, 9న శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వాటిని తొలగించే చర్యల చూపట్టడం, రోడ్లకు ఇరువైపులా ఎండిపోయిన చెట్లను తీసేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే



ప్రతి మంగళ, శుక్రవారాన్ని డ్రై డేగా పాటించడంపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. రోజువారీగా చేపట్టే ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రభుత్వ విభాగాలతో పాటు స్థానిక నాయకులు, యువకులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొననున్నారు.

అక్షరం తేడా ఉన్నా..

మాఫీ కాని రుణం!

రైతుల రుణమాఫీకి సాఫ్ట్‌వేర్ చిక్కులు!.. పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా జాబితా నుంచి ఔట్

- వివరాలు సరిపోవట్లేదని తిరస్కరణ
- ముగ్గురిలో ఒక్క పాస్‌బుక్ రద్దయితే.. మిగిలిన వారికీ నిలిపివేత
- ఇద్దరు అన్నదమ్ములుంటే ఒకే ఆధార్ లెక్కలోకి తీసుకొని స్క్రీనింగ్

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన రైతులందరికీ రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా.. పథకం అమలుకు సాంకేతిక సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని అర్హతలున్న రైతులకు కూడా రుణమాఫీ జాబితాలో చోటు దక్కడంలేదు. రేషన్‌కార్డు ఆధారంగా రైతు కుటుంబాల ఎంపిక, ఆధార్ సీడింగ్‌లో దొర్లిన తప్పులతో అర్హులకు అన్యాయం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేరు, ఇంటి పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా, ఆధార్ కార్డుపై ఉన్న చిరునామా, బ్యాంకు ఖాతా వివరాల్లో చిన్న, చిన్న తేడాలున్నా.. లబ్ధిదారుల జాబితాలో పేర్లు తీసేశారు. బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)లో రూపొందించిన రైతుల జాబితాలు, నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ)లో ప్రాసెసింగ్ లోపాలు ఇందుకు కారణమవుతున్నాయి. రుణమాఫీ లబ్ధిదారుల జాబితా తయారీ, డేటా ప్రాసెసింగ్, రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని ఎంపిక చేయడంలో తప్పులు దొర్లాయి. బ్యాంకులు, పీఏసీఎస్‌లలో తయారుచేసిన రుణమాఫీ జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ రైతుకు రూ.లక్ష అప్పు ఉంటే.. రూ.21 వేలు మాత్రమే మాఫీ అయింది. వ్యవసాయాధికారిని అడిగితే, బ్యాంకుకు వెళ్లి అడగాలని చెప్పారు. బ్యాంకుకు వెళ్తే.. ప్రభుత్వం నుంచి ఇంతే మంజూరైందన్నారు.

తల్లి చనిపోతే కొడుక్కి రాని రుణమాఫీ

ఒక కుటుంబంలో భార్య, భర్త, తల్లి ముగ్గురు ఉంటే.. వారికి వేర్వేరుగా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయి. తల్లి చనిపోవటంతో రెవెన్యూ శాఖ పాస్‌బుక్కును రద్దు చేసింది. భార్యాభర్తలకు పాస్‌బుక్కులు అలాగే ఉన్నాయి. అయితే తల్లితోపాటు ఒకే రేషన్‌కార్డులో వీరిద్దరి పేర్లు ఉండటంతో.. కొడుకు, కోడలు రుణమాఫీని కూడా ఆపేశారు. ఇక అన్నదమ్ములు ఇద్దరు వేర్వేరుగా ఉంటే.. వారిని ఒకే ఆధార్ నెంబరు కింద తీసుకొని పెండింగ్ పెట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన అక్కల దివ్యవాణి ఏడాది క్రితం రూ.62 వేల అప్పు తీసుకోగా.. రుణమాఫీ జాబితాలో ఆమె పేరు రాలేదు. తన భర్త తిరుపతి, ఇతర కుటుంబ సభ్యులెవరూ పంటరుణం తీసుకోలేదు. అయినా దివ్యవాణికి రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లా ఐలాపూర్‌కు చెందిన ఎర్రటి సావిత్రికి రూ.65 వేల అప్పు ఉంది. ఈమె ఆధార్ నెంబరు వేరే కుటుంబం పరిధిలో ఉంది. ఆ కుటుంబంతో సావిత్రికి ఎలాంటి సంబంధంలేదు. అయినా.. తప్పుడు ఆధార్ నమోదు కారణంగా సావిత్రి పేరు రుణమాఫీ జాబితాలో రాలేదు. ఇదే జిల్లాలోని ఎత్తొండ గ్రామానికి చెందిన సాగి చంద్రశేఖర్ పేరు ఆధార్‌లో అక్షర దోషాలు ఉండటంతో రుణమాఫీ రాలేదు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన కట్కూరి సుధాకర్‌కు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.50 వేల అప్పు ఉంది. ఏటా రెన్యువల్ చేస్తున్నారు. వడ్డీతో కలిపి రూ. 50-60 వేలకు మించదు. అయినా మాఫీ కాలేదు.

అన్నదమ్ముల్లో ఒకరు చనిపోయారని..

నిర్మల్ జిల్లా బాసర గ్రామంలో డొప్పోల్ల సురేష్, రామ్, సుభాష్ అనే సోదరులకు సహకార బ్యాంకులో తలో రూ.50 వేల క్రాప్ లోన్ ఉంది. వీరికి ఒకే రేషన్ కార్డు ఉంది. పట్టాదారు పాస్‌పుస్తకాలు వేర్వేరుగా ఉన్నాయి. వీరిలో సుభాష్ కొంతకాలం క్రితం చనిపోయారు. చనిపోయిన రైతులకు కూడా రుణ మాఫీ



చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సుభాష్ పేరు లేదు. బ్రతికి ఉన్న సురేష్, రామ్ సోదరుల పేర్లు కూడా జాబితాలో లేవు. రంగారెడ్డి జిల్లా కందుకూరు సహకార సంఘంలో పంట రుణాలు తీసుకుంటే.. మేడ్చల్, శామీర్‌పేట, ఘట్కేసర్ సహకార సంఘాల్లో మాఫీ జాబితాలో పేర్లు వచ్చాయి. ఆధార్ నెంబర్లు వేరే పీఏసీఎస్‌లో నమోదు చేయటంతో తప్పు జరిగింది. ఉదాహరణకు కందుకూరుకు చెందిన ఎడ్ల నర్సింహ ఆధార్ నెంబరును మేడ్చల్ సొసైటీలోని పుట్టు సత్తయ్య పేరుమీద నమోదు చేశారు. దీంతో నర్సింహకు రూ.55 వేలు మాఫీ కాలేదు. సత్తయ్యకు రూ.13,834 మాఫీ అయ్యాయి. రంగారెడ్డి జిల్లా కేశంపేటకు చెందిన తలసాని యశోదమ్మ 2018లో కెనరా బ్యాంకులో రూ.41,500 అప్పు తీసుకున్నారు. అసలు, వడ్డీ కలిపినా రూ.లక్ష లోపే ఉంటుంది. కానీ, ఆమెకు రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కాలేదు. ఇలాంటి వారు రాష్ట్రంలో 6 లక్షలకు పైగా ఉన్నారు.

ఇంటిపేరులో అక్షరాలు తేడా ఉన్నాయని పక్కన పెట్టారు



ఆధార్ కార్డుమీద ఇంటిపేరుతో కలిపి నా పేరు సంద్రాస్ భగవంత్ అని ఉంది. బ్యాంకు ఖాతాలో ఎస్.భగవంత్ అని ఉంది. దీంతో రుణమాఫీ జాబితా నుంచి తీసేశారు. నా పేరుమీద రూ. 38 వేలు, భార్య మంగమ్మ పేరుమీద రూ. 30 వేల రుణం ఉంది. వడ్డీతో సహా ఇద్దరిదీ కలిపి రూ.1 లక్ష లోపే ఉంటుంది. అయినా మాకు రుణ మాఫీ కాలేదు.

- సంద్రాస్ భగవంత్, గండీడ్, మహబూబ్‌నగర్ జిల్లా

జాబితాలోనే నాపేరు లేదు



నాకు 18 గుంటల భూమి ఉంది. గీసుకొండ పీఏసీఎస్‌లో రూ.30 వేలు అప్పు తీసుకున్నా. నాకు ఒక సోదరుడు ఉన్నాడు. వేర్వేరుగా నివాసముంటున్నాం. రేషన్ కార్డులు కూడా వేర్వేరుగా ఉన్నాయి. అయినా రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. పీఏసీఎస్ నుంచి ప్రభుత్వానికి పంపిన జాబితాలోనే నాపేరు రాయలేదు.

- కుమారస్వామి, గీసుకొండ, వరంగల్ జిల్లా

కెనరా బ్యాంకులో రుణ ఖాతాలు మార్చకపోవడంతో..

కెనరా బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. బ్యాంకులో రైతుల పేరుమీద సాధారణ ఖాతా వేరుగా ఉంటుంది. ఒకవేళ ఆ రైతు రుణం తీసుకుంటే... లోన్ అకౌంట్‌ను వేరుగా తెరుస్తారు. రుణాన్ని రెన్యువల్ చేసినప్పుడు లోన్ అకౌంట్‌ను క్లోజ్ చేస్తారు. ఆ తర్వాత మళ్లీ కొత్త లోన్ అకౌంట్ తీస్తారు. అయితే కెనరా బ్యాంకులో రైతుల రుణాలు రెన్యువల్ చేసిన సమయంలో లోన్ అకౌంట్లు మార్చలేదు. పాత లోన్ అకౌంట్లతోనే రెన్యువల్ చేశారు. ఇప్పుడు పాత లోన్ అకౌంట్లు రుణమాఫీ జాబితాలోకి రాలేదు. కేవలం కటాఫ్ తేదీ లోపల కెనరా బ్యాంకులో కొత్తగా క్రాప్ లోన్ తీసుకున్న రైతులకే రుణమాఫీ వర్తించింది. బ్యాంకులో ఆరాతీస్తే.. పాత ఖాతాదారులకు రుణమాఫీ వర్తించలేదని తేలింది. ఉదాహరణకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ కెనరా బ్యాంకులో పంటరుణాలు తీసుకున్న అర్హులైన రైతులకు రూ.16 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా.. రూ.90 లక్షలు మాత్రమే మాఫీ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కెనరా బ్యాంకులో లోన్ తీసుకున్న 52,211 మంది రైతులకు మొదటి విడతలో రూ.294 కోట్ల మాఫీ వచ్చింది. రెండో విడతలో 24,285 మంది రైతులకు రూ. 256 కోట్ల మాఫీ వచ్చింది. వీరంతా కటాఫ్ తేదీ లోపు కొత్తగా రుణాలు తీసుకున్న రైతులే కావటం గమనార్హం. రెన్యువల్ చేసిన వారికి మాత్రం భంగపాటు ఎదురైంది. బ్యాంకర్ల తప్పిదంతో జరిగిన ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

‘వెనుకబడిన’ సంక్షేమం

- పదేళ్లలో బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్లకు రూ. 8,233 కోట్లు మంజూరు
- ఖర్చు పెట్టింది కేవలం రూ.911 కోట్లే
- నాలుగేళ్లు రూపాయీ ఇవ్వని వైనం
- రూ. లక్ష ఆర్థిక సాయంలోనూ కోతలే
- 48,120 మందికే సాయం

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం నిజంగానే వెనుకబడింది. గడిచిన పదేళ్లలో గత ప్రభుత్వం కేటాయించిన నిధులు, వాటి విడుదల, చేసిన ఖర్చు చూస్తే బీసీల సంక్షేమం ఎంత వెనుకబడిందో తేటతెల్లమవుతుంది. 2014-15 నుంచి 2023-24 వరకు బీసీల అభివృద్ధికి ఆయా కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు కలిపి రూ.8,233.97 కోట్లు కేటాయించగా, రూ.1,795.31 కోట్లు మాత్రమే విడుదల చేసి.. అందులో కేవలం రూ.911.2 కోట్లే ఖర్చు చేసింది. 2019-20 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం గమనార్హం. స్వయం ఉపాధి కోసం, కులవృత్తులు నిర్వహించుకుంటాం సాయం చేయండంటూ సర్కారుకు 2014-15లో 3.60 లక్షలు, 2017లోనూ మరో 5.70 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2018 ఎన్నికల సందర్భంగా 40 వేల మందికి మాత్రమే.. అదీ రూ.50 వేల చొప్పున సాయం అందించింది. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు ఆర్థిక సాయం పేరుతో రూ.లక్ష అందించే పథకం ప్రవేశపెట్టింది. దీనికి దాదాపు 5.28 లక్షల దరఖాస్తులు రాగా, వీటిలో కేవలం 48,120 మందికి రూ.481 కోట్లు మాత్రమే అందించింది. మిగిలిన దరఖాస్తుదారులు ఎదురుచూపులకే పరిమితమయ్యారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు వరకు 112 కులాలతో ఉన్న బీసీల్లో గత ప్రభుత్వం మరో 16 కులాలను కూడా కలిపింది. దాంతో బీసీల్లో ఇప్పుడు 128 కులాలు ఉన్నాయి. ఆయా వర్గాలవారంతా సరైన సాయం అందక, బయట రుణాలు లభించక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా 9 కార్పొరేషన్ల ఏర్పాటు: గత ప్రభుత్వ హయాంలో బీసీలకు ఆర్థిక చేయూత ఆశించిన స్థాయిలో జరగలేదని, తాము అధికారంలోకి బీసీలను ఆదుకుంటామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించింది. అందులో భాగంగానే అదనంగా మరో 8 కార్పొరేషన్లు, వెల్ఫేర్ బోర్డును కొత్తగా ఏర్పాటుచేసింది. వీటికి 2024-25 బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున రూ.450 కోట్లు కేటాయించింది. మొత్తం బీసీ శాఖ పరిధిలోని కార్పొరేషన్లు, ఫెడరేషన్లు అన్నింటికీ కలిపి రూ.2,371.21 కోట్లు కేటాయించింది.

జీవో46 రద్దుకోసం పోరాడతాం

- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల్లో కొందరికి నష్టం కలిగించేలా ఉన్న జీవో 46ను రద్దుచేయాలని నిరాహార దీక్షలు కొనసాగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని, వారికి అండగా పోరాడతామని బీఆర్ఎస్‌నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమను గెలిపించిన నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని, ఇప్పుడు వారిపై కేసులు పెట్టి వేధిస్తోందని ఆయన ఆరోపించారు.

ఏడాదిన్నరలోగా ఉప్పల్ ఫ్లైఓవర్ పూర్తి

- పాత కాంట్రాక్టు రద్దు చేసి.. దసరా నాటికి కొత్త టెండర్
- ఆరేళ్లలో పూర్తి చేయలేకపోయిన బీఆర్ఎస్‌కు సిగ్గుండాలి
- మరో 15 ఏళ్లు మాదే అధికారం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

ఉప్పల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను ఏడాదిన్నరలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. పాత కాంట్రాక్టును రద్దు చేసి, దసరాలోగా కొత్త టెండర్ పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడామని, ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పరిష్కారం చూపుతానన్నారు. ఆదివారం ఈ కారిడార్ పనులను పరిశీలించారు. మేడిపల్లి సీపీఆర్ఐ జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల అధికారులతో సమీక్షించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కూడా పనుల్లో జాప్యం జరిగిందని, కాంట్రాక్టర్ల మీద తోసివేయడానికి వీల్లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంచనా వ్యయం రూ.300 కోట్లు పెరిగినా సరే కొత్త టెండర్ వేసి ఈ కారిడార్‌ను 18 నుంచి 20 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఇది పూర్తయితే గంటన్నరలో వరంగల్ వెళ్లవచ్చన్నారు. 6 కి.మీ. ఈ కారిడార్‌ను ఆరేళ్లలో కూడా పూర్తిచేయలేకపోయారని, అందుకు పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. అసెంబ్లీకి రానందుకు మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు ఇప్పుడు మనం అనుభవించాల్సి వస్తోందన్నారు. కేసీఆర్ చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు తాము అధికారంలోకి వచ్చాక వడ్డీ రూ.7 వేల కోట్లతో పాటు అసలు కలిపి రూ.47 వేల కోట్లు చెల్లించామన్నారు. ప్రస్తుతం అన్ని సంక్షేమ కార్యక్రమాలకు అవుతున్న ఖర్చు రూ.36 వేల కోట్లు మాత్రమేన్నారు. కాంగ్రెస్ మాట ఇస్తే మడమ తిప్పదని, మరో 15 ఏళ్ల రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్ల సంఖ్య 175 చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కొత్త రెవెన్యూ చట్టం.. పేదల చుట్టం

దేశంలో భూ సంస్కరణల దిశగా ఇది పెను మార్పు.. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా రూపకల్పన

- భూధార్, ఆబాదీకి హక్కుల రికార్డులు
- ముసాయిదాపై చర్చలో వక్తలు

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న కొత్త రెవెన్యూ చట్టం.. పేదలు, రైతులకు చుట్టంగా మారనుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సేవలు సులభంగా, వేగంగా అందడంతో పాటు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని, ఒకరిద్దరి అవసరాలకు కాకుండా భవిష్యత్తు తరాలకూ ఉపయోగపడేలా రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్‌వోఆర్) చట్టం-24 ముసాయిదా ఉందని అన్నారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా దీని రూపకల్పన జరిగిందని.. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ పాత్ర కీలకమని కొనియాడారు. ఎన్నడూ లేని విధంగా ముసాయిదాను ప్రజాభిప్రాయం కోసం ఉంచడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆర్‌వోఆర్ చట్టం-24 ముసాయిదాపై డిప్యూటీ కలెక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథులుగా భూ చట్టాల నిపుణులు భూమి సునీల్‌కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ విద్య ఆచార్యుడు జీబీ రెడ్డి, విశ్రాంత రెవెన్యూ అధికారులు రవీంద్రబాబు, బాలరాజు, డిప్యూటీ కలెక్టర్లు కె.రామకృష్ణ, రమేష్ మాట్లాడారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టం కోసం 18 రాష్ట్రాల్లోని చట్టాలను నిశితంగా అధ్యయనం చేసి, వాటిలోని ఉత్తమ విధానాలకు చోటిచ్చినట్లు సునీల్ తెలిపారు. స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, రికార్డులో పేరు ఉన్నప్పుడే ఏ రైతుకైనా భూమిపై సంపూర్ణ హక్కులు దక్కుతాయన్నారు. వీటి కేంద్రంగానే కొత్త చట్టం ఉంటుందని, వ్యవసాయేతర భూములకు కూడా రికార్డు రాబోతుందని చెప్పారు. దేశంలో వస్తున్న మార్పులకు, కేంద్రం తెస్తున్న విధానాలకు అనుగుణంగా కొత్త చట్టం ఉందన్నారు. దీనిపై సలహాలు, సూచనలు చేయాలని కోరారు.



ముసాయిదాపై చర్చలో మాట్లాడుతున్న భూమి సునీల్

కొత్త చట్టంలో అధికారాల వికేంద్రీకరణ

ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం ఏ చిన్న సమస్య వచ్చినా సీసీఎల్ఏకు రావాల్సిన పరిస్థితి ఉందని లచ్చిరెడ్డి ఆరోపించారు. కొత్త చట్టంలో అధికారాల వికేంద్రీకరణ కారణంగా ప్రజలకు గ్రామ, మండల స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో భూ పరిపాలన వ్యవస్థలను బలోపేతం చేస్తూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కొత్త చట్టం అవసరమైందని వివరించారు. గత పాలకులు చట్టాన్ని చేసి ప్రజల్లోకి తెచ్చారని.. ఇప్పుడు మాత్రం ప్రజల నుంచే చట్టం రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త చట్టం ముసాయిదాను అందరికీ అందుబాటులో ఉంచిందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను మార్చుకునే వెసులుబాటు ఇందులో ఉందని తెలిపారు. గ్రామానికో రెవెన్యూ అధికారి సేవలందించే రోజులు కూడా రాబోతున్నాయన్నారు. అప్పీల్, రివిజన్ అవకాశం లేని ప్రస్తుత చట్టంతో.. ఏ చిన్న సమస్య వచ్చినా సివిల్ కోర్టుకు పోవాల్సిన పరిస్థితి ఉందని ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. ఇది ఇబ్బందికరమే కాక ఆర్థికంగా భారమని పేర్కొన్నారు. కొత్త చట్టం ముసాయిదా బాగుందని.. స్వల్ప మార్పులతో తక్షణమే అమల్లోకి తెస్తే అత్యున్నతమైనదిగా నిలిచిపోతుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు, ప్రజలు, రైతులకు మేలు చేసేదిగా ఉంటుందన్నారు.

విత్తన రాయితీలకు మంగళం

- ఎనిమిదేళ్లుగా గిరిజన రైతులకు ఎగనామం
- నిధుల కొరతే కారణమంటున్న ఐటీడీఏ
- సాగు పనిముట్ల సబ్సిడీ కూడా బంద్
- అటకెక్కిన ట్రైకార్ సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ సాయం లేక రైతులు సతమతం



భూపాలపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ఇవ్వాల్సిన విత్తన సబ్సిడీలకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) మంగళం పాడేసింది. చివరిగా 2016లో రాయితీ విత్తనాలు అందుకున్న రైతులకు ఎనిమిదేళ్లుగా ఐటీడీఏల సాయం అందడం లేదు. దీంతో రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, తిరిగి చెల్లించలేక విలవిల్లాడుతున్నారు. రాష్ట్రంలో ఏటూరునాగారం, భద్రాచలం, ఉట్నూర్ ఐటీడీఏల పరిధిలోని ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, అసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం లాంటి 11 జిల్లాల్లో సుమారు 2.78 లక్షల మందికి పైగా గిరిజన రైతులు దాదాపు 5లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వీరికి 2016 వరకు ఎస్టీ సబ్ ప్లాన్ స్పెషల్ కాంపోనెంట్ కింద సబ్సిడీపై చిరుధాన్యాలు, మొక్కజొన్న, సోయా, పత్తి, కంది, నువ్వులు మినుములు తదితర విత్తనాలను అందించేవారు. అయితే టీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత 2016లో కాగితాలపై బడ్జెట్ చూపించినా.. ఆచరణలో మాత్రం గిరిజన రైతాంగానికి మొండిచేయి చూపింది. 2016 నుంచి ప్రభుత్వం రాయితీ విత్తనాల సరఫరాను నిలిపివేసింది. గిరిజన సంఘాలు ఎనిమిదేళ్లుగా ప్రతీ సీజన్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారుల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగుతున్నా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని సమాధానం వస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన పోడు పట్టాల సమస్య పరిష్కారమైనా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలపై వాణిజ్య బ్యాంకులు.. చివరకు సహకార బ్యాంకులు కూడా పంట రుణాలను ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా ఇప్పట్లో వచ్చే పరిస్థితి కనిపించక గిరిజన రైతులు సతమతమవుతున్నారు. విత్తనాలే కాకుండా వ్యవసాయ పనిముట్లు, యాంత్రిక పరికరాల సబ్సిడీ లాంటివి కూడా పూర్తిగా నిలిచిపోయాయని వాపోతున్నారు. సమగ్ర భూ అభివృద్ధి పథకం కింద ఇవ్వాల్సిన కాంపోనెంట్లను కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ట్రైకార్ ద్వారా లభించాల్సిన సంక్షేమ పథకాలను కూడా పూర్తిగా అటకెక్కించారని పేర్కొంటున్నారు. పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో పాటు 5వ షెడ్యూల్ పరిధిలో ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లోనూ అన్ని సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగుతున్నా తెలంగాణలో మాత్రమే నిలిపివేశారని అంటున్నారు. ఈసారి బడ్జెట్‌లోనైనా గిరిజన రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆశించినా మొత్తం గిరిజన సంక్షేమానికి రూ.17 కోట్ల ఎస్డీఎఫ్ నిధులను మాత్రమే కేటాయించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎస్టీ సబ్ ప్లాన్ ప్రకారం రూ.119 కోట్లు కేటాయించాల్సి ఉందని, రాష్ట్రంలో ప్రభుత్వం మారిందే తప్ప గిరిజన రైతుల పట్ల సర్కారు తీరు మారడం లేదని ఆదివాసీ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

లెక్కలన్నీ కాగితాలపైనే..

గత ఎనిమిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేశాయి. ప్రతి బడ్జెట్‌లో అంకెల గారడీ చేస్తూ కాగితాలపైనే పథకాలను అమలు చేస్తున్నాయి. గిరిజన రైతులకు రాయితీలపై విత్తనాలకు సంబంధించి ఏటా ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగుతున్నా ఫలితం లేదు. ఈ విషయమై మంత్రులను కలిసినా స్పందన లేదు. ముఖ్యంగా ఆదివాసీ తెగల సంక్షేమానికి సంబంధించిన ఏ ఒక్క పథకమూ ఆచరణలో లేదు. మొన్నటి బడ్జెట్‌పై కొండంత ఆశ పెట్టుకున్నా.. ఈ ప్రభుత్వం కూడా మొండి చేయి చూపింది.

- దాట్ల నాగేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేత

ముచ్చర్ల ఫోర్త్ సిటీ వెనుక భూకుంభకోణం

» బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కార్

» ధరణి పేరు మారిస్తే అవినీతి ఆగుతుందా?: సంజయ్



సరూర్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని ముచ్చర్లలో నిర్మించతలపెట్టిన ఫోర్త్ సిటీ వెనుక భారీ భూకుంభకోణం దాగి ఉందని, వేలాది ఎకరాలను దిగమింగి ఆస్తులను కూడబెట్టుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం నగర శివారు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 20 లక్షల ఎకరాల భూములను దిగమింగిందని, ఇప్పుడు ధరణి పేరును భూమాతగా మార్చి, మిగిలిన భూములనూ మేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పన్నాగం పన్నుతున్నదని ఆరోపించారు. ధరణి పేరు మారిస్తే అవినీతి ఆగుతుందా అని ప్రశ్నించారు. ధరణి అక్రమాలపై వేసిన కమిటీ నివేదికపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్ చుట్టుపక్కల గల విలువైన భూములను కాజేయడానికే ప్రభుత్వం ఫోర్త్ సిటీని తెరపైకి తెచ్చిందని, దానికోసం భూసేకరణ బాధ్యతను కాంగ్రెస్‌లోని ఓ నాయకుడికి అప్పగించిందని ఆరోపించారు. ఈ సిటీ వల్ల స్థానిక రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల పండుగలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ.. హిందువుల పండుగలకు మాత్రం అత్తెసరు నిధులు ఇచ్చి చేతులు దులుపుకుంటోందని మండిపడ్డారు. హైదరాబాద్ శివారులోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ప్రతిపాదనను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. విలీనం ప్రతిపాదనకు వ్యతిరేకంగా తమ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ రూపొందించి ఉద్యమం చేపడతామని సంజయ్ తెలిపారు.

తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదే

» పార్టీ జాతీయ నేత బీఎల్ సంతోష్

» కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వలసలపై ఆరా

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదే అని పార్టీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలపై స్థానిక నాయకత్వం తక్షణం స్పందించాలని పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన సంతోష్.. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఏర్పాటు చేసిన రైతు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై సంతోష్ ఆరా తీశారు. ముఖ్యంగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్లారు..? కాంగ్రెస్ ఆకర్ష్ ప్రభావం ఎలా ఉంది..? కాంగ్రెస్ పాలన, వాగ్దానాల అమలుపై ప్రజలు ఏమనుకుంటున్నారు..? బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటి..? తదితర అంశాలపై ఆయన ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావాలని ఆయన ప్రధాన కార్యదర్శులకు సూచించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత తొలిసారిగా రాష్ట్రానికి వచ్చిన సంతోష్, పోలింగ్ బూత్‌స్థాయిలో పార్టీ పటిష్ఠతపై దిశానిర్దేశం చేశారు.

రేపు పదాధికారుల సమావేశం

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరగనుంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రుణ మాఫీ, నిరుద్యోగుల సమస్యలపై ప్రధానంగా చర్చించనున్నారని పార్టీ నేతలు తెలిపారు. ఈ నెల 11 నుంచి నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై సమీక్షించనున్నారు.

కేంద్ర నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» రాణిరుద్రమ

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్రం ఇచ్చిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్రఅధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. వివిధ శాఖలకు కేంద్రం కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటిపై అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... వైద్యరంగానికి ఇచ్చిన నిధులను మళ్లించారన్నారు. బస్తీ దవాఖానాల్లో బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు కూడా లేవని తెలిపారు. వైద్య రంగానికి సంబంధించి నిర్దిష్ట ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు టీచర్లను అవమానించేలా సీఎం వ్యాఖ్య

» మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లలో పదోతరగతి ఫెయిల్ అయినవారే ఉపాధ్యాయులుగా ఉన్నారంటూ.. వారిని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం తగదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో కూడా అధికశాతం శిక్షణ పొందిన ఉపాధ్యాయులే పనిచేస్తున్నారని గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల మెప్పుకోసం ప్రైవేటు ఉపాధ్యాయులను కించపరిచేలా సీఎం వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పోటీ ప్రపంచంలో చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని, సీఎం రేవంత్ సైతం తన మనవలు, మనవరాళ్లను ప్రైవేటు స్కూళ్లకు పంపే పరిస్థితి ఉంటుందన్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 2 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు బడులకు వెళ్లడానికి గల కారణాలను తెలుసుకొని వాటిని పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

సొసైటీలకు చేప పిల్లల బదులు నగదు ఇవ్వండి

» సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకార సొసైటీలకు చేపపిల్లలకు బదులుగా నగదును ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎంకు లేఖ రాశారు. మత్స్యకార సొసైటీలకు రాయితీపైన చేపపిల్లల పంపిణీ నివిత్తం.. జూలై నెలలోనే ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, అయితే నిబంధనలు సవరించాలంటున్న కంట్రాక్టర్లు.. టెండర్లలో పాల్గొనలేదని, దీంతో టెండర్ల ప్రక్రియ వాయిదా పడిందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో మత్స్యకార సొసైటీల పరిధిలోని చెరువులు, కుంటల విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుని దానికి అనుగుణంగా ఆయా సొసైటీలకు చేపపిల్లలకు బుదులుగా నగదును పంపిణీ చేయాలని లేఖలో సూచించారు.

అసెంబ్లీలో తిట్టుకునే దుస్థితి వచ్చింది

» ప్రజా సమస్యలపై మాట్లాడటం లేదు: కూనంనేని

సిరిసిల్ల రూరల్, వేములవాడ రూరల్: ఆగస్టు 4: అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు.. అమ్మలు, అక్కలంటూ తిట్టుకునే దుస్థితి వచ్చిందని, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా తిట్టుకోవడంపై అధికార, విపక్షాలు దృష్టిపెట్టాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం సమస్యను పరిష్కరించడంలేదన్నారు. ఉపాధి కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొనసాగించిన పథకాలను బంద్ చేసి కార్మికుల ఉపాధిని దెబ్బతీయడం సమంజసంకాదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని తాను కోరానని, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

రేషన్‌కు, సంక్షేమ పథకాలకు వేర్వేరు కార్డులు

» త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల్లో రేషన్ తీసుకునేందుకు, సంక్షేమ పథకాలను పొందేందుకు వేర్వేరుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్న అంశంపై ప్రభుత్వంలో చర్చ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సచివాలయంలో ఆదివారం ప్రజావాణి ఫిర్యాదులపై జరిగిన సమీక్ష సందర్భంగా.. ప్రజావాణికి కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పందిస్తూ రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అలాగే కొత్త పెన్షన్లనూ త్వరలో మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ డెస్క్‌లను బలోపేతం చేసేలా చర్యలు చేపడితే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించి ఫిర్యాదులు తగ్గిపోతాయని అభిప్రాయపడ్డారు. ప్రజావాణి విభాగంలో పని చేసేందుకు పూర్తి స్థాయి సిబ్బందిని కేటాయించాలని అధికారులు కోరగా.. తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎంచెప్పారు. ప్రజావాణి పనితీరుపై మూడు నెలకో సారి సమీక్ష నిర్వహిస్తానన్నారు.

మార్చి కల్లా యాదాద్రిలో విద్యుదుత్పత్తి

వచ్చే మార్చికల్లా ఎట్టి పరిస్థితుల్లో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరిగి తీరాల్సిందేనని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిపై సచివాలయంలో జెన్‌కో అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. యాదాద్రి నాలుగు యూనిట్లనూ దశల వారీగా వచ్చే మార్చి కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు.. అందుబాటులో ఉన్న స్థలాల్లో 20 సమీకృత గురుకుల సముదాయాలను నిర్మించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆయన విద్యాశాఖ, ఆర్అండ్‌బీ, ప్రైవేటు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో గురుకులాల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. తొలిదశ నిర్మాణాలు వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తికావాలన్నారు.

ఆస్పత్రుల్లో డాక్టర్లు ఏరీ?

(మొదటిపేజీ తరువాయి)

అనుభవం ఉన్న, నిపుణులైన వైద్యులకు ప్రభుత్వం స్థానచలనం కల్పించడంతో కీలక వైద్యసేవలు, శస్త్రచికిత్సల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పీజీ వైద్యులతోనే కాలం నెట్టురావాల్సివస్తోంది.

ఎవరికైనా ఏ పెద్ద రోగం వచ్చినా.. వెంటనే గుర్తుకు వచ్చేది ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులే. పిల్లలకు సుస్తీ చేస్తే నిలోఫర్ ఆస్పత్రి. ఆ ఆస్పత్రులకు రాష్ట్రం నలువైపుల నుంచి ఎందరో రోగులు వస్తుంటారు. రెండు రాష్ట్రాల్లోనూ అతిపెద్ద ఆస్పత్రులు హైదరాబాద్‌లోనే ఉండడంతో అవి ఎప్పుడు చూసినా రోగులతో కిక్కిరిసి పోతుంటాయి. ఒక్కో ఆస్పత్రిలో రోజుకు 40 నుంచి 100 వరకు మైనర్, మేజర్ సర్జరీలు జరుగుతుండగా, 20 నుంచి 40 వరకు ప్రసవాలు చేస్తుంటారు. ప్రతి రోజూ 2వేల నుంచి 3 వేల వరకు ఓపీ నమోదవుతుంది. రోజుకు 200 మందికిపైగా అడ్మిషన్లు ఉంటాయి. అయితే ఈ ఆస్పత్రుల్లో దీర్ఘకాలికంగా ఉంటున్న వైద్యులను ప్రభుత్వం ఒక్కసారిగా భారీ ఎత్తున బదిలీ చేసింది. ఉస్మానియా ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రి, గాంధీ మెడికల్ కాలేజీ, నిలోఫర్, ఎంఎన్‌జే ఆస్పత్రుల విభాగాల వైద్యులను ఇతర చోట్లకు బదిలీ చేశారు. మొత్తంగా.. హైదరాబాద్ నుంచి 135 మంది వరకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విభాగాల అధిపతులు, సూపరింటెండెంట్లను బదిలీ చేశారు. కానీ, ఇక్కడి నుంచి వెళ్లేవారే తప్ప, వచ్చేవారు ఉండడం లేదు. దీంతో ఆ ప్రభావం వైద్య సేవలపై పడుతోంది. శస్త్రచికిత్సలు వాయిదా పడుతున్నాయి. అత్యవసరమైనవి తప్ప ఇతర సర్జరీలు చేయడం లేదు.

అంతా ఇన్‌చార్జి సూపరింటెండెంట్లే... !

ఉస్మానియా ఆస్పత్రి, ఫీవర్, నిలోఫర్, చెస్ట్, మానసిక ఆస్పత్రి తదితర ఆస్పత్రుల సూపరింటెండెంట్లను బదిలీ చేసిన ప్రభుత్వం.. అక్కడ పూర్తికాలం పనిచేసే వైద్యాధికారులను నియమించలేదు. అదే ఆస్పత్రుల్లో పనిచేసే సీనియర్ వైద్యులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉస్మానియా, నిలోఫర్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, ఛాతీ వ్యాధుల వైద్యశాల, ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం, సరోజినీదేవి కంటి ఆస్పత్రి, కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్లను బదిలీ చేసి.. ఆయా ఆస్పత్రుల్లో సీనియర్ వైద్యులుగా ఉన్నవారికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్లుగా బాధ్యతలు అప్పగించారు. ఒక్క గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు స్థానంలో మాత్రమే కొత్తగా డాక్టర్ రాజకుమారిని పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఇతర ఆస్పత్రులకు ఇన్‌చార్జులతోనే సరిపెట్టడంతో.. పర్యవేక్షణ, అజమాయిషీ చేసే పూర్తి స్థాయి వైద్యాధికారి లేక అటు పాలన, ఇటు చికిత్సలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సూపరింటెండెంట్లు మాత్రమే కాకుండా.. ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లనూ బదిలీ చేశారు. ఇందులో భాగంగా.. ఉస్మానియా ఆస్పత్రి జనరల్ సర్జరీ విభాగం నుంచి నలుగురు ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లిపోయారు. శస్త్ర చికిత్సల సమయంలో అనస్తీషియా ఇచ్చే నలుగురు సీనియర్ ప్రొఫెసర్లనూ బదిలీ చేయడంతో సర్జరీలకు ఇబ్బందులు తలెత్తాయి.



ఉస్మానియా ఆస్పత్రిలో కిక్కిరిసిన రోగులు

అన్ని విభాగాల్లోనూ ఖాళీలే..!

ఉస్మానియా ఆస్పత్రిలో మొత్తం 41 వార్డులు ఉండగా.. 65 మంది ఇన్‌చార్జి నర్సులు షిఫ్టుల వారీగా వార్డుల్లోని రోగులకు సేవలందించేవారు. ఏకకాలంలో 41 మంది ఇన్‌చార్జి నర్సులను, 115 మంది స్టాఫ్ నర్సులను బదిలీ చేశారు. కానీ, వారి స్థానంలో తిరిగి ఎవరూ రాకపోవడంతో వార్డుల్లో రోగులను పట్టించుకునేవారు కరువయ్యారు. నర్సింగ్ విద్యార్థులతో పనులు చేయిస్తున్నప్పటికీ రోగులకు సకాలంలో మందులు, వైద్య సేవలు అందడం లేదని పలువురు రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో జనరల్ సర్జరీలో 6 పోస్టులు ఉండగా, మొత్తం ఆరుగురూ ఇటీవల బదిలీ అయ్యారు. జనరల్ మెడిసిన్‌లో కూడా 6 పోస్టులు ఉండగా, అందరు బదిలీ అయ్యారు.

> **వారంలో పూర్తి స్థాయి వైద్యులు**
>
> గాంధీ ఆస్పత్రిలో కొత్త వైద్యులు ఒక్కొక్కరుగా బాధ్యతలు చేపడుతున్నారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు చేరతారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యం అందిస్తున్నాం. శస్త్ర చికిత్సలు ఎక్కడా ఆపడంలేదు. సకాలంలోనే శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.
>
> - గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి

గైనకాలజీ విభాగంలో ఐదుగురికిగాను నలుగురు వైద్యులు, ఆర్థోపెడిక్ విభాగంలో ముగ్గురికిగాను ఇదరు, అనస్తీషియా విభాగంలో నలుగురిలో ముగ్గురు, అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్లు 8మందిలో ఆరుగురు బదిలీ అయ్యారు. రేడియాలజీలో ఇద్దరికి ఇద్దరు, డెంటల్ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లకు ఒకరు బదిలీ అయ్యారు. నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి అయితే బదిలీలతో ఖాళీ అయిపోయింది ఈ ఆస్పత్రిలో ఏకంగా వివిధ కేటగిరీలకు చెందిన 56 మంది బదిలీ అయ్యారు. కాగా, నిలోఫర్‌లో 11 మంది ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు 40 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు ఆస్పత్రి ఆర్ఎంవోను కూడా బదిలీ చేశారు. వెయ్యి పడకల నిలోఫర్ ఆసుపత్రిలో ఒకేసారి ఇంత మందిని బదిలీ చేయడంతో చికిత్సలు అందించడం సవాల్‌గా మారింది. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో 10 మంది ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్లు, ఇద్దరు అసిస్టెంట్లు, నలుగురు హెడ్‌నర్సులు, 8 మంది స్టాఫ్ నర్సులు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో కొత్త వారు రావాల్సి ఉంది. చెస్ట్ ఆస్పత్రిలో నలుగురు ప్రొఫెసర్లను బదిలీ చేయగా ఇద్దరిని మాత్రమే నియమించారు. ఆరుగురు ప్రొఫెసర్లు బదిలీ కాగా ఒక్కరినే నియమించారు. 24 మంది స్టాఫ్ నర్సులను బదిలీ చేయగా.. వారి స్థానంలో ఇప్పటికి కేవలం ఇద్దరే చేరారు. ఇక ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో నలుగురు ప్రొఫెసర్లను బదిలీ చేసి ఇద్దరిని మాత్రమే నియమించారు. ఎనిమిది మంది హెడ్‌నర్సులను బదిలీ చేసి నలుగురిని నియమించారు. స్టాఫ్‌నర్సులను ముగ్గురు బదిలీ చేసి.. ఒక్కరిని కూడా నియమించలేదు. బదిలీ చేసిన ఏడీఈ స్థానంలోనూ ఎవరినీ నియమించలేదు. సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో 12 మంది ప్రొఫెసర్లను, మరో ఎనిమిది మంది సిబ్బందిని బదిలీ చేశారు.

> **శస్త్ర చికిత్సలకు అంతరాయం**
>
> పెద్దాస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది లేకపోవంతో సర్జరీలు చేయడంలో ఆలస్యం జరుగుతోంది. ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యుల భర్తీ పూర్తి స్థాయిలో జరగకపోవడంతో శస్త్ర చికిత్సలను వాయిదా వేస్తున్నారు. దీంతో క్యూక్యూడీసీ భవనంలో జనరల్ సర్జరీ వార్డులో రోగుల రద్దీ పెరిగిపోయి జనరల్ మెడిసిన్ విభాగం వార్డులను కూడా వినియోగించుకుంటున్నారు. ఆ యూనిట్లలో జరగాల్సిన సర్జరీలు వాయిదా పడుతున్నాయి. మరో నాలుగు యూనిట్లలో ఉన్న వైద్యులు శస్త్ర చికిత్సలను చేసేందుకు ప్రయత్నించినా నర్సింగ్ సిబ్బంది లేరు. దీంతోపాటు అత్యంత ముఖ్యమైన విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం బదిలీపై పంపింది. గాంధీలోనూ ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు మాత్రమే వైద్యం చేస్తున్నారు. ఆర్థోపెడిక్, కార్డియోథెరపీ, యూరాలజీ, అనస్తీషియా ఇతర విభాగాలు ఖాళీగా ఉండడంతో శస్త్ర చికిత్సలు చేయలేకపోతున్నారు. ఇదిలా ఉండగా.. గాంధీ ఆస్పత్రిలో ప్రతి సోమ, మంగళవారాల్లో 2వేల మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటారు. మిగతా రోజుల్లో 1500 మంది ఓపీకి వస్తుంటారు. అయితే ఓపీ విభాగంతోపాటు పలు విభాగాల్లో పీజీ, జూనియర్ వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నారు. క్యాజువాలిటీ విభాగానికి వచ్చే రోగులు వైద్యం కోసం దాదాపు ఆరు గంటల పాటు వేచి ఉండాల్సివస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి వచ్చే బాధితులకు.. నర్సులు ఒక ఇంజక్షన్ ఇచ్చి సమయం పడుతుందని చెప్పి వెళుతున్నారు. అర్ధరాత్రి సమయంలో అత్యవసర పరిస్థితిలో క్యాజువాలిటీ వార్డుకు వచ్చే రోగులకు స్కానింగ్, ఎక్స్‌రే తీయాలంటే దాదాపు రెండు గంటల సమయం పడుతోంది.

అమెరికా వెళ్లిన సీఎం బృందానికి శుభాకాంక్షలు

» రాజకీయాలకన్నా తెలంగాణకే మా ప్రాధాన్యం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు అమెరికాతోపాటు దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ ప్రతినిధుల బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో వారు విజయం సాధించాలని ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఆకాంక్షించారు. గడిచిన పదేళ్లలో తమ ప్రభుత్వం ప్రపంచ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురాగలిగిందని, తద్వారా రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తేవడంతోపాటు 24 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించగలిగామన్నారు. ముఖ్యమంత్రి ప్రతినిధి బృందం ఇలాంటి కంపెనీలతో చర్చలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి, తమకు రాజకీయాలకన్నా.. తెలంగాణకే ప్రథమ ప్రాధాన్యమని కేటీఆర్ వెల్లడించారు. కాగా, ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో బలగం సినిమా ఉత్తమచిత్రంగా, దర్శకుడు వేణు యెల్దండి ఉత్తమ దర్శకునిగా ఎంపిక కావడంపట్ల కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు ఆ చిత్ర బృందానికి ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వేణు చేసిన కృషిని ప్రశంసిస్తూ.. ఇది మీ కష్టానికి దక్కిన ప్రతిఫలమని పేర్కొన్నారు.

కారం మెతుకులతో కడుపు నింపుకోవాలా?

» సర్కారీ బడి పిల్లల గతి ఇంతేనా?

» బిల్లుల పెండింగ్ వల్లే దుస్థితి: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కారం మెతుకులతో కడుపు నింపుకోవాల్సిందేనా.. మధ్యాహ్న భోజనంలో ఏం పెడుతున్నారు.. పిల్లలకు అందించే మెనూపై ప్రభుత్వం స్పందించాలని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం తిని కడుపు నింపుకొన్నారని ఓ ఫొటోను ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం అందించే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అటకెక్కించిన ప్రభుత్వం, ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలోనూ విఫలమైందన్నారు. భోజన సామగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్ ఉండడంవల్ల విద్యార్థులకు సరైన భోజనం అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను, కార్మికుల జీతాలను చెల్లించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని హరీశ్ రావు కోరారు.

న్యూయార్క్‌లో ముఖ్యమంత్రి రేవంత్

» పెట్టుబడులే లక్ష్యంగా భేటీలు

» రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేయడమే మనందరి కల: సీఎం

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నానికి న్యూయార్క్ నగరానికి చేరుకున్నారు. న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో రేవంత్ బృందానికి ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ బృందం పర్యటిస్తోంది. 10 రోజుల పాటు అమెరికా, దక్షిణకొరియాలో వివిధ నగరాల్లోని ప్రభుత్వ పెద్దలు, ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో సమావేశాలు, చర్చల్లో బృందం పాల్గొననుంది. వారితో చర్చించి, రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టాలని ఆహ్వానించనున్నారు. సీఎం రేవంత్ వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. కాగా "కీలకమైన న్యూయార్క్ నగరం నుంచే పెట్టుబడుల సాధన పర్యటన ప్రారంభించడం సముచితంగా భావిస్తున్నాను. ప్రవాస భారతీయులైన ఇక్కడి మన తెలుగు సోదరసోదరీ మణులు గుండెల నిండా ప్రేమ, ఆప్యాయలతో మాకు స్వాగతం పలకడానికి వచ్చారు. మనందరినీ ఏకం చేసే కల.. తెలంగాణను మరింత గొప్పగా అభివృద్ధి చేసుకోవడం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్‌లో ట్వీట్ చేసింది.



న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో సీఎం రేవంత్, సీఎస్ తదితరులు

తీరం.. ముమ్మందు ఘోరం

2,100 ఏడాది నాటికి పెరగనున్న సముద్ర మట్టం

» 282 గ్రామాల్లోని 13 లక్షల మంది ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం

» రాయలసీమలో మరింత కరువు

» ఏపీలో వాతావరణ మార్పులపై చెన్నై ఎన్‌సీఎస్‌సీఎం నివేదిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

భవిష్యత్తులో జరిగే వాతావరణ మార్పులతో ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరానికి ముప్పు పొంచి ఉంది. కర్బన ఉద్గారాలు విపరీతంగా పెరగడం వల్ల సాధారణ ఉష్ణోగ్రతలు పెరిగి సముద్రం మట్టం పెరగనుంది. 2,100 సంవత్సరం నాటికి రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీలు పెరుగుతాయి. దీనివల్ల సముద్రమట్టం 0.6 మీటర్లు పెరగనుంది. తీరప్రాంతంలో ఉన్న 282 గ్రామాల్లోని 12 లక్షల 90 వేల మంది ప్రజలకు ముప్పు పొంచి ఉంది. గోదావరి, కృష్ణా, పులికాట్ సరస్సు ప్రాంతాల్లో సముద్రం, నదీ జలాలు కలిసే ప్రాంతాల్లోకి సముద్రం మరింత చొచ్చుకు వస్తుంది. వాతావరణ మార్పులతో దక్షిణ ఏపీలో వర్షాలు కురిసే రోజులు పెరగనుండగా.. రాయలసీమలో ఉష్ణోగ్రతలు పెరిగి కరువు ఛాయలు నెలకొంటాయి. చెన్నైకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎం) రాష్ట్ర ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఈ విషయాలను పేర్కొంది.

తీరంలో మార్పులపై సర్వే

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై అధ్యయనం చేసేందుకు 2022 నవంబరులో ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఇది అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తోంది. అందులోభాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో వాతావరణ మార్పులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ఏపీ రివైజ్డ్ స్టేట్ యాక్షన్ ప్లాన్ తయారీ బాధ్యతను చెన్నైకు చెందిన ఎన్‌సీఎస్‌సీఎంకు అప్పగించింది. ఈ సంస్థ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులను గత ఉష్ణోగ్రతలు, ఛాయా చిత్రాలు, గత కొన్నేళ్లలో తీరంలో చోటుచేసుకున్న మార్పులు, క్షేత్రస్థాయి సర్వేలు, మ్యాపులను పరిశీలించింది. ఆధునిక రిమోట్ సెన్సింగ్ ద్వారానూ అధ్యయనం చేసింది. ఈ అధ్యయనం మేరకు స్టేట్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఎస్ఏపీసీసీ) పేరుతో రాష్ట్రానికి నివేదిక అందించింది. దీనిపై గత నెల 26న వివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో కూడిన స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో తుది నివేదికపై కూలంకుషంగా చర్చించింది. ఈ నివేదిక ప్రకారం 2,100 సంవత్సరం నాటికి ఏపీలో సాధారణ సగటు పగటి ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలు పెరుగుతాయని తేల్చింది. దీనివల్ల రాష్ట్రంలో తీరప్రాంత సముద్రమట్టం 0.6 మీటర్లు పెరుగుతుందని హెచ్చరించింది. ఫలితంగా రాష్ట్రంలో 43% తీరప్రాంతం వెరీ హైరిస్క్ జోన్, 35% తీరం హైరిస్క్ జోన్‌లోకి వెళ్లబోతోందని తెలిపింది. దీనివల్ల 282 తీరప్రాంత గ్రామాల్లో 1.29 మిలియన్ ప్రజలకు ముప్పు ఉందని తేల్చింది. 2,100 నాటికి చోటుచేసుకోబోయే వాతావరణ మార్పులవల్ల రాష్ట్రంలో వర్షాలు కురిసే రోజులు పెరుగుతాయని తెలిపింది. దక్షిణ ఏపీలో అధిక వర్షాలు ఉంటాయని, ఉత్తర ఏపీలో వానలు తగ్గుతాయని వివరించింది. తీరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కొద్దిపాటి ఉష్ణోగ్రతలు, దూరంగా ఉన్న రాయలసీమలో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని విశ్లేషించింది. దీనివల్ల కరువు ఛాయలు పెరిగి, తాగునీటి సమస్య ఉత్పన్నం అవుతుందని తేల్చింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతాయని తెలిపింది. ఒకరకంగా వాతావరణ పరిస్థితులు కొంతమేరకు దెబ్బతింటాయని వివరించింది. వాతావరణ మార్పులవల్ల రాష్ట్రంలోని ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు ముప్పు పొంచి ఉందని తెలిపింది.

నష్ట నివారణకు ఏం చేయాలంటే...!

- మడ అడవుల పునరుద్ధరణ చేపట్టాలి. ఇందు కోసం మత్స్యకారుల సాయం తీసుకోవాలి. తీరంలో కోత పెరిగిన ప్రాంతాల్లో ఆయిల్ పాం, సరుగుడు చెట్ల పెంపకం చేపట్టాలి. తీరంలో అలల తీవ్రత అధికంగా ఉన్నచోట కిలోమీటరు వరకు వీటిని పెంచాలి.

విద్యుత్ అధిక వినియోగం వల్ల 2005 నుంచి 20018 వరకు కాలుష్య ఉద్గారం 68 నుంచి 79% పెరిగింది. వాతావరణ మార్పులను అదుపులోకి తె చ్చేందుకు సోలార్, గ్రీన్‌హైడ్రోజన్‌ను ప్రోత్సహించాలి.

రహదారులపై 5లక్షల ఈవీలు, 51వేల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.

నాన్‌ఫారెస్ట్ ఏరియాలో 11.06లక్షల హెక్టార్లలో మొక్కలు నాటాలి. తోటలు కూడా పెంచాలి.

కరువు ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో తక్కువ తడి అవసరమయ్యే పంటలు, తృణ ధాన్యాల సాగును ప్రోత్సహించాలి.

9 నుంచి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

- ఖమ్మంలో నిర్వహణ.. ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- ముగింపు సభలకు పొంగులేటి, భట్టి హాజరు

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు 4: ఖమ్మంలో ఈ నెల 9 నుంచి 11 వరకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నారు. 'నెలనెల వెన్నెల', ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్యమండలి కళాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నాటిక పోటీలు జరగనున్నాయి. 'నెలనెల వెన్నెల' ఏడో వార్షికోత్సం సందర్భంగా ఈ దఫా నాటిక పోటీల ఏర్పాటుకు పూనుకున్నారు. మూడు రోజుల పాటు రోజుకు మూడు చొప్పున తొమ్మిది ఎంపిక చేసిన నాటికలను ప్రదర్శించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభిస్తారు. 10వ తేదీన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, 11న ముగింపు సభలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నారు. నాటిక పోటీల్లో పాల్గొనేందుకు రెండు రాష్ట్రాల నుంచి సుమారు 180 మంది నటీనటులు, ఇతర కళాకారులు విచ్చేయనున్నారు.

హరితనిధి 35 కోట్లు.. ఖర్చు 15 కోట్లే: కాగ్

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పచ్చదనమే లక్ష్యంగా పెట్టుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం హరితనిధి కింద వసూలు చేసిన నిధులను ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం చేసిందని కాగ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. హరిత హారానికి నిధుల కొరత ఉండకూడదని బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో హరిత నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధికి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తీసుకునే వేతనంలో నుంచి సంవత్సరానికి కొంత మొత్తాన్ని వసూలు చేసింది. అలాగే అగ్రిమెంట్లు, రిజస్ట్రేషన్, లైసెన్సుల జారీ- పునరుద్ధరణ, బార్లు, వైన్స్ లైసెన్సుల మంజూరు సమయంలో కూడా విరాళాల రూపంలో నగదును సేకరించింది. ఇలా మొత్తంగా 2022- 23 ఏడాదికి హరిత నిధికి రూ.35 కోట్ల నిధి సమకూరింది. ఈ నిధులను హరితహారంలో మొక్కల పెంపకానికి, పచ్చదనం అభివృద్ధి చేసేందుకు ఖర్చు చేయాలి.. కాని గత ప్రభుత్వం కేవలం రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు చూపించిందని, మిగతా రూ.20 కోట్లు ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం చేసిందని కాగ్ పేర్కొంది.

12న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి ఈనెల 12న స్పాట్ అడ్మిషన్లను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 8న ఖాళీలను ప్రకటించి, 8-11 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. 12న ఆయా కళాశాలలో ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు చేపడతారు. మరోవైపు ఇప్పటికే సీట్లు పొందిన వారికి ఇంటర్నల్ స్లైడింగ్‌కు అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి ఈనెల 5,6 తేదీల్లో స్లైడింగ్ ఆపన్లు నమోదు చేసుకుంటే, 8న సీట్లను కేటాయిస్తారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- ఒకచోట నలుగురు విద్యార్థులకు కామెర్లు
- మరోచోట 15 మంది విద్యార్థినులకు జ్వరం

వికారాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారు. ఈ మధ్యనే వికారాబాద్ అనంతగిరిపల్లి సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో పలువురు విద్యార్థులు పచ్చ కామెర్లకు గురవ్వగా, తాజాగా ఇదే పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కామెర్లతో ఆస్పత్రిలో చేరారు. అలాగే బూరుగుపల్లి సమీపంలోని మరో సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన దాదాపు 20 విద్యార్థినులు జ్వరాలతో వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్య సమస్య, పరిసరాల అశుభ్రత, నీటి కాలుష్యం వంటి సమస్యల కారణంగానే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. వసతిగృహాల నిర్వహణపై అధికారులు దృష్టి సారిస్తేనే విద్యార్థులు ఆరోగ్యకర వాతావరణంలో చదువుకోగలరని అంటున్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- ఆదివాసీ సంఘాల డిమాండ్

పంజాగుట్ట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణతోనే రాష్ట్రంలో ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని ఆదివాసీ సంఘాలు పేర్కొన్నాయి. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పలు సంఘాల నాయకులు తెలిపారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీ సామాజికవర్గాన్ని తొలగించి అడవి తల్లిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులకు న్యాయం చేయాలని వారు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆధార్ సొసైటీ అధ్యక్షుడు గొండి వెంకటరమణ, ఆదివాసీ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు బట్టా వేంకటేశ్వర్లు మాట్లాడారు. సుప్రీం తీర్పును అనుసరించి ఎస్టీ జాబితాలోని తెగలను జనాభా ప్రకారం లెక్కించి వర్గీకరించాలని కోరారు. ఇతర రాష్ట్రాలలో బీసీ, ఎస్సీగా ఉన్న ఆ సామాజికవర్గం, తెలంగాణలో ఎస్టీ జాబితాలో కొనసాగుతుండటం వల్ల ఆదివాసీలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు.

నేరస్థులకు శిక్ష పడేలా పోలీసుల కృషి

- భరోసా కేంద్రాలతో బాధితులకు మద్దతు: డీజీపీ

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నేరస్థులను ఉపేక్షించే పరిస్థితి లేదని, న్యాయస్థానాల్లో వారికి శిక్షపడేలా తెలంగాణ పోలీసులు కృషి చేస్తున్నారని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. బాధితులకు, ముఖ్యంగా వారిలో మహిళలు, పిల్లలకు అండగా నిలుస్తున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్రమైన నేరాల విషయంలో దర్యాప్తునకు పటిష్ఠమైన వ్యవస్థను అనుసరిస్తున్నామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది అత్యాచారం, పోక్సో కేసుల్లో 15 మందికి 20 ఏళ్ల జైలు, ఇద్దరికి 25 ఏళ్ల జైలు, 11 మందికి జీవిత ఖైదుతో కలిపి 28 మందికి శిక్ష పడినట్లు పేర్కొన్నారు. దోషులు తప్పించుకోకుండా పక్కా ఆధారాలతో నేరం రుజువు చేస్తూ చార్జిషీట్ దాఖలు చేయడంతోనే తెలంగాణ పోలీసులు ఈ విజయం సాధించారన్నారు. పోలీసు విభాగాలు కేసుల విచారణ సమయంలో భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే ఏ మాత్రం సహించబోమని, కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల్లో 95 శాతం నేరాలు పరిచయమున్న వ్యక్తులే చేస్తున్నారన్నారు.

పోలింగ్ శాతంపై దుష్ప్రచారం

- ఎన్నికల ప్రక్రియకు అప్రతిష్ఠ తెచ్చేందుకే...
- ఎలాంటి తేడాలు లేవు .. ఎలక్షన్ కమిషన్ వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 4: పోలింగ్ శాతాల్లో భారీగా తేడాలు ఉన్నాయంటూ వస్తున్న విశ్లేషణలను ఆదివారం ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ప్రకటించిన ఓట్ల శాతానికి, తుది ఓట్ల శాతానికి మధ్య మరీ ఎక్కువగా తేడా ఉందంటూ విశ్లేషణలు వచ్చాయి. అయితే ఇది తప్పుడు ప్రచారమని, ఎన్నికల ప్రక్రియకు అప్రతిష్ఠ కలిగించేందుకు జరుగుతున్న ప్రయత్నమని ఆరోపించింది. ఓట్ల శాతంలో భారీగా తేడాలు ఉన్నట్టు ఓట్ ఫర్ డెమొక్రసీ అనే సంస్థ తన విశ్లేషణలో గుర్తించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఈ తేడా అధికంగా ఉన్నట్టు తెలిపింది. తొలుత ప్రకటించిన పోలింగ్ శాతం కన్నా తుది పోలింగ్ శాతం బాగా ఎక్కువగా ఉందని పేర్కొంది. దీనిపై స్పందించాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని డిమాండు చేసింది. దాంతో ఎన్నికల సంఘం ఎక్స్ ద్వారా సమాధానాలు ఇచ్చింది. చాలా పోలింగ్ స్టేషన్ల వద్ద సాయంత్రం ఏడు గంటల తరువాత కూడా ఓటర్లు లైనుల్లో నిల్చొని ఉన్నారని తెలిపింది. అందువల్ల వాటి పోలింగ్ సమాచారం మరుసటి రోజునే తెలిసిందని పేర్కొంది. ఆ కారణంగానే ప్రాథమిక ఓటింగ్ శాతానికి, తుది శాతానికి మధ్య తేడా కనిపించిందని వివరించింది. నిబంధనలను కచ్చితంగా పాటించి పోలింగ్ శాతాన్ని నమోదు చేసినట్టు పేర్కొంది. పోలింగ్ శాతంపై అభ్యర్థులెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపింది. వివిధ కారణాలను పేర్కొంటూ 2019లో 138 ఎన్నికల ఫిర్యాదులు రాగా ప్రస్తుతం వాటి సంఖ్య 79కి తగ్గిందని వివరించింది.

'గుట్ట'పై పుణ్య స్నానాలకు ఓకే

11 నుంచి అందుబాటులోకి విష్ణు పుష్కరిణి.. దంపతులు, భక్తులకు రూ.500 టిక్కెట్

గిరి ప్రదక్షిణ భక్తులకు ఉచిత ప్రవేశం.. టికెట్ తీసుకోనివారు నీళ్లు చల్లుకోవచ్చు



యాదగిరిగుట్టపై ఉన్న విష్ణు పుష్కరిణి

యాదాద్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో పాత ఆచారాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 11 నుంచి కొండపై ఉన్న విష్ణు పుష్కరిణిలో స్నానం చేసేందుకు అనుమతిస్తోంది. ఇందుకోసం దంపతులు, భక్తులకు రూ.500 టికెట్ ధర నిర్ణయించి ఆర్జిత సేవల జాబితాలో చేర్చనుంది. స్వామివారిని దర్శించుకునే భక్తులు కొండపైన విష్ణు పుష్కరిణి(కొండపైన గుండం)లో స్నానం ఆచరించడం ఆచారంగా వచ్చేది. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండ కింద లక్ష్మీ పుష్కరిణిని ఏర్పాటు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం కొండపైన ఉన్న విష్ణు పుష్కరిణిని స్వామివారి కైంకర్యాల కోసం మాత్రమే వినియోగిస్తున్నారు. సంతానం కలగని దంపతులు స్వామివారి సన్నిధిలోని విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం చేసిన పక్షంలో సంతానం కలుగుతుందని విశ్వాసం. ఆ ఆచారాన్ని పునరుద్ధరించి విష్ణు పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు అవకాశం కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పుష్కరిణిలో నీటిని నింపి ఈ నెల 11న స్వాతి నక్షత్రం రోజున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులోకి తేనున్నారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు విష్ణు పుష్కరిణిలో ఉచితంగా స్నానాలు ఆచరించేందుకు అనుమతిస్తున్నట్లు ఈవో తెలిపారు. గిరి ప్రదక్షిణ చేయని, టికెట్ కొనుగోలు చేయని భక్తులు పుష్కరిణి నీటిని తలపై చల్లుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణిలోకి చెత్తా చెదారం చేరకుండా, కోతులు దూకకుండా, భక్తులకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు.. స్నానం ఆచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయనున్నారు.

పాత ఆచారాల పునరుద్ధరణ..

కొండపైన రాత్రి బస చేసేందుకు డార్మెటరీ హాల్, కొబ్బరికాయలు కొట్టే స్థలం, గిరి ప్రదక్షిణ వంటి పాత ఆచారాలను ఇప్పటికే పునరుద్ధరించారు. 2016లో గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణం చేపట్టగా.. కొండపైన ఇతర నిర్మాణాలు లేకుండా వైటీడీఏ మాస్టర్ ప్లాన్‌లో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ ఉద్ఘాటన త్వాత కొండపైన పాత ఆచారాలను అధికారులు రద్దు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాత ఆచారాల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు.

'వక్ఫ్' అపరిమిత అధికారాలకు చెక్!

ప్రతిదీ తన ఆస్తేనని బోర్డు ఏకపక్షంగా ప్రకటించడం కుదరదు.. ప్రతిపాదిత భూముల తనిఖీ తప్పనిసరి

- బోర్డుల్లో మహిళలకూ చోటు
- ఆస్తుల పరిరక్షణ బాధ్యత కలెక్టర్లకు
- 40 సవరణలకు కేంద్ర కేబినెట్ ఓకే
- ప్రస్తుత సమావేశాల్లోనే సవరణ బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: వక్ఫ్ చట్టంలో పలు సవరణలకు కేంద్రం సమాయత్తమైంది. ప్రధానంగా.. కనిపించిన ప్రతి భూమీ, ఆస్తీ తమదే నంటూ నియంత్రణలోకి తీసుకుంటున్న వక్ఫ్ బోర్డుల అపరిమిత అధికారాన్ని కట్టడి చేయనుంది. మరింత పారదర్శకత కోసం సదరు భూములు/ఆస్తుల విషయంలో కూలంకష తనిఖీలను తప్పనిసరి చేయనుంది. అలాగే వక్ఫ్ బోర్డుల్లో మహిళలకూ తప్పనిసరి చోటు కల్పిస్తూ వక్ఫ్ చట్టంలోని 9,14 సెక్షన్లను సవరించాలని ప్రతిపాదించింది. దాదాపు 40 సవరణలతో కూడిన సవరణ బిల్లును మోదీ కేబినెట్ ఇటీవల ఆమోదించింది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే దీనిని ప్రవేశపెట్టనుంది. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగానికి అరికట్టేందుకు వాటిపై పర్యవేక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని కేంద్రం తన బిల్లులో పేర్కొంది. వక్ఫ్ బోర్డులకు ప్రస్తుతం విస్తృత అధికారాలు ఉన్నాయి. ఏదైనా భూమి/ఆస్తిని తమది ప్రకటించడం ద్వారా పలు వివాదాలకు, అధికార దుర్వినియోగానికి కారణమవుతున్నాయి. ఉదాహరణకు 2022 సెప్టెంబరులో తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా శ్రీరంగం తాలూకా తిరుచెందురై గ్రామం మొత్తంపై తనకే హక్కు ఉందని తమిళనాడు వక్ఫ్ బోర్డు ప్రకటించింది. కావేరీ తీరాన ఉన్న సుప్రసిద్ధ చంద్రశేఖర స్వామి ఆలయం, దాని భూములు కూడా తనవేనని పేర్కొంది. ఈ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌కు వెళ్లినప్పుడు.. వక్ఫ్ బోర్డు నుంచి ఎన్‌వోసీ తీసుకురావాలని తిరుచిరాపల్లి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. గ్రామంలోని మొత్తం 480 ఎకరాల భూమి తనదేనని, ఇందులో క్రయవిక్రయాలు జరపాలంటే తన నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు సబ్‌రిజిస్ట్రార్‌కు ఇదివరకే సమాచారం పంపింది. దాంతో సదరు సబ్‌రిజిస్ట్రార్ ఆ వ్యక్తికి పై సూచన చేశారు. దీనిపై గ్రామస్తులు మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఊరంతా తనదంటున్న వక్ఫ్ బోర్డు తీరుపై ధ్వజమెత్తారు. దీనిపై పెద్దఎత్తున నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. దరిమిలా ఓ రెవెన్యూ అధికారి ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం క్రయవిక్రయాలను ఎప్పటిలాగే కొనసాగించాలని నిర్ణయించారు. ఇలాంటి వివాదాలను అరికట్టేందుకు కేంద్రం చట్ట సవరణలకు ఉపక్రమించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పైగా వక్ఫ్ బోర్డుల్లో తమకు చోటివ్వడం లేదని, చట్టంలో మార్పులు తీసుకురావాలని ముస్లిం మేధావులు, మహిళలు, షియాలు, బొహ్రా ముస్లింలు చాలాకాలంగా కోరుతున్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ సవరణలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఒమన్, సౌదీ అరేబియా, టర్కీ వంటి ముస్లిం దేశాల్లో కూడా ఏ సంస్థకూ భూములు, ఆస్తులపై గుత్తాధిపత్యం లేదని ప్రాథమిక అధ్యయనంలో తేలింది. హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్‌ల్లో ఈ ఏడాది అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జమ్మూకశ్మీరు కేంద్ర పాలిత ప్రాంతంలో కూడా ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు చేపట్టాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వక్ఫ్ ఆస్తులను లాక్కోవడానికి మోదీ కుట్ర: అసదుద్దీన్

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సంపదను దోచుకునేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరించడానికి ప్రయత్నిస్తోందని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు స్వయం ప్రతిపత్తికి, మత స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా వక్ఫ్ చట్టంలో సవరణలకు కేంద్రం ప్రతిపాదనలు తీసుకువచ్చిందని ఆయన విమర్శించారు. ఆదివారం ఆయన మజ్లిస్ ప్రధాన కార్యాలయం దారుల్‌సలాంలో విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులపై పరిపాలనాపరంగా వివాదాలను సృష్టించి, ఆ సమస్యకు పరిష్కారం పేరిట వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. వక్ఫ్ చట్టానికి కేంద్రం ప్రతిపాదించిన సవరణలను పరిశీలిస్తే ఆరెస్సెస్ హిందూత్వ ఎజెండాను బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. వక్ఫ్ ఆస్తులపై వివాదాలుంటే ఆ సమస్యకు పరిష్కారం న్యాయవ్యవస్థ పరిధిలో ఉంటుందని అసదుద్దీన్ పేర్కొన్నారు. కానీ, సమస్యకు పరిష్కారం పేరుతో చట్ట సవరణ చేసి, దర్గాలు, మసీదులను లాక్కునే ప్రయత్నం చేస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు.

సహించేది లేదు: ముస్లిం పర్సనల్ లా బోర్డు

వక్ఫ్ బోర్డుల చట్ట ప్రతిపత్తి, అధికారాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకొన్నా సహించేది లేదని మరోవైపు అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు హెచ్చరించింది. వక్ఫ్ చట్టాన్ని సవరించి ప్రతిపాదనను తిరస్కరించవలసిందిగా ఎన్‌డీఏ పక్షాలకు బోర్డు విజ్ఞప్తి చేసింది.

కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

- తిహాడ్‌లో ఆమెతో కేటీఆర్, హరీశ్‌రావు ములాఖత్ కూడా నేడే



న్యూఢిల్లీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది. ఆమెను మార్చి 15న తొలుత ఈడీ, అనంతరం ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను గతంలోనే ట్రయల్ కోర్టు కొట్టివేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా అక్కడా నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులోనే మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జూలై 22న విచారించిన ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా కేసును సోమవారాని(ఆగస్టు 5)కి వాయిదా వేశారు. దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు తిహాడ్ జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు కేటీఆర్, హరీశ్‌రావు సోమవారం కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్

తమ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. దీనిపై న్యాయ నిపుణులతో చర్చించేందుకు కేటీఆర్, హరీశ్‌రావులు శనివారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులను కలిసి సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. హైకోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడాలా? లేక సుప్రీంకోర్టును ఆశ్రయించాలా? అనే దానిపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అప్పట్లో వివాహేతర సంబంధం ఉండేది!

- కమలా హారీస్ భర్త ఒప్పుకోలు

వాషింగ్టన్, ఆగస్టు 4: మొదటి భార్యతో కాపురం చేసిన సమయంలో తనకు వివాహేతర సంబంధం ఉండేదని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారీస్ భర్త డగ్ ఎమ్‌హాఫ్ అంగీకరించారు. కమలా హారీస్ ఆయనకు రెండో భార్య కావడం గమనార్హం. ఈ విషయాలను ఓ న్యూస్ చానెల్ వెల్లడించింది. మొదటి భార్య కెర్‌స్టిన్ ఎమ్‌హాఫ్‌తో కలిసి ఉన్న సమయంలో ఆయనకు ఓ స్కూలు టీచరుతో సంబంధం ఉండేది. వారి పిల్లలు అదే పాఠశాలలో చదివేవారు. ఆమె మాత్రం ఆ పిల్లలకు బోధించేది కాదు. డగ్ కారణంగా 2009లో ఆమె గర్భం దాల్చింది. కానీ గర్భస్రావం కావడంతో ఆమె తల్లికాలేకపోయింది. ఈ కారణంగానే డగ్, కెర్‌స్టిన్‌లు 2010లో విడిపోవాల్సి వచ్చింది. వివాహేతర సంబంధం కారణంగా మొదటి భార్యతో ఇబ్బందులు ఎదురయ్యాయని డగ్ అంగీకరించారు. ఇందుకు బాధ్యత తీసుకుంటున్నట్టు చెప్పారు. వారికి కలిగిన సంతానం ఎల్లా, కోల్‌లు ఆయనతో పాటే నివసించడం ప్రారంభించారు. అనంతరం ఆయనకు 2013లో కమలా హారిస్‌తో పరిచయం ఏర్పడింది. 2014లో వారి వివాహం జరిగింది. అప్పటికే మేజర్లయిన ఎల్లా, కోల్‌లు కమలతోనే నివసించడం ప్రారంభించారు. డగ్.ఎంటర్‌టెయిన్‌మెంట్ లాయర్‌గా విధులు నిర్వరించే వారు. డగ్ వ్యక్తిగత జీవితం, వివాహేతర సంబంధాల గురించి కమలా హారిస్‌కు, పార్టీ నాయకులకు పూర్తిగా తెలుసునని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. కమలా హారిస్‌ను పిల్లలు ఎల్లా, కోల్‌లు 'మామలా' అని పిలుస్తుంటారు. కోల్ వివాహాన్ని గత ఏడాది కమలా హారిసే దగ్గరుండి జరిపించడం విశేషం. కెర్‌స్టిన్ ఎమ్‌హాఫ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ పలు కారణాల దృష్ట్యా డగ్‌తో విడిపోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే ఆయన పిల్లలను జాగ్రత్తగా చూసుకొనే మంచి తండ్రి అని ప్రశంసించారు. తాను, డగ్, కమలా హారిస్‌లు మంచి స్నేహితులుగా కొనసాగుతున్నామని పేర్కొన్నారు.

వలసదార్లకు వ్యతిరేకంగా బ్రిటన్‌లో ఆందోళనలు

లండన్, ఆగస్టు 4: వలసదార్లకు వ్యతిరేకంగా బ్రిటన్ వ్యాప్తంగా పరమ ఛాందసవాద సంస్థలు తమ ఆందోళనలను ఉధృతం చేశాయి. పలు చోట్ల అల్లర్లు, ఘర్షణలు చోటు చేసుకోవడంతో పోలీసులు కనీసం వంద మందిని అరెస్టు చేశారు. సెలవు కావడంతో ఆదివారం పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు పాల్గొన్నారు. రాళ్లు, ఇటుకలు విసరడం, శరణార్థులు ఉంటున్న హోటళ్ల అద్దాలను పగులగొట్టడం, షాపులపై దాడి చేసి నిప్పుపెట్టడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. లివర్‌పూల్, బ్రిస్టల్, లీడ్స్, బ్లాక్‌పూల్, బెల్‌ఫాస్ట్, నోటింగ్‌హామ్, మాంచెస్టర్‌లలో ఆందోళనలు జరిగాయి. పోలీసులు, ఆందోళనకారుల మధ్య పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తీవ్రవాదుల్లా వ్యవహరించే ఆందోళనకారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడాన్ని తాను సమర్థిస్తానని ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించారు. అల్లర్లు చేసేవారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హోం మంత్రి వైవెట్టే కూపర్ హెచ్చరించారు. వలసవచ్చిన ముస్లిం ఒకరు డ్యాన్స్ క్లాస్‌పై కత్తితో దాడి చేసి ముగ్గురు బాలికల మృతికి కారకుడయ్యాడంటూ తప్పుడు వదంతులు వ్యాపించడంతో ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు.

కోచ్ ఫ్యాక్టరీ.. తూచ్

- విభజన హామీపై మాట మార్చిన కేంద్రం
- కలగానే కాజీపేటలో బోగీ పరిశ్రమ
- వ్యాగన్ కార్ఖానా మంజూరుతోనే సరి

వరంగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి వరంగల్ వాసులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు కలగానే మిగులుతున్నాయి. 55 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు, ఉద్యోగులు కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేదు. 2014లో ఏపీ విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై హామీ ఇచ్చిన కేంద్రం, 2023లో వ్యాగన్ తయారీ పరిశ్రమను ప్రకటించి చేతులు దులుపుకుంది. వేలాది మందికి ఉపాధి కల్పించే కోచ్ ఫ్యాక్టరీ రాకపోవడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మరోవైపు దక్షిణ భారతదేశానికి గేట్‌వేగా ఉన్న కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా చేయాలనే డిమాండ్‌ను సైతం కేంద్రం పరిగణనలోకి తీసుకోవటంలేదు. ఉత్తర, దక్షిణ ధ్రువాలను కలపడంతో పాటు బొగ్గు రవాణాలో కీలకంగా ఉన్న కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ.. ఇక్కడి ప్రజల ఎన్నో ఏళ్ల కల. 2014లో రాష్ట్ర విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఇందు కోసం గత ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అయితే 2017లో దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని కేంద్రం స్పష్టం చేసింది. దీనికి విరుద్ధంగా 2018 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని లాతూర్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రూ.625కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఒత్తిడి పెరగటంతో 2023 జూలై 8న కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమకు ప్రధాని మోదీ భూమి పూజ చేశారు. 2025లోగా పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. అయితే కోచ్ ఫ్యాక్టరీతో సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని.. వ్యాగన్ పరిశ్రమ ద్వారా 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు.

డివిజన్‌కు అన్ని అర్హతలు..

ఏపీ నుంచి విడిపోయాక రైల్వే కనెక్టివిటీ తక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ మారింది. దీంతో తెలంగాణలో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లాయి. అయితే ప్రధానంగా దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. కాజీపేట మీదుగా ఉత్తర, మధ్య భారతదేశానికి రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ స్టేషన్ల మీదుగా నిత్యం సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట మీదుగానే జరుగుతోంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ముందంజలో ఉంది. తెలంగాణలో ప్రస్తుతం హైదరాబాద్, సికిందరాబాద్ రైల్వే డివిజన్లు మాత్రమే ఉన్నాయి. ఆ రెండు కార్యాలయాలు ఒకే చోట ఉండటంతో వాటిని వేరుగా చూడటం లేదు. ఇక సికింద్రాబాద్ డివిజన్‌కు అతి సమీపంలో ఉండటం వల్లే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్రం చెబుతోందని.. అయితే విజయవాడకు కేవలం 30కి.మీ. దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్, సికిందరాబాద్‌కు 120కి.మీ. దూరంలో ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నల్లగొండ జిల్లాలో కొంత భాగం గుంటూరు డివిజన్‌లో, మరికొంత భాగం సికిందరాబాద్‌లో కొనసాగుతోంది. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు కాజీపేట డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేక దృష్టి పెట్టి కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ కోసం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేయాలి

కాజీపేటలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ఏర్పాటు చేయాలి. కోచ్ ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. దక్షిణ మధ్య రైల్వేలో అధిక అదాయం కాజీపేట నుంచే వస్తోంది. రైల్వే డివిజన్ ఏర్పాటు చేసే అన్ని అర్హతలు కాజీపేటకు ఉన్నాయి. కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యోగ జేఏసీ పోరాటం చేస్తుంది.

- దేవులపల్లి రాఘవేందర్, తెలంగాణ రైల్వే ఉద్యోగుల జేఏసీ చైర్మన్

బస్సులు ఫుల్లు.. బాకీలూ ఫుల్లే!

లెక్కల్లోనే ఆదాయం.. ఆర్టీసీ చేతికందని వైనం.. 'మహాలక్ష్మి' పథకం బకాయిలు రూ.2,400 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్టీసీ పరిస్థితి 'బస్సులు ఫుల్లు.. బాకీలూ ఫుల్లే' అన్నట్టు తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ విపరీతంగా పెరిగింది. మహిళలకు 'జీరో టిక్కెట్లు' ఇస్తుండడంతో ఆదాయం వచ్చినట్టు ఆర్టీసీ లెక్కల్లో కన్పిస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ చార్జీల సొమ్మును విడుదల చేయకపోవడంతో బాకీలూ ఫుల్లుగానే ఉన్నాయి. ఉచిత ప్రయాణాన్ని ఇప్పటివరకు సుమారు 72 కోట్ల మంది మహిళలు వినియోగించుకోగా ప్రభుత్వం రూ.2,400 కోట్ల వరకు ఆర్టీసీకి చెల్లించవలసి ఉంది. ఈ నిధులు అందక కొత్త బస్సుల కొనుగోలు, బస్ స్టేషన్ల మరమ్మతులు నిలిచిపోయాయి. ఈ పథకానికి రోజుకు రూ.10 కోట్లకు పైగా ఆర్టీసీ ఖర్చు చేస్తోంది. మరోవైపు, రోజుకు ఒక్కో డిపో నుంచి రూ.లక్ష అదనపు ఆదాయం లక్ష్యంగా పనిచేయాలనే ఆదేశాలతో ఆర్టీసీ కార్మికులు సతమతమవుతున్నారు.

పీఆర్‌సీ బాండ్ల బకాయిలేవీ?

పీఆర్‌సీ బాండ్ల బకాయిలు, రిటైర్డ్ కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు అందించలేక ఆర్టీసీ సతమతమవుతోంది. 2020 అక్టోబరులో చెల్లించాల్సిన 2013 పీఆర్‌సీ బాండ్ల బకాయిలు రూ.280 కోట్లు ఫిబ్రవరిలో విడుదల చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పటి వరకు రూ.80 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. అలాగే 2017 పీఆర్‌సీ బకాయిలు సుమారు రూ.418 కోట్ల చెల్లింపుపై స్పష్టత లేకపోవడంపై కార్మికులు ఆందోళన చెందుతున్నారు. వారి వేతనాల నుంచి మినహాయించిన సుమారు రూ.3,850 కోట్లకుపైగా సొమ్మును ఆర్టీసీ దారి మళ్లించినట్టు ఫిర్యాదులు ఉన్నాయి. రవాణా శాఖకు వాహనాల పన్ను రూపంలో సుమారు రూ.692.58 కోట్లు ఆర్టీసీ బకాయిలు ఉన్నట్టు తెలిసింది.

రూ.310 కోట్లతో నడిచేదెలా?

కార్మికుల వేతనాలు, డీజిల్, ఇతర అవసరాలకు ఆర్టీసీ నెలకు సుమారు రూ.370 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ వచ్చే రూ.310 కోట్ల ఆదాయం చాలకపోవడంతో ఆర్టీసీ అధికారులు బ్యాంకులపై ఆధారపడుతున్నారు. ఓడీ రూపంలో రుణం తీసుకుని కార్మికులకు వేతనాలు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో రుణ భారం పెరిగిపోయింది. నెలకు సుమారు రూ.65 కోట్ల వరకు బ్యాంకులకు చెల్లించవలసి ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కార్మికుల బకాయిలపై సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రవాణా శాఖకు కేటాయింపులు రూ.4084.43 కోట్లకు సవరించినప్పటికీ విడుదలపై కార్మికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.